ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 144 పేజీలు: 12 వెల: 6.50

అమెరికా పౌరసత్వం ఇక మరింత ఖరీదు 9లో

టిఎంసిలో పెరిగిన ఆధిపత్య పోరు



రాష్ట్రపతి నుంచి పద్మాలు అందుకుంటున్న కెటి థామస్, నోరి దత్తాత్రేయుడు, మమ్ముట్టి, మురళీమోహన్, రాజేంద్రప్రసాద్

## వికసిత 'పద్మా'లు

### రెండో విడత పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

**పద్మవిభూషణ్:** పి. నారాయణన్, జస్టిస్ కెటి థామస్

**పద్మ భూషణ్:** మమ్ముట్టి, నోరి దత్తాత్రేయుడు, డా. విజయ్ అమృతరాజ్, అల్కాయాజ్ఞిక్ మొ॥

**పద్మశ్రీ:** మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్, మాధవన్, రోహిత్ శర్మ, వెంపటి శశిశేఖర్ మొ॥

**న్యూఢిల్లీ,జూన్ 23:** దేశంలో పద్మ అవార్డుల రెండో విడత ప్రధానం అత్యంత ఘనంగా జరిగింది. రాష్ట్రపతిభవన్‌లోని దర్బారీహాలులోజరిగిన ఈకార్యక్రమంలో మళయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీం మాజీ న్యాయమూర్తి జెస్టిస్ కెటి థామస్‌లు పద్మవిభూషణ్‌లు అందుకోగా సినీరంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తోపాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు డా.విజయ్ అమృత్‌రాజ్, డా.ఎస్కేఎం మేలినాధన్, శిబుసోరెన్ (మరణా >>2

# రిటైర్మెంట్ 62కు పెంపు

### ప్రభుత్వరంగ సంస్థలు, గురుకులాలు, సొసైటీ ఉద్యోగుల విరమణ వయసు పెంచిన ప్రభుత్వం

### 11వేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానమే

### రూ. 34 వేల కోట్లు పైగా పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం

### సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో పలు అంశాలపై కీలక నిర్ణయాలు



మంగళవారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం దృశ్యం

**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్‌లో 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. సుదీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంపుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మెమో 57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్ ) నుంచి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఇటీవల పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34 వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35 వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఇపిబి సమావేశంలో ఆమోదించిన కంపెనీలు, పెట్టుబడుల వివరాలు గమనిస్తే ఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ, రూ. 6000 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉద్యోగ అవకాశాలు అనంతపురంలో ఆరాధ్య బయోఫ్యూయెల్ ప్రై.లిమిటెడ్ రూ. 75.78 కోట్ల పెట్టుబడి, 402 మందికి ఉద్యోగాలు, కృష్ణా జిల్లాలో సమయ్ బయో సీఎన్జీ చిత్తూర్ ప్రై.లిమిటెడ్ రూ.120 కోట్లు పెట్టుబడి, 260 ఉద్యోగాలు, చిత్తూరుజిల్లాలో శ్రీవాయు బయోఫ్యూయెల్స్, రూ.67.22 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు, కాకినాడ జిల్లాలో. ఆంధ్రా బయో ఎనర్జీ, రూ.96.40 కోట్ల పెట్టుబడి, 518 మందికి ఉద్యోగాలు, అనకాపల్లిజిల్లాలో .విక్సిత్ అగ్రి గ్రీన్ ఎనర్జీ, రూ.141.65 కోట్లపెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు, >>2

## పరవాడ ఫార్మాసిటీలో భారీ అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాద దృశ్యం

### ఇద్దరు కార్మికులు సజీవదహనం

### దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో హఠాత్తుగా చెలరేగిన అగ్నికీలలు

### సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

### అత్యవసర సహాయచర్యలకు ఆదేశం

**అనకాపల్లి (పరవాడ), జూన్ 23, ప్రభాతవార్త:** పరవాడ ఫార్మాసిటీలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో మంగళవారం తెల్లవారుజామున సంభ వించిన భారీ అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మంటల్లో చిక్కుకుని సజీవదహన మయ్యారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో ప్లాస్టిక్ పైరోలిసిస్ ఆయిల్, కార్బన్ బ్లాక్, ఇంధన ఆయిల్స్ తయారీ జరుగుతోంది. సోమవారం రాత్రి విధులు నిర్వహిస్తున్న సమయంలో మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో చోడవరం మండలం అంబేర్‌పురానికి చెందిన వేపాడ వెంకటేష్ (34), అచ్యుతాపురం మండలం జగ్గన్నపేటకు చెందిన బోడేపు త్రినాథ్ (24) మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే రెండు అగ్నిమాపక వాహ >>2



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం



మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన ప్రధాని మోడీ

## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోడీ భేటీ

### కేబినెట్ విస్తరణ కోసమేనా? 2లో

### త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు విస్తరణలో ప్రాధాన్యం

## కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజీనామా



### రాష్ట్రపతి ముర్ము ఆమోదం

### ముగిసిన రాజ్యసభ పదవీకాలం

**న్యూఢిల్లీ, జూన్ 23:** రాజ్యసభ సభ్యత్వ కాలం ముగియడంతో, కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ మంత్రిమండలికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బిజెపి ఆయనను తిరిగి నామినేట్ చేయలేదు. దీంతో ఆయన తన పదవిని వదులుకోవాల్సి వచ్చింది. కురియన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించినట్లు రాష్ట్రపతి భవన్ మంగళవారం తెలిపింది. కురియన్ మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమశాఖలో కూడా కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిం >>2

## గేట్లు సిద్ధం.. తుంగ'భద్రం'

### రేపు ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 23 ,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు వర ప్రదాయిని అయిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పుడు కొత్తగేట్ల అమరికతో సరికొత్త రూపును సంతరించుకుంది. రూ.51 కోట్ల వ్యయంతో మొత్తం 33 గేట్ల ఏర్పాటు పనులు పూర్తికాగా, వీటిని ఈ నెల 25వ తేదీన కర్నాటక ముఖ్యమంత్రి శివకుమార్, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. 73 ఏళ్ల క్రితం నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు రెండు రాష్ట్రాల్లో లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవనాడిగా నిలుస్తోంది. అయితే 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. అప్పటికప్పుడు నీటి వృధాను అడ్డుకునేందుకు ఎపి ప్రభుత్వ చొరవతో, సిఎం చంద్రబాబు సూచనతో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వం వహించి స్టాప్‌లాక్ గేటును అమర్చారు. స్పిల్ వే గేట్లు అన్నీ మార్చాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇవ్వడంతో 6 నెలల్లో కొత్తగేట్లను పూర్తి చేసి ఎపి కర్ణాటక రాష్ట్రాలు పునరుజ్జీవం పోశాయి. తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగు నీరు, వందల గ్రామాలకు తాగునీరుతో ఎపి, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు కీలకంగాఉంది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే తుంగభద్ర ప్రాజెక్టు >>2

### కిరాణా షాపునుంచి డేటా సెంటర్ దాకా

# సింగిల్ పోర్టల్ ద్వారా పర్మిషన్లు

### ఇక ప్రతినెల ప్రధాన ప్రాజెక్టుల భూమిపూజ, ప్రారంభోత్సవాలు

### 20 లక్షల ఉద్యోగాల కల్పనపై లోకేష్ నేతృత్వంలో మంత్రుల బృందం భేటీ



మంగళవారం 20లక్షల ఉద్యోగాల కల్పనపై లోకేష్ నేతృత్వంలో మంత్రుల బృందం భేటీ దృశ్యం

**విజయవాడ,జూన్23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం, కిరాణా కొట్టు నుంచి డేటా సెంటర్ వరకు సింగిల్ పోర్టల్ ద్వారా అనుమతులు మంజూరు చేసే విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనకు మంత్రి లోకేష్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం ఉండవల్లి నివాసంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, టిజి భరత్ (ఆన్ లైన్ ద్వారా) హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చిన 750 భారీ పరిశ్రమలు వివిధ దశల్లోఉన్నాయి, ఇవి పూర్తిస్థాయిలో పట్టాలెక్కితే పెద్దఎత్తున రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి, సాధ్యమైనంత త్వరగా ఆయా పరిశ్రమలు గ్రౌండింగ్‌అయ్యేలా పరిశ్రమలశాఖ, ఎకనమిక్ డెవలప్‌మెంట్‌బోర్డు అధికారులు ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ప్రత్యేకశ్రద్ధ వహించాలని అన్నారు. పనులను వేగవంతంచేసి ప్రతినెలా ప్రాజెక్టుల భూమిపూజ, ప్రారంభోత్సవాలు ఉండేలా అధికారులు చొరవచూపాలని కోరారు.

**పరిశ్రమల ఆకర్షణకు పెద్దఎత్తున రోడ్ షోలకు ప్రణాళికలు**

నవంబర్‌లో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ నాటికి సాధ్యమైనంత గరిష్టంగా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సమ్మిట్‌కి >>2

### టాటా వాహనం

## బోల్తా

### రంగంపేట మండలంలో దుర్ఘటన

### ముగ్గురు కార్మికులు మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి ,జూన్ 23(ప్రభాతవార్త):** తూర్పుగోదావరి జిల్లాలోని రంగంపేట మండలం పరిధిలో ఒడిసిలేరు రంగంపేట మధ్య మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది నిర్మాణ పనులు ముగించుకుని స్వగ్రామాలకు తిరిగి వస్తున్న కార్మికుల ప్రయాణిస్తున్న టాటా ఏస్ వాహనం టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది ఈ విషాద ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడజిల్లా సామర్లకోట పట్టణం పిఠాపురం మండలంలోని మల్లం, జల్లూరు గ్రామాలకు చెందిన 11మంది కార్మికులు బాపట్ల జిల్లా కొల్లూరు ప్రాంతానికి నిర్మాణపనుల నిమిత్తం వెళ్లారు రెడీమిక్స్ వాల్స్ నిర్మాణం పనులు పూర్తి చేసుకుని మిగిలిన సామాగ్రితో కలిసి స్వగ్రామంతిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది తెల్లవారు >>2



## కొత్తగా 10 బిసి గురుకులాలు

### ఒక్కో గురుకులంలో 37 పోస్టుల భర్తీకి నిర్ణయం

### ఇటీవలే 6 ఎంజెపిలు కళాశాలలుగా అప్‌గ్రేడ్

### నూతన గురుకులాల ఏర్పాటుపై మంత్రి సవిత హర్షం

**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యతోనే బిసిలు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోగలరనేది సీఎం చంద్రబాబు నాయుడు బావన. ఇటీవల ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. ఇపుడు బిసి విద్యార్థులకు మేలు కలిగేలా నూతన విద్య సంస్థలు నెలకొల్పాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పది మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈ కొత్త గురుకులాల్లో 37 మంది చొప్పున్న ఉద్యోగులను భర్తీ చేయనున్నారు. ఈమేరకు మంగళవారం సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో బిసి బిడ్డలందరూ విద్య అభ్యసించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బడి బయట ఏ బిసి బిడ్డా ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశం. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక వైపు బిసి హాస్టళ్లు, మరో ఎంజేపీ గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. సకాలంలో డైట్‌బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోంది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా సాంకేతిక విద్యకు కూడా ప్రాధాన్యమిస్తోంది. దీంతో బిసిహాస్టళ్లు, ఎంజెపిస్కూళ్లలో తమ పిల్లలను చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడం, కొత్త గురుకులాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టింది.

**ఇటీవల 6 గురుకులాలు అప్ గ్రేడ్..**

ఎంజేపీ గురుకులాల సీట్లకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల ఆరు బిసి గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. కొత్తవలస >>2

### సాయి కృష్ణ మిస్సింగ్ కేసు



## మాజీ సిఐ నాగరాజు అరెస్టు

### స్టేషన్‌లో సిసి పుటేజిలు మాయం

### మే నుండి జూన్ నెల వరకు రెండు రోజుల ఫుటేజి మాత్రమే ఉంచిన వైనం

### కీలక ఆధారాలు మాయం చేశారనే కోణంలో దర్యాప్తు వేగవంతం

**విజయవాడ క్రైం,జూన్ 23,ప్రభాతవార్త:** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసు కీలక మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో కృష్ణలంక మాజీ సిఐ నాగరాజును సిట్ బృందం మంగళవారం సింగ్‌నగర్‌లో అదుపులోకి తీసుకుంది.ఉదయం తొలుత కృష్ణలంక స్టేషన్‌ను పరిశీలించిన సిట్ ప్రత్యేక దర్యాప్తు బృందం కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌తో పాటు స్వర్గపురి రికార్డులనుకూడ తనిఖీచేసింది. ఈ తనిఖీలో కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిసి పుటేజి మాయం అవ్వడంతో సిట్ బృందం ఆశ్చర్యపోయింది. సిసి >>2

24-6pg2exHMNWJQE_24-6pg2exHMNWJQE.qxd 24/Jun/26 12:20 AM Page 1





అగ్నిప్రమాదంలో కాలిపోయిన యంత్ర పరికరాలు

# భారీ అగ్ని ప్రమాదం

>> నాలు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చాయి. అయితే అప్పటికే ఇద్దరు కార్మికులు మృతిచెందినట్లు అధికారులు నిర్ధారించారు. ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కేజీహెచ్ మార్చురీలో మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడు వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా, యువకుడు త్రినాథ్ మృతితో అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ప్రమాదానికి గల కారణాలు, భద్రతా లోపాలపై విచారణ కొనసాగుతోంది. పరవాడ ఫార్మాసిటీలో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో పరిశ్రమల భద్రతపై కార్మిక సంఘాలు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**దక్షిణ ఎనర్జీ బాధిత కుటుంబాలకు చెరో రూ.33 లక్షల పరిహారం**

పరవాడ ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన కార్మికులు వేపాడ వెంకటేష్, బోడేపు త్రినాథ్‌రావు కుటుంబాలకు చెరో రూ.33 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు పరిశ్రమ యాజమాన్యం, బాధిత కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నాయకుల మధ్య జరిగిన చర్చలు సఫలమవగా, పరిహారంపై ఒప్పందం కుదిరింది. అనంతరం యాజమాన్య ప్రతినిధులు మృతుల కుటుంబ సభ్యులకు ఒప్పంద పత్రాలను అందజేశారు. దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో సంభవించిన అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు యాజమాన్యం చెరో రూ.33 లక్షల పరిహారం ప్రకటించడం కొంత ఊరటనిచ్చింది. ప్రమాద ఘటనపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**దుర్ఘటనపై సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్, మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి**

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో చోటు చేసుకున్న దుర్ఘటనపై సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు. ఘటనపై సిఎం విచారణకు ఆదేశించారు. హోంమంత్రి అనిత పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఈ దుర్ఘటనపై సిఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులను ఆదుకోవాలని, గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని సిఎం ఆదేశించారు. పరవాడ ఫార్మాసిటీ అగ్నిప్రమాదంపై ఉపముఖ్యమంత్రి పవన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరవాడ ఫార్మాసిటీ అగ్నిప్రమాదంపై మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నామని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు.

పరవాడ ఫార్మాసిటీ అగ్నిప్రమాదంపై హోంమంత్రి అనిత ఆరా తీశారు. కలెక్టర్, ఎస్పీతో ఫోనులో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సహాయచర్యలు వేగవంతం చేయాలని అధికారులకు హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మంత్రి సుభాష్ పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం అత్యంత విషాదకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కేజీహెచ్ మార్చురీలో మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడు వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా, యువకుడు త్రినాథ్ మృతితో అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

# గేట్లు సిద్ధం.. తుంగ'భద్రం'

>> కింద 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. కుడి కాలువ ద్వారా కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు నీరందుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు భద్రతను ఎపి, కర్నాటక రాష్ట్రాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గేట్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేశాయి. 25వ తేదీన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని హోస్‌పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# వికసిత 'పద్మా'లు

>> నంతరం), వెల్లపల్లి నటేషన్ పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలనుంచి సినీ నటులు మాగంటి మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లు పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు. వీరితోపాటు తమిళనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్‌శర్మ ఇతర పలు రంగాలప్రముఖులకు పద్మ పురస్కారాలు వరించాయి. మొత్తం 131 మందిని పద్మపురస్కారాలకు ఎంపికచేయగా తొలివిడతలో 66 మందికి ఎంపికచేస్తే మిగిలినవారికి మంగళవారం ప్రధానంచేసారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సిపిరాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్; కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పియూష్‌గోయల్, ధర్మేంద్రప్రధాన్, గజేంద్రసింగ్ షెకవాత్ తదితరులు పాల్గొన్నారు. పద్మశ్రీ అవార్డులు పొందినవారిలో నూరుద్దీన్ అహ్మద్, తిరువారూర్ భక్తవత్సలం, డా.కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, బ్రిజ్‌లాల్‌భట్, తరుణ్ భట్టాచార్య, జ్యోతిష్ దేబ్‌నాథ్, డా.జోగేష్ దేవురీ, భిక్యాల లడక్యా ధిండా, డా.అర్మిండ ఫెర్నాండెజ్, డాక్టర్ చంద్రమౌలి గడ్డమనుగు, డాక్టర్ ప్రేమ్‌లాల్ గౌతమ్, డా.రాజాస్తపతి కలియప్ప గౌండర్, డా.పద్మ గుర్మెట్, అశోక్‌కుమార్ హల్దార్, డాక్టర్ సురేష్ హంగావాడి, శ్రీచరణ్ హెంబ్రమ్, డా.శుభా వెంకటేశ ఐయ్యంగార్, టిటి జగన్నాథన్ (మరణా నంతరం), సంత్ నిరంజన్‌దాస్‌జీ, ప్రొఫెసర్ వీఝినాథన్ కామకోటి, ప్రొఫెసర్ మంగలా కపూర్, డాక్టర్ అశోక్ ఖాడే, డి. లియుడ్‌మీలా ఖోఖోల్వా, డా.ప్రభాకర్ బసాప్రభుకోరే, శ్రీమతి పోఖిలా లేఖథేపీ, మామిడి రామారెడ్డి(మరణానంతరం), ఆర్‌విఎస్ మణి, శ్రీమంతి కళామండలం విమలా మీనన్, వ్లాదిమీర్ మెస్త్ విరిష్‌విలి (మరణానంతరం), మోహన్‌నాగర్, డా.పుణ్యమూర్తి నటేషన్, శరకుమార్‌పాత్ర, గురుసంగ్యసంగ్ పాంగెనెర్, సవితా పూనియా, కవీంద్ర పురకాయస్థ (మరణానంతరం), హగవాన్‌దాస్ రైక్‌వార్(మరణా నంతరం), ప్రొఫెసర్ కె.రామస్వామి, శ్రీమతి రంజని, శ్రీమతి గాయత్రి, డా.అనిల్‌కుమార్ రోగి, ప్రొఫెసర్ మహేంద్రనాథ్‌రాయ్, సతీష్‌షా(మరణానంతరం), ప్రొఫెసర్ ప్రతీక్ శర్మ, రోహిత్ గురునాథ్‌శర్మ, సర్దార్ ఇందర్ జీత్ సింగ్‌సిద్ధు, రఘుపత్‌సింగ్(మరణానంతరం), ఖేమ్‌రాజ్ సుంద్రియాల్, డా.భుద్రి తాతి, డా.కుమార స్వామి తంగరాజ్, రబిలాల్ తుడు(మరణారంతరం) నరేష్ చంద్రదేవ్‌వర్మ, వెంపటి శశిశేఖర్, చిరంజిలాల్ యాదవ్‌లు రాష్ట్రపతి చేతులమీదుగా పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు.

# టాటా వాహనం బోల్తా

>> జామున సుమారు 3 గంటల సమయంలో వాహనం టైర్ పంచర్ కావడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం రోడ్డుపై బోల్తా పడింది ఈ ప్రమాదంలో సామర్లకోటకి చెందిన మసకపల్లి బాబు, మురమళ్ళ రాజు, కాకడ రాజు అనే ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు మిగిలిన 8 మందిని 108 అంబులెన్స్ సహాయంతో పెద్దాపురం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మరో అరగంటలో తమ గమ్యస్థానాలు చేరుకునే సమయంలో ఈ విషాదం చోటు చేసుకోవడం కుటుంబ సభ్యులను విషాదంలో ముంచెత్తింది సమాచారం అందుకున్న రంగంపేట పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# కొత్తగా 10 బిసి గురుకులాలు

>> (విజయనగరం), ఆత్మకూరు, గోలగముడి (నెల్లూరు), కలికిరి(అన్నమయ్య), ఒనిపెంట (కడప), నాసనకోట (శ్రీ సత్యసాయి జిల్లా) ఎంజేపీ గురుకుల పాఠశాలలను అప్ గ్రేడ్ చేశారు. ఆయా గురుకులాలల్లో తరగతలు సైతం ప్రారంభమయ్యాయి.

**కొత్తగా 10 గురుకులాల ఏర్పాటు**

తాజాగా కొత్త గురుకుల పాఠశాలలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రమండలి ఆమోదం కూడా తెలిపింది. చ్రెర్ల(శ్రీకాకుళం), నక్కపల్లి(అనకాపల్లి), మాచెర్ల(పల్నాడు), గిద్దలూరు(మార్కాపురం), గుంతకల్లు(అనంతపురం), రాయచోటి (అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం(కర్నూలు), పెనుకొండ, కదిరి(శ్రీసత్యసాయి)లో ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గురుకులంలో 37 బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈగురుకుల పాఠశాలలో అయిదు బాలికలు, మరోఅయిదు బాలుర పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతలను ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూతన ఎంజేపీ గురుకులాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లోని బీసీ బిడ్డలకు మరింత మేలు జరగనుంది.

**సిఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు..**

బడి బయట ఏ ఒక్క బిసి బిడ్డా ఉండకూడదనే సిఎం చంద్రబాబు లక్ష్యాన్ని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. బిసిల విద్యకు ప్రాధాన్యమిస్తూ, కొత్తగా పది ఎంజేపీ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. ఈ గురుకులాల ఏర్పాటుతో మరింతమంది పేద బిసి బిడ్డలు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఎంజేపీ గురుకులాల్లో ఆహార భద్రత, రక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. గత నెలలో విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బిసి బిడ్డలు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఇటీవలే ఆరు బిపి గురుకులాలను జూనియర్ కళాశాలలుగా కూటమి ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందన్నారు. బిసిల విద్య కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

## వారం - వర్జ్యం

24-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
దశమి సా.6.15
చిత్త మ.2.01
వర్జ్యం : రా.8.12-రా.9.58
దు. ఉ.11.43-మ.12.35
శుభసమయం:ఉ.7.00-8.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మోసకారి మాటలు చెప్పే వారి నుండి దూరంగా ఉండండి.

**వృషభం:** ఎదుటివారిని బాగా అంచనా వేయగలుగుతారు. తద్వారా లాభపడతారు. ఉద్యోగాలపరంగా రాణిస్తారు. వస్త్రలాభం.

**మిథునం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

**కర్కాటకం :** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. సహోదర, సహోదరీ వర్గం వారికి విశేషంగా సహాయ సహకారాలు అందిస్తారు.

**సింహం:** ఆస్తుల విలువ అనూహ్యంగా పెరుగుతుంది. ఉద్యోగంలో నూతన బాధ్యతలు స్వీకరిస్తారు. వాహన సౌఖ్యం.

**కన్య :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. పనుల నిదానంగా పూర్తిచేస్తారు. గృహనిర్మాణ యత్నాలు.

**తుల :** వ్యతిరేక వాతావరణంలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. విదేశాలలోని బంధువులకు సాయం అందిస్తారు.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. విద్యార్థులకు అనుకూలమైన కాలం. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**ధనుస్సు:** ఏ పనిని చేపట్టినా విజయవంతంగా పూర్తి చేస్తారు. పెద్దల సలహాలతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మకరం:** వృత్తిలో వత్తిడి ఎక్కువ అవుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. వాహనాల కొనుగోలు.

**కుంభం:** వివాదాస్పదమైన అంశాలతో తలదూర్చకండి. "తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అన్నారు.

**మీనం :** తియ్యని మాట తీరు ఎంతటి కార్యాన్నయినా సులువు చేస్తుందని గ్రహిస్తారు. సహూద్యోగులతో సామరస్యంగా మెలగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం సర్ ప్రక్రియలో పాల్గొని అధికారులకు వివరాలు అందిస్తున్న మంత్రి లోకేష్

# 'సర్' ప్రక్రియలో పాల్గొన్న మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఉండవల్లిలోని తమ నివాసానికి వచ్చిన బూత్ లెవల్ ఆఫీసర్ అడిగిన సమాచారం, డాక్యుమెంట్లను మంత్రి లోకేష్ సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిఒక్కరూ ఈ ప్రక్రియలో పాల్గొనాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియలో పాల్గొనే ప్రజలు ఏదైనా డౌట్లు ఉంటే ఆయా వార్డుల్లో నియమితులైన బిఎల్ఒలను సంప్రదించాలని, ఇందుకోసం సహకరించేందుకు తెలుగుదేశం పార్టీ తరపున బూత్ లెవల్ ఏజంట్లు కూడా అందుబాటులో ఉంటారని చెప్పారు.

# జార్జ్ కురియన్ రాజీనామా

>> చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సలహా మేరకు, కేంద్ర మంత్రిమండలి నుండి కురియన్ రాజీనామాను భారత రాష్ట్రపతి తక్షణమే అమల్లోకి వచ్చేలా ఆమోదించారని అధికారిక ప్రకటన పేర్కొంది. కేంద్ర ప్రభుత్వంలో క్రైస్తవ వర్గానికి చెందిన ఏకైక మంత్రి బహుశా కురియన్ మాత్రమే. జూన్ 21వ తేదీన ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టు, కురియన్‌ల పదవీకాలం ముగుస్తున్నప్పటికీ, జూన్ 18న జరిగిన రాజ్యసభ ఎన్నికలకు వారిని తిరిగి నామినేట్ చేయలేదు. 65 ఏళ్ల కురియన్ 1980లో బిజెపి ఆవిర్భావం నుండే పార్టీలో సభ్యుడిగా ఉన్నారు. ఆయన బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, భారతీయ జనతా యువ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడిగా, బిజెపి కేరళ విభాగం ఉపాధ్యక్షుడిగా వివిధ పదవులను చేపట్టారు. భారత సుప్రీంకోర్టులో న్యాయవాదిగా కూడా ప్రాక్టీస్ చేశారు. ఆయన జూన్ 9, 2024న కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు, కురియన్ జాతీయ మైనారిటీల కమిషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

# రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోడీ భేటీ

**న్యూఢిల్లీ,జూన్ 23:** రాష్ట్రపతిభవన్‌లో అట్టహాసంగా జరిగిన పద్మ పురస్కారాలప్రధానం అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్రమోడ భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యతనున సంతరించుకుంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రచారం జోరుగా సాగుతున్నవేళ ప్రధానిమోడీ భేటీకి ప్రాధాన్యం పెరిగింది. వీరి భేటీకి సంబంధించి చిత్రాలను రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్‌వేదికగా విడుదలచేసింది. కేరళ బిజెపినేత జార్జి కురియన్ కేంద్ర సహాయ మంత్రిపదవికి రాజీనామాచేసారు. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం కూడా తెలిపారు. ఈ పరిణామంతో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందన్న ప్రచారం జోరందుకుంది. ఇటీవల పలువురు కేంద్ర మంత్రులకు వారి వారి రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించడం దీనికి మరింత బలం చేకూరింది. కేంద్ర రోడ్డురవాణా సహాయమంత్రి హర్ష్ మల్హోత్రాను ఢిల్లీబిజెపి అధ్యక్షుడుగా పార్టీ అధ్యక్షుడు నితిన్‌నబిన్ నియమించారు. త్వరలో ఎన్నికలకు వస్తున్న రాష్ట్రాలకు మంత్రివర్గంలోప్రాధాన్యం ఇస్తారన్న అంచనాలూన్నాయి. అదేక్రమంలో ఇతర పార్టీలనుంచి బిజెపిలోకి, ఎన్డీయేలోకి వచ్చినవారిని మరికొందరిని కేబినెట్‌లోకి తీసుకుంటారని చర్చలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే పద్మ పురస్కారాల తర్వాతనే మోడీ రాష్ట్రపతితో భేటీ కావడం కేబినెట్ విస్తరణ అంశాలు తెరపైకి వచ్చాయి.

# రిటైర్మెంట్ 62కు పెంపు

>> ఎన్టీఆర్ జిల్లాలో కంట్రోల్ ఎస్ డేటా సెంటర్, రూ.2788.30 కోట్ల పెట్టుబడి, 160 మందికి ఉద్యోగాలు, అనకాపల్లిజిల్లాలో జెట్ ఫ్యాబ్ ఇండియా, రూ.740 కోట్ల పెట్టుబడి, 1049 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో, ఇన్ ఫినిక్స్ టెక్నాలజీ సొల్యూషన్స్, రూ.170 కోట్ల పెట్టుబడి, 4000 మందికి ఉద్యోగాలు, విశాఖజిల్లాలో, ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్, రూ.50 కోట్లు, 1000 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం జిల్లాలో లభిస్తాయి.ఇప్యాక్ డ్యూరబుల్, ఇప్యాక్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీస్, రూ.1084.31 కోట్ల పెట్టుబడి, 1600 మందికి ఉద్యోగాలు, నాయుడుపేట, శ్రీసిటీ, తిరుపతి జిల్లాలో ఆంబర్ ఎంటర్ ప్రైజెస్, రూ.445 కోట్ల పెట్టుబడి, 1250 మందికి ఉద్యోగాలు, శ్రీసిటి తిరుపతి జిల్లాలో ఎంసిఎన్ఇఎక్స్ ఇండియా, రూ.347 కోట్లు, 1633 మందికి ఉద్యోగాలు, శ్రీసిటీ తిరుపతి జిల్లాలో లభిస్తాయి.వరుణ్ హాస్పిటాలిటీ ప్రై.లిమిటెడ్, రూ.280.33 కోట్ల పెట్టుబడి, 600 మందికి ఉద్యోగాలు, అమరావతిలో .ఇంద్రోయల్ హాస్పిటాలిటీ సర్వీసెస్, రూ.539 కోట్ల పెట్టుబడి, 600 మందికి ఉద్యోగాలు, అమరావతిలో, విజయనగర్ ఇన్వెస్ట్మెంట్స్ ఇన్‌ఫ్రా, రూ.53.35 కోట్ల పెట్టుబడి, 225 మందికి ఉద్యోగాలు, ఆనందపురం, విశాఖ జిల్లాలో లభిస్తాయి,దైవిక్ హోటల్స్ ప్రైలిమిటెడ్ రూ.186.84 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉద్యోగాలు, అమరావతిలో .శుభసంకల్ప్, రూ.174.52 కోట్లు, 300 మందికి ఉద్యోగాలు లభిస్తాయి, వెసెల్లా 5 స్టార్ హోటల్స్, రిసార్ట్స్ రూ.210.14 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు, కర్నూలుజిల్లాలో దుర్గా కందేవ్‌పద్మా హాస్పిటాలిటీ కన్సార్టియం, రూ.163.36 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం జిల్లాలో వైట్ ఓక్ రిసార్ట్స్ , రూ.79.01 కోట్ల పెట్టుబడి, 250 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం జిల్లాలో లభిస్తాయి.ఎస్ఏఈఫ్ ఒన్ ఇండియాఎస్పీ కాంపాక్ట్ లిమిటెడ్ రూ.1900 కోట్ల పెట్టుబడి, 2500 మందికి ఉద్యోగాలు, కాకినాడజిల్లాలో లభిస్తాయి..ప్రోటీరియల్ ఇండియా, రూ.2,250 కోట్లు, 530 మందికి ఉద్యోగాలు, అనకాపల్లిజిల్లాలో లభిస్తాయి..నాన్ మాగ్నెటెక్ ప్రై.లిమిటెడ్, రూ.1250 కోట్లు, 400 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి.ఏపీ జెఎస్ డబ్ల్యూ స్టీల్స్ , రూ. 1230.20 కోట్లు, 155 మందికి ఉద్యోగాలు, ప్రకాశం జిల్లాలో లభిస్తాయి..వయోనా ఎనర్జీ, రూ.468 కోట్లు పెట్టుబడి, 1300 మందికి ఉద్యోగాలు, నెల్లూరు జిల్లాలో లభిస్తాయి. బెర్జర్ పెయింట్స్ , రూ.176.82 కోట్ల పెట్టుబడి, 40 మందికి ఉద్యోగాలు, సత్యసాయి జిల్లాలో లభిస్తాయి.డివైస్ ఫార్మా టెక్ రూ.213.9 కోట్ల పెట్టుబడి, 114 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి..ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.63.94 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు, ఏలూరు జిల్లాలో లభిస్తాయి.రెనాటస్ ప్రోడక్ట్స్ , రూ.350 కోట్లు, 370 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి. ప్రీమియర్ ఎనర్జీస్ ఇంగాట్ వేఫర్, రూ.3936.20 కోట్ల పెట్టుబడులు, 540 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి.జీరో 21 రెన్యూవబుల్ ఎనర్జీ రూ.525 కోట్లు పెట్టుబడి, 625 మందికి ఉద్యోగాలు, కర్నూలు జిల్లాలో లభిస్తాయి.అనంత్ టెక్నాలజీస్ రూ.1000 కోట్ల పెట్టుబడి 750 మందికి ఉద్యోగాలు నెల్లూరు జిల్లాలో లభిస్తాయి.స్పేస్ ఫీల్డ్స్ ప్రై.లిమిటెడ్, రూ.46.83కోట్ల పెట్టుబడి, 300మందికిఉద్యోగాలు, అనంతపురం జిల్లాలో లభిస్తాయి. ఐకామ్ టెలీ, రూ.895 కోట్లు పెట్టుబడి, 1320 మందికి ఉద్యోగాలు, జగ్గయ్యపేటలో లభిస్తాయి. అవెరాన్ పానల్స్, రూ.1123 కోట్ల పెట్టుబడి, 1200 మందికి ఉద్యోగాలు, గుడిపల్లె, శాంతిపురం చిత్తూరుజిల్లా లభిస్తాయి..సర్లా ఏవియేషన్, రూ.330 కోట్ల పెట్టుబడి, 40 మందికి ఉద్యోగాలు, తిమ్మ సముద్రం, అనంతపురం జిల్లా లభిస్తాయి.

న్యూట్రీ ఫీడ్స్ అండ్ ఫార్మ్స్, రూ.216 కోట్ల పెట్టుబడి, 480 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లాలో .పతంజలి ఆయుర్వేద్, రూ.370.10 కోట్ల పెట్టుబడి, 2000 మందికి ఉద్యోగాలు, విజయనగరం జిల్లాలో లభిస్తాయి. అమరావతి క్వాంటం వ్యాలీ లో పెట్టుబడి ప్రతిపాదనలు,.క్యూపిఐ ఏఐ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రూ.47.16 కోట్లు, 9 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..ఇంజిన్యువటీ నెక్సస్ టెక్నాలజీస్, రూ. 0.5 కోట్లు, 21 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి,.సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ సి.డాట్ రూ.10 కోట్లు, 5 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.క్యూబిట్ ఫోర్స్, రూ.100 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతి క్వాంటం వ్యాలీలో లభిస్తాయి.ఆటోమోనిక్స్, రూ.79.8 కోట్లు, 190 మందికి ఉద్యోగాలు, అమరావతి క్వాంటం వ్యాలీలో లభిస్తాయి..క్రిప్ట్ షీల్డ్, రూ10 కోట్లు, 20 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాచి.. క్వాంటం బయో సైన్సెస్, రూ.22.5 కోట్లు, 10 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..ఫ్రూగల్ ఏఐ, రూ.2.6 కోట్లు, 6 మందికి ఉద్యోగాలు,అమరావతిలో లభిస్తాయి,.క్యూరియమ్ రూ.0.45 కోట్లు, 5 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి.క్యూక్రిషి, రూ.25 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..ఎస్ఏఎస్ క్యూట్ ఎలక్ట్రానిక్స్ రూ.60 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..మొత్తం రూ. 30515 కోట్ల పెట్టుబడులతో పాటు 29677 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఈ తీర్మానాలన్నింటికి మంత్రి మండలి అనుమతినిచ్చింది.

# మాజీ సిఐ నాగరాజు అరెస్టు

>> పుటేజీలో మే నెల నుండి జూన్ నెల వరకు మధ్యలో రెండు రోజులు మినహా మిగిలిన సిసి పుటేజి మొత్తం కనుమరుగయ్యింది. మాజీ సిఐ నాగరాజే ఈ సిసి పుటేజిని మాయం చేసి ఉంటాడని సిట్ బృందం భావిస్తోంది. అనంతరం స్వర్గపురిని చేరుకున్న సిట్ బృందం అక్కడ ఉన్న రికార్డులను పరిశీలించింది. వాటిలో రెండు మృతదేహాలు పంపుతున్నట్లుగా లేఖ వ్రాసి ఒకటే మృతదేహాన్ని కృష్ణలంక అప ్రటి సిఐ నాగరాజు పంపినట్లు రికార్డులలో తేటతెల్లమైంది. అంతేకాక స్టేషన్ నుండి వచ్చిన లెటరులో వయస్సును దిద్దినట్లుగా కనిపించడాన్ని కూడ సిట్ బృందం పరిశీలించింది. మే నెల 23న ఈ ఘటన జరిగినట్లు సిట్ బృందం అనుమానిస్తోంది. దీంతో ఈ కేసులో కీలక ఆధారాలను మాజీ సిఐ నాగరాజు మాయం చేశారని సిట్ బృందం భావిస్తూ ఆ దిశగా దర్యాప్తును వేగవంతం చేసింది. తొలగించిన సిసి పుటేజి భాగాన్ని రికవరీ చేసేందుకు టెక్నికల్‌గా సిట్ బృందం చర్యలు చేపట్టినట్లు సమాచారం. దర్యాప్తుకు సంబంధించిన కీలకాంశాలను ఉన్నతాధికారులకు సిట్ బృందం తెలియచేసినట్లు సమాచారం. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 18 నెలల పాటు సిసి పుటేజిని భధ్రపర్చాల్సి ఉండగా స్టేషన్‌లోనే అవి మాయవవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**నాగరాజు విచారణ**

మాజీ సిఐ నాగరాజును అదుపులోకి తీసుకున్న సిట్ ప్రత్యేక దర్యాప్తు బృందం అతనిని కూలంకుషంగా విచారణ చేపట్టింది. అసలు ఏం జరిగింది, ఎలా జరిగింది అనే విషయాన్ని సిఐని పలువిధాలుగా ఆధారలు చూపించి సిట్ బృందం విచారించినట్లు సమాచారం. నాగరాజుతో పాటు మరి కొందరు కానిస్టేబుళ్లతో పాటు స్టేషన్‌కు చెందిన పలువురు ఎస్ఐలు కూడ ఈ ఘటనలో పాలు పంచుకున్నారని సిట్ దర్యాప్తు బృందం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సిసి పుటేజి మాయం కావడం అనే అంశాన్ని దర్యాప్తు బృందం తీవ్రంగా పరిగణిస్తోంది. దాని రికవరీ కోసం తీవ్ర ప్రయత్నం చేస్తోందని సమాచారం.

**సిఐ మద్దతుదారుల ధర్నా**

సిఐ నాగరాజును అదుపులోకి తీసుకోడానికి పోలీసులు సింగ్‌నగర్‌కు వచ్చిన సమయంలో అక్కడ హై డ్రామా చోటు చేసుకుంది. సిఐ మద్దతుదారులంటూ కొంత మంది సిఐను అరెస్ట్ చేయద్దని నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అడ్డుగా నిలబడిన వారిని పోలీసులు బలవంతంగా తప్పించి సిఐ నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించిన సాయికృష్ణ అదృశ్యం కేసులో అసలు మిస్టరీ మరి కొద్ది రోజుల్లో వీడే అవకాశం ఉంది. దీనిలో సూత్రధారులు, పాత్రధారుల పాత్ర కూడ మరి కొద్ది రోజుల్లో తేటతెల్లమవనుంది. ఇంత దారుణంగా ఒక వ్యక్తిని మాయం చేయడం వెనుక నాగరాజు వెనుక మరిన్ని అదృశ్య శక్తులేవైనా ఉన్నాయా అనే విషయంపై కూడ బృందం లోతుగా విచారిస్తోంది.

# సింగిల్ పోర్టల్ ద్వారా పర్మిషన్లు

>> మించి ఈసారి పెద్దసంఖ్యలో రాష్ట్రానికి పరిశ్రమలను ఆకర్షించేలా విదేశాలతోపాటు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున రోడ్ షోల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. గత నెలరోజుల వ్యవధిలో 210 భారీ పరిశ్రమలు తర్వాత దశకు చేరుకున్నాయని అధికారులు చెప్పారు. ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన 26 ప్రాజెక్టుల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి ప్రతి 15రోజులకోసారి కలెక్టర్లు, జిల్లాస్థాయి అధికారులతో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సమీక్షి ంచా లని మంత్రి లోకేష్ కోరారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన పవర్, వాటర్, మౌలిక సదుపా యాల కల్పనపై దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్రంలో భారీగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో వివిధ స్టేజిల్లో ఉన్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ పరిశ్రమలతోపాటు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న ఎంఎస్ఎంఇలను కూడా ఆన్ బోర్డు చేయాలనిఅన్నారు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు అందుబాటు లోకి రానున్న నేపథ్యంలో విశాఖపట్నంలో సాధ్యమైనంత ఎక్కువగా హోటల్ గదులు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని పర్యాటకశాఖ అధికారులకు సూచించారు.

**స్లరీ పైప్ లైన్ పై అధ్యయనం చేయండి..**


స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ మన ప్రభుత్వ ప్రత్యేకతలు, సులభతరమైన సర్వీస్ డెలివరీ అందించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో గార్మెంట్ పరిశ్రమలను ఆకర్షించడానికి చేపట్టాల్సిన చర్యలు, అందించాల్సిన ప్రోత్సాహకాలపై సమావేశంలో చర్చించారు. ఎంప్లాయ్ మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్స్ అందించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న టెక్స్ టైల్ పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ ఉత్పత్తి చేసుకునేందుకు ఏడాదిపాటు బ్యాంకింగ్ ఫెసిలిటీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు.

అనకాపల్లి - విశాఖ - విజయనగరం జిల్లాలు స్టీల్ హబ్‌గా ఆవిష్కృతమవుతున్న నేపథ్యంలో కొత్తగా రాష్ట్రానికి వచ్చేందుకు మరికొన్ని ఉక్కు పరిశ్రమలు ఆసక్తిచూపుతున్నాయి,

ఇందులో ప్రధానమైన ముడిసరుకు సరఫరా కోసం స్లరీ పైప్ లైన్ కావాలని ఆయా సంస్థలు కోరుతున్నాయి, దీనిపై అధికారులు అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ సూచించారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, పంచాయితీరాజ్, రూరల్ డెవలప్ మెంట్ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సీఈవో షన్మోహన్, స్కిల్ డెవలప్ మెంట్ డైరెక్టర్ గణేష్ కుమార్, ఏపీఐఐసీ ఎండీ ఏఎస్ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 11వేల కుటుంబాలకు పెన్షన్ భరోసా

● రాష్ట్ర సచివాలయ సంఘం అధ్యక్షులు రామకృష్ణ




**సచివాలయం, జూన్ 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2004 ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ కంటే ముందు ఉద్యోగాల్లో జాయినై, ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పరిధిలోనికి తీసుకురావడానికి, వారికి ఆప్షన్ ఇవ్వడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఎపి సచివాలయ సంఘం అధ్యక్షులు రామకృష్ణ తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11,000మంది ఉద్యోగులు, వారి కుటుంబాల జీవితాల్లో ఈరోజు ఒక సుదినంగా మారిందని, చరిత్ర సృష్టించడంలో, చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపితమైందని స్పష్టం చేశారు. రాష్ట్రం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ఉద్యోగులకు మంచి చేయాలనే ఏకైక సంకల్పంతో ముఖ్యమంత్రి ఈ భారీ ఆర్థిక భారాన్ని లెక్కచేయకుండా ధైర్యంగా ముందుకు వెళ్ళారని రామకృష్ణ కొనియాడారు. ఈ నిర్ణయం వల్ల ఒక్కో ఉద్యోగికి సుమారు రూ.3 కోట్ల వరకు జీవితకాల లబ్ధి చేకూరుతుందని ఆయన సవివరంగా వివరించారు. సచివాలయ సంఘం తరపున సిఎంకి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగుల పట్ల ఇంతటి ఆదరణ చూపిస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి తమ సచివాలయ సంఘం ఉద్యోగ లోకం అంతా ఎల్లప్పుడూ అండదండలుగా ఉంటుందని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలను లబ్ధిదారులైన ప్రజలందరికి అత్యంత వేగంగా, సమర్థవంతంగా చేరవేసేలా ఉద్యోగ యంత్రాంగం అంతా రాత్రింబగళ్ళు కష్టపడి ప్రభుత్వానికి అన్ని విధాల సహకరిస్తుందని సచివాలయ సంఘం అధ్యక్షులు రామకృష్ణ స్పష్టం చేశారు.

## కేబినెట్ నిర్ణయంపై ఎపి జెఎసి హర్షం



**శ్రీకాకుళం, జూన్ 23 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎపిజెఎసి), ఎపి ఎన్జీవోస్ అసోసియేషన్ ఉద్యోగుల సంక్షేమం కోసం సాగించిన పోరాటంలో మరో రెండు చారిత్రాత్మక విజయాలు నమోదయ్యాయి. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల కీలక డిమాండ్లకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్) ఆమోదం తెలపడం పట్ల ఎపిజెఎసి శ్రీకాకుళం జిల్లా శాఖ తీవ్ర హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఎపి జెఎసి శ్రీకాకుళం జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం, జిల్లా సెక్రటరీ జనరల్ బి.వెంకటేశ్వర్లు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, క్యాబినెట్ ఆమోదించిన రెండు కీలక నిర్ణయాల వివరాలను వెల్లడించారు. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల విద్యాలయాల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జీఓ ఎంఎస్ నెంబర్ 57 ప్రకారం 01-09-2004 కంటే ముందు నోటిపై చేయబడి, వివిధ కారణాలతో నిలిచిపోయిన సుమారు 11,000 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వర్తింపజేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎపి జెఎసి శ్రీకాకుళం జిల్లా పక్షాన జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం, జిల్లా సెక్రటరీ బి.వెంకటేశ్వర్లు హృదయపూర్వక కృతజ్ఞతలు, శుభాభినందనలు తెలియజేశారు. అలాగే ఈ విజయం సాధించిన జెఎసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## అందుబాటులోకి కార్మిక సంక్షేమ బోర్డు వెబ్‌సైట్

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త:** కార్మిక సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా, వేగవంతంగా కార్మికులకు చేరవేసేందుకు కార్మికసంక్షేమబోర్డు రూపొందించి వెబ్‌సైట్‌ను రాష్ట్రకార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆవిష్కరించారు. విజయవాడలోని స్వర్ణప్యాలెస్ మీటింగ్‌హాల్లో కార్మిక సంక్షేమబోర్డు 45వ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఈవెబ్‌సైట్ ద్వారా కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, లబ్ధిదారుల వివరాలు, పథకాల మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కార్మికులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా డిజిటల్ వేదికలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈసమావేశంలో సంక్షేమ పథకాల అమలు, నమోదు ప్రక్రియల సరళీకరణ, కార్మికుల భద్రత, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో కార్మికశాఖ కార్యదర్శి యం.వి.శేషగిరిబాబు, కమీషనర్ గంధం చంద్రుడు, వెల్ఫేర్‌బోర్డు వైస్‌చైర్మన్ వెంకట శివుడ్ యాదవ్, బోర్డు సభ్యులు వై.వెంకటరమణి, ఆరా మహేశ్వరి, అరవరాజు నేలపాల, గదుల సాయి బాబు, బి.విశ్వనాథనాయుడు, డి.నారపరెడ్డి, చింత రేణుకరాజు, నల్లగొప్పుల వెంకటచలపతిరావు, పిడుగు వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో ముద్రగడ

## ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన జగన్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి. జూన్ 23 ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిపై ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా అస్వస్థతతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ ఆరోగ్య సమాచారాన్ని ఆయన నిరంతరం అడిగి తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ముద్రగడ తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబుతో వై.ఎస్. జగన్ సోమవారం ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను, ఆయన ఆరోగ్య పురోగతిని గిరిబాబును అడిగి తెలుసుకున్న జగన్, కుటుంబ సభ్యులకు కొండంత ధైర్యాన్నిచ్చారు. ముద్రగడ వైద్యానికి అవసరమైన నిపుణులైన వైద్యుల బృందాన్ని కూడా జగన్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. కాగా, మెరుగైన చికిత్స అందుతుండటంతో ముద్రగడ మంగళవారం నాటికి చాలా వరకు కోలుకున్నట్లు సమాచారం అందింది.

**వైద్యులతో నిరంతరం మాట్లాడుతున్నా:** ముద్రగడ ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు, అభిమానులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జగన్ పేర్కొన్నారు. ఆయన తప్పకుండా త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకుంటారని ఆశాభావం వ్యక్తంచేశారు. ముద్రగడకు అందుతున్న చికిత్సకు సంబంధించి తాను స్వయంగా వైద్యులతో మాట్లాడానని, ఆయన ఆరోగ్య పరిస్థితిని తాను దగ్గరుండి నిరంతరం పర్యవేక్షిస్తున్నానని ఈ సందర్భంగా గిరిబాబుకు వివరించారు. "మీరు నాకు కుటుంబ సభ్యుల్లాంటి వారు. ఎలాంటి ఆందోళన పెట్టుకోవద్దు, ధైర్యంగా ఉండండి" అని జగన్ ముద్రగడ కుటుంబానికి ధైర్యం చెప్పారు. మీకు ఏ చిన్న సహాయం కావాలన్నా నేరుగా తనకు ఫోన్ చేయవచ్చని జగన్ స్పష్టంచేశారు. జగన్ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడటంతో ముద్రగడ గిరిబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు కాస్త ఊరట

# అమరావతిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన




● జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.130 కోట్ల పనులకు అనుమతి

● అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ల కోసం సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరు

● మంత్రివర్గ సమావేశం నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారధి

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి పరిధిలోని ఉండవల్లి ప్రాంతంలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఏపీ సమాచార,ప్రజా సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. మంగళవారం సచివాలయంలోని సమాచార శాఖ సమావేశ ప్రాంగణంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పార్థసారధి కేబినెట్‌లో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.130 కోట్ల పనులకు మంత్రివర్గం అనుమతినిచ్చింది. అమరావతిలో 5 స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదించిందని మంత్రి వివరించారు. బిసి బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది. 10 ఎంజెపి గురుకులాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని ఎచ్చెర్ల (శ్రీకాకుళం), నక్కపల్లి (అనకాపల్లి), మాచర్ల (పల్నాడు), గిద్దలూరు (మార్కాపురం), గుంతకల్లు (అనంతపురం), రాయచోటి (అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం (కర్నూలు), పెనుకొండ, కదిరి (శ్రీసత్యసాయి)లో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐదు బాలికలవి కాగా మరో ఐదు బాలురవి. అదేవిధంగా ఒక్కో గురుకులంలో 37 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఇవి ప్రారంభం కానున్నాయని తెలిపారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ఒకటి, రెండో దశల కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం లభించింది. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పరిధిని 15 కిలోమీటర్లకు హేతుబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ మరియు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను భారీగా ప్రోత్సహించే లక్ష్యంతో 'మెసర్స్ న్యూట్రి ఫీడ్స్ అండ్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్', 'మెసర్స్ పతంజలి ఆయుర్వేద లిమిటెడ్' సంస్థలకు ప్రత్యేక ప్యాకేజీ కింద రాయితీలు మంజూరు చేసే సమగ్ర ప్రతిపాదనకు క్రింది విధంగా ఆమోదం తెలిపినట్లు మంత్రి వివరించారు. మెసర్స్ న్యూట్రి ఫీడ్స్ అండ్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ చిత్తూరు జిల్లాలో అత్యంత అధునాతన సాంకేతికతతో "ఇంటిగ్రేటెడ్ చికెన్ ప్రాసెసింగ్" కేంద్రాన్ని స్థాపించేందుకు ఈ సంస్థ సమర్పించిన పారిశ్రామిక ప్రతిపాదనకు అంగీకారం తెలపడమైనది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సంస్థ మొత్తం రూ. 216.00 కోట్ల పెట్టుబడిని పెట్టడంతో పాటు, స్థానికంగా సుమారు 480 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలను కల్పించనుంది. సదరు సంస్థకు సంబంధిత పాలసీల ప్రకారం ప్రత్యేక రాయితీలను మంజూరు చేయడానికి అనుమతించినట్లు వివరించారు.

# అమరావతిలో భారీ జెయింట్ వీల్

**139 మీటర్లు 28 క్యాప్సూల్స్, భూమి కేటాయింపు**

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి పరిధిలో 139 మీటర్ల ఎత్తులో భారీ జెయింట్ వీల్ ఏర్పాటు చేయనున్నారు. దీనిలో మొత్తం 28 క్యాప్సూల్స్ ఉండనున్నాయి. ఒక్కో క్యాప్సూల్‌లో 20 నుంచి 25 మంది పట్టేలా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి ప్రణాళిక వివరాలను సిఆర్‌డిఎ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేశారు. అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన అమరావతి ఐ జెయింట్ ఐకానిక్ అబ్జర్వేషన్ వీల్ పేరుతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ కింద డిబిఎఫ్‌ఒటి పద్ధతిలో 30 ఏళ్ల లీజు ఒప్పందం కింద దీన్ని నిర్వహించనున్నారు. అమరావతి (ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్‌కు తూర్పు వైపున) కృష్ణా నది ఒడ్డున ఏర్పాటు చేయనున్నారు. ఇది అమరావతి స్తూపం, ధ్యాన బుద్ధ, అమరేశ్వర ఆలయ పర్యాటక ప్రాంతాలకు సమీపంలో ఉంటుందని ప్రణాళికలో పేర్కొన్నారు. భూమి మట్టం నుండి 139 మీటర్లు (లండన్ ఐ కంటే ఎత్తయినది, భారతదేశంలోనే అత్యంత ఎత్తయిన అబ్జర్వేషన్ వీల్)గా ఉంటుందని పేర్కొన్నారు.

128 మీటర్ల చక్రానికి 28 (పూర్తిగా ఎయిర్‌కండిషన్డ్, మెకానికల్ స్టెబిలైజ్డ్) క్యాప్సూల్స్ ఉండనున్నాయి. ఈ వీల్ ఒక రౌండ్ తిరగడానికి బోర్డింగ్‌తో కలిపి సుమారు 27 నిమిషాలు పట్టనుంది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. ఏడాదికి 255 రోజులూ ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రాజెక్ట్ ఆర్థికంగా లాభసాటిగా మారేందుకు వీలుగా దీనిని రెండు భాగాలుగా (కేవలం వీల్ ప్రాజెక్ట్, కమర్షియల్ డెవలప్‌మెంట్) విభజించారు.

వీల్ ప్రాజెక్టును ఐదెకరాల్లో రూ. 120 కోట్లతో చేపట్టనున్నారు. తొలి ఏడాది టికెట్ ఆదాయం (2027) రూ. 32.34 కోట్లు ఉంటుందని ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా ఎకరం స్థలంలో కమర్షియల్ మార్కెట్ పెట్టనున్నారు. వీల్ నిర్వహణలో వచ్చే నష్టాన్ని దీని ద్వారా పూడ్చనున్నారు.ఢిల్లీ ఐ వైఫల్యం నేపథ్యంలో అమరావతి ఐ ప్రాజెక్టులో ఆ లోపాలు లేకుండా నిర్వహించాలని నిర్ణయించినట్లు అందులో పేర్కొన్నారు. అమరావతి కొత్త నగరం కావడం వల్ల ప్రారంభంలో సందర్శకుల సంఖ్య పరిమితంగా ఉండవచ్చని అంచనా వేశారు. వర్షాకాలం (110 రోజులు) ఆదాయం తగ్గుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో గంటల ప్రయాణ దూరంలో 1.3 కోట్ల మంది స్థానిక జనాభా, ఏటా రాష్ట్రానికొచ్చే 25.5 కోట్ల పర్యాటకుల భారీ మార్కెట్ కూడా ఉంటుందని వివరించారు.

# ప్రకృతి వ్యవసాయంతో పశుగ్రాస భద్రతకు శ్రీకారం

● పచ్చిమేత కొరత నివారణకు చర్యలు ● కరపత్రాలను విడుదల చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో రానున్న వ్యవసాయ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో పశుసంపద రక్షణ, పశుపోషకుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పశువులకు పచ్చిమేత కొరత తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో పశుసంవర్ధక శాఖ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పశుగ్రాసాల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా "ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్" విధానంపై రూపొందించిన అవగాహన కరపత్రాలను రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభి వృద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంతో పాటు పశుసంపదపై కూడా పడుతున్న నేపథ్యంలో రైతులు, పశుపోషకులు పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ ప్రకృతి వ్యవసాయ సాంకేతికతలను అనుసరించడం ద్వారా మెరుగైన పశుగ్రాస దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పచ్చి మేత లభ్యత, పశుగ్రాస నిల్వ, తాగునీటి వసతులు, పశుసంరక్షణ చర్యలపై సమగ్ర సమాచారం అందించేందుకు ఈ కరపత్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా రైతులు, పశుపోషకులకు ఈ కరపత్రాలను పంపిణీ చేసి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పశు సంపద పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా పశుపోషకులకు అండగా నిలుస్తుందని స్పష్టంచేశారు. పశు సంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం ద్వారా పశుసంపదను సంరక్షించుకోవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, పశుపోషకులకు అవగాహన కల్పించేందుకు ఈ కరపత్రాలను ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పీతల సుజాత, పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు, శాఖ ఉన్నతాధికారులు,

# ఏలూరు- పోలవరం కాలువల అనుసంధానానికి నిధులు మంజూరు

**ఫలించిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కృషి**

భూములకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు గానూ ఏలూరు- పోలవరం కాలువల అనుసంధానినికి ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏలూరు కాలువ ఆయకట్టు చివరి మండలాలైన కృష్ణాజిల్లా ఉంగుటూరు, బాపులపాడు, ఏలూరుజిల్లా పెదపాడు, ఏలూరు మండలాల పరిధిలోని పంటభూములకు ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో బాపులపాడు మండలంలో పోలవరం కాలువ, ఏలూరు కాలువలు పక్కపక్కనే వెళుతున్నప్పటికీ నీరు ప్రకాశం బ్యారేజ్ వద్దకు చేరుకుని తిరిగి ఈమండలాలకు దాదాపు 100 కిలోమీటర్లు ప్రవహించాల్సి ఉంది. ఈ ప్రాంత రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం బాపులపాడు మండలం బండారుగూడెం వద్ద నుండి పోలవరం కాలువ నీటిని ఏలూరు కాలువకు మళ్ళించేందుకు రూ.15.35కోట్లు నిధులు శంకుస్థాపన చేసారు. తదుపరి వైసిపి ప్రభుత్వం రావటంతో ఈపనులను రద్దుచేసారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఎన్నికల సమయంలో ఈరెండు కాలువలు అనుసంధానానికి నిధులు మంజూరు చేయించి రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత జలవనరులశాఖ ఇంజనీర్లతో తాజాగా అంచనాలు రూపొందించి, జలవనరులశాఖకు ప్రతిపాదనలు అందించారు. ఈప్రాజెక్టు అనుమతులు, నిధుల మంజూరుకు తన వంతు ప్రయత్నాలు చేసారు. నిధుల మంజూరు కోసం పలు ధఫాలు మంత్రి నిమ్మల రామానాయుడును, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈరెండు కాలువల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి నిధులు మంజూరు చేయించారు. పోలవరం కుడికాల్వ 137.290కిలోమీటర్ల వద్ద బండారుగూడెం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి గోదావరినీటిని వాగులోకి ఎత్తిపోస్తారు. ఇక్కడి నుండి 3.5కిలోమీటర్లు వాగు ద్వారా ప్రవహించి ఏలూరుకాల్వ 36 కిలోమీటర్ల వద్ద ఏలూరు కాల్వలో కలుస్తుంది. ఈపథకం కోసం ప్రభుత్వం జివోనెం 335 ద్వారా రూ.38.21కోట్లు మంజూరు చేస్తూ జివో విడుదల చేసింది. రెండు కాలువల అనుసంధానం వల్ల నాలుగు మండలాల్లోని ప్రజలకు తాగునీరు, సాగునీటి ఇబ్బందుల నుండి ఉపశమనం లభించనుంది. ఈమేరకు సోమవారం గన్నవరం ఎయంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, ఎన్ఎస్‌పి ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ, టిడిపి నాయకులు దొంతు చిన్న, గొడ్డళ్ళ చిన్నరామారావు, గూడపాటి తులసీమోహన్, చిరుమామిళ్ళ సూర్యం, తదితరులు మీడియా సమావేశం నిర్వహించి నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు, నిధులు మంజూరుకు సహకరించి మంత్రి నిమ్మల రామానాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడకు కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ సిఐ నాగరాజుకు అనుకూలంగా ధర్నాలు..

# కూపీ లాగుతున్న ఇంటెలిజెన్స్?

**ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారిపై చర్యలకు సన్నద్ధం**

**విజయవాడ (క్రైం),జూన్ 23 ప్రభాతవార్త:** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సిఐ నాగరాజుకు అనుకూలంగా అతని మద్దతుదారులు ర్యాలీలతో పాటు నాగరాజు అరెస్ట్‌ను అడ్డుకోవడానికి యత్నించడంతో వారిపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నాగరాజుకు అనుకూలంగా ఉద్యమించిన వారి డేటాను సేకరించమని ఇప్పటికే ఇంటలిజెన్స్ వర్గాలకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. వారి వివరాలు తెలిసిన తర్వాత వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలు సిద్ధమైనట్లు తెలియవచ్చింది. వారు నాగరాజు ద్వారా లబ్ధి పొందారని, అందువలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారని ప్రభుత్వ పెద్దలు ఆలోచిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి ఈ హై డ్రామా వెనుక ఉన్న తలకాయల ఆనుపానులు త్వరలో తెలియనున్నాయి.

**నోరు మెదపని సిఐ నాగరాజు... నార్కో అనాలసిస్ టెస్ట్ జరగాల్సిందేనా?:** విచారణలో గాదె సాయికృష్ణ అదృశ్యం విషయంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సిఐ నాగరాజు సిట్ బృందం ఎదుట నోరు విప్పలేదని గుసగుసలు వినవస్తున్నాయి. దాంతో అసలు ఏం జరిగింది,ఎప్పుడు జరిగింది,టాస్క్‌ఫోర్స్ ఎసిపి లతాకుమారి బృందం మార్కాపురం నుండి సాయికృష్ణను తీసుకువచ్చిన అనంతరం సిఐ నాగరాజు ఎందుకు అదుపులోకి తీసుకున్నాడు ఇత్యాది విషయాలపై సిట్ దర్యాప్తు బృందం ఇప్పటికే విచారించింది. అయితే నాగరాజు గాదె సాయికృష్ణ అదృశ్యం గురించి నోరు విప్పక పోవడంతో న్యాయస్థానానికి దీని గురించి ఏం చెప్పాలో అనే విషయంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పరిస్థితులను బట్టి న్యాయస్థానం అనుమతితో నార్కో అనాలసిస్ టెస్ట్ చేయిస్తేనే కానిస నాగరాజు నుండి అసలు నిజాలు బయటకు రావని పలువురు అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం.ఒక వ్యక్తిని మాయం చేసి ప్రభుత్వానికి మాయని మచ్చ తెచ్చిన నాగరాజు విషయంపై ప్రభుత్వ కూడ సీరియస్‌గా చర్యలు తీసుకోనున్నట్లు తెలియవచ్చింది.

# క్రిమినల్స్‌తో వైసిపి రాజకీయం

● జాగ్రత్త అంటూ మంత్రులకు సిఎం హితబోధ

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** క్రిమినల్స్‌ను వైసిపి వెనకేసుకొస్తూ రాజకీయం చేస్తోందని సిఎం చంద్రబాబు ఆరోపించారు. కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వైసిపి నేతలు కుల మీటింగ్‌లు పెడుతూ కులాల మధ్య చిచ్చుపెట్టే కుట్రల్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కర్నూలులో ఇటీవల చోటుచేసుకున్న ఘటనను ప్రస్తావించిన ముఖ్యమంత్రి, గ్రామస్థులే బహిష్కరించిన వ్యక్తులకు వైసిపి మద్దతుగా నిలవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అనవసర వివాదాల్లోకి లాగేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి సందర్భాల్లో కూటమి ఐక్యతను చాటే విధంగా మంత్రులంతా స్పందించాలని సూచించారు. ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా సిఎం కీలక ప్రకటనలు చేశారు. జొన్నగిరి గ్రామాన్ని 'స్వర్ణ గ్రామం'గా నామకరణం చేయాలని ప్రతిపాదించారు. అలాగే జులై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు.

# వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

● ప్రభుత్వ ఉత్తర్వులు జారీ ● తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం ● మంత్రి నారా లోకేశ్



మంత్రి మండలి సమావేశంలో నారా లోకేష్

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** వడ్డెర సహకార సంఘాలకు క్వారీ లీజుల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఎపిఎంఎంసి నియమావళిని గనుల శాఖ సవరించింది. ఖనిజాల కోసం క్వారీ లీజుల్లో వడ్డెర సహకార సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు క్వారీల గనుల లీజుల్లో వడ్డెరులకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తామని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసారు. ఇటీవల మంత్రి మండలి ఈ దిశలో నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో వడ్డెర సహకార సంఘాలకు క్వారీ లీజుల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళవారం మంత్రివర్గ సమావేశంలో జరిగిన చర్చలో మంత్రి నారా లోకేష్ ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలన్నింటిని అమలు చేస్తోందని, ఈ విషయాన్ని ప్రజల్లో తీసుకుని వెళ్దామన్నారు. గత మంత్రిమండలిలో తీర్మానం మేరకు వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా. నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వడ్డెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33శాతం వాటాను వడ్డెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 126 జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపైట్ల వడ్డెర సంఘాల నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు కృష్ణా జిల్లాలో మంత్రి లోకేష్ పర్యటన

**గన్నవరం(కృష్ణా), జూన్ 23 ప్రభాతవార్త:** రాష్ట్రవిద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష బుధవారం కృష్ణాజిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. లోకేష్ పర్యటన వివరాలు షెడ్యూల్ ప్రకారం ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం 10గంటలకు అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ గ్రామంలో నూతనంగా నిర్మించిన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభించనున్నారు. ఉదయం 11.10 గంటలకు మోపిదేవి సు బ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12గంటలకు మోపిదేవి గ్రామంలోని ఎస్.విహార్ హోటల్‌లో అవనిగడ్డ నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం అవనిగడ్డ మండలం పులిగడ్డ గ్రామంలోని గురుకుల పాఠశాల వద్ద మత్యకారులతో సమావేశం అవుతారు.

## ఆధ్యాత్మికతకు ప్రాంతీయ సరిహద్దులుండవు

### మలేసియాలో ఆధ్యాత్మిక మహాసభలో ఉమర్ ఆలీషా




**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త:** ఆధ్యాత్మికతకు ప్రాంతీయ సరిహద్దులు ఉండవని అది విశ్వశాంతికి, ప్రపంచ మానువులందరినీ ఒక్కటిగా నిలిపే అఖండ సోదరభావానికి మూలస్తంభమని శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం 9వ పీఠాధిపతి, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (యుఏఆర్‌డిటి) చైర్మన్ డాక్టర్ ఉమర్ ఆలీషా పేర్కొన్నారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని బ్రిక్స్‌ఫీల్డ్స్ షిరిడీ సాయిబాబా సొసైటీ ప్రాంగణంలో శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం మలేషియాశాఖ ఆధ్వర్యంలో 5వ ఆధ్యాత్మిక మహాసభ ఆదివారంరాత్రి జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమర్ ఆలీషా అనుగ్రహ భాషణ చేస్తూ నేటి తరం యువత మూఢనమ్మకాలకులోను కాకుండా వైజ్ఞానిక దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక వివేకంతో సమాజసేవలో పాలుపంచుకోవాలని కోరారు. అందరూ సోదరభావంతో ముందుకు సాగాలని, కులమతాలకు అతీతరంగా ఐకమత్యంతో ఉండాలని హితవు పలికారు. మానవసేవే మాధవసేవ అని సాటి మానవులకు సేవ చేస్తే అది దైవానికి చేసినట్లే అన్నారు. ప్రతి ఒక్కరూ విలువలతో కూడిన జీవనం సాగించాలని సూచించారు. తమసంస్థ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య, పౌష్టికాహారం పంపిణీ, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈకార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బి.సరస్వతి కందస్వామి, గిడుగు ఫౌండేషన్ వ్యవస్థాపకులు గిడుగు కాంతికృష్ణ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా మాజీ అధ్యక్షులు డాక్టర్ అచ్చయ్యకుమార్, మలేషియా షిరిడీసాయిసొసైటీ డిప్యూటీ చైర్మన్ రాజ్‌కుమార్, ఇన్నోవాట్జ్ గ్రూప్ వ్యవస్థాపకులు నిఖిల్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No: MAU61-USI0HB/4/2026-HB/2nd call, Dt: 22-06-2026
**E PROCUREMENT TENDER NOTICE (SECOND CALL)**
Name of Work: "APCRDA-H&B Maintenance-Operation and Maintenance of Street Lighting in VIP Routes of Amaravati Capital Region and Seed Access Road for one year" Estimate Amount: Rs. 1,03,50,000/-. The bid can be downloaded on AP e-procurement portal from 24.06.2026 to 09.07.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid 09.07.2026 up to 15.00 Hrs, Technical bid opening 09.07.2026 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Rayapudi

24-6pg4_24-6pg4.qxd 23/Jun/26 11:15 PM Page 1



వార్త


కోపాన్ని జయించలేనివాడికి ఇతరుల సామర్థ్య లోపాన్ని విమర్శించే హక్కు ఉండదు.

న- ఇ.గిబ్బన్

## ప్రమాద నివారణకు దారిలేదా?


కాదు కాదని ఎంత బుకాయించినా, ఇలాంటివి ఇకపై తగ్గిద్దాంలే అంటూ ఎన్ని మాయమాటలు చెప్పినా ఇరుకిరుకు నివాసాల్లో భవంతుల్లో ఆకాశ హర్మ్యాల్లో సైతం ఊహించని అగ్నిప్రమాదాలను ఆపలేం. కళ్లెదుట మాడి మసైపోతున్న మానవ శరీరాలను చూసి నోరెళ్ల బెట్టడమే మనకు మిగిలింది. మానవ తప్పిదాన్ని కూడా కప్పెట్టే అధికార నైజం, సిబ్బంది నిర్లక్ష్యం ఇవన్నీ వెరసి దేశం ఎక్కడికెళ్తుందో తెలియని అయోమయ పరిస్థితి. నిన్న జరిగిన అగ్నిప్రమాదం, అందులోంచి బయటపడిన విగత జీవులు, అగ్నికి ఆహుతైన క్షణాలు గమనిస్తే ఎవరికైనా కళ్లు చెమరుస్తాయి. నాన్నా! నన్ను కాపాడమంటూ కోచింగ్ విద్యార్థులు పొగచూరిన గదుల్లో చిక్కుకుపోయి కన్నవారికి సెల్‌ఫోన్‌లలో చేసిన కన్నీటి వేడికోళ్లే వారి చివరి సంభాషణలు. కళ్లు కన్నీరు కారుస్తాయి. అయినా అధికారగంణం స్పందించదు. మరో ప్రమాదం జరుగకుండా ఆపగలిగిన పరిస్థితి కనపడదు. ఇలాంటి జాబితాలో తాజాగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవూలో జరిగిన సంఘటనే తార్కాణం. లఖ్‌నవూలో మరో కోచింగ్ సెంటర్‌లో 15 మంది సజీవ దహనమైపోయారు. కోచింగ్ సెంటర్, గేమింగ్ జోన్ ఉన్న భవంతిలో సోమవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. లఖ్‌నవూలోని ఆలీగంజ్ ప్రాంతంలోని ఓ మూడంతస్తుల భవనంలో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆ భవనం అంతా కాలిపోయి మసి బొగ్గులా ప్రత్యక్షమైంది. భవనంపైన యానిమేషన్ కోచింగ్ క్లాసులు జరుగుతుండగా కింది అంతస్తు నుంచి మంటలు పైకెగిసాయి. ప్రమాదం జరిగిన ఆ సమయంలో 30 మంది విద్యార్థులున్నారు. వారిలో కొందరు చుట్టూ పొగలు వ్యాపిస్తున్నా మంటలు ముఖం మీదపడగా హాహాకారాలు చేస్తూ వారిలో కొందరు తమ ప్రాణాలు కాపాడేందుకు కిందికి దూకేసారు. అలా దూకలేనివారు మాత్రం కాలి బూడిదయ్యారు. ఈ సంఘటనపై చెప్తూ ఉపముఖ్యమంత్రి బ్రిజేష్ పాఠక్ సైతం కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఉషామెహతా మార్గ్‌లోని కమర్షియల్ ఏరియాలో ఉన్న ప్రమాద స్థలిలో గ్రౌండ్ ఫ్లోర్‌లో పెంపుడు జంతువుల దుకాణం, పై అంతస్తుల్లో కోచింగ్, గేమింగ్ సెంటర్‌లున్నాయి. నిరంతరం విద్యార్థులు తమ కోచింగ్‌పై అక్కడే ఉంటుంటారు. మంటలు భారీగా వ్యాపించాయి. విద్యార్థులకు తప్పించుకునే దారి దొరకలేదు. దాదాపు పద్దెనిమిది మంది పై అంతస్తు నుంచి దుమికారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒకే భవనంలో చిన్న అగ్ని ప్రమాదంగా జరిగినా అగ్నిమాపక సిబ్బంది తీరిగా అరగంట దాటాక ప్రమాదస్థలి చేరుకోవడంలో బాధితు లకు సహాయ సహకారాలేమీ అందలేదు. తక్షణమే వచ్చి ఉంటే పై అంతస్తులో చిక్కిపోయిన వారిలో మరి కొందరినైనా బయటకు తెచ్చే పరిస్థితి ఉండేది. 19 ఫైర్ ఇంజిన్‌లు, ఒక భారీ హైడ్రాలిక్ ప్లాట్‌ఫారం మంటలను ఆర్పేందుకు అక్కడికి చేరుకున్నాయంటే ఇదెంత భారీ అగ్నిప్రమాదమో చెప్పుకోవచ్చు. గ్రౌండ్ ఫ్లోర్‌లో దుకా ణంలోని పక్షిజాతి జంతువులన్నీ అగ్నికిఆహుతయ్యాయి. ఎప్పటికప్పుడు ఇలాంటి అగ్ని ప్రమాదాల కొత్తేమీ కాదని సరిపెట్టుకోవడం విచిత్రం. ఒక దుస్సంఘటన మరో దుస్సంఘటనకు మార్గదర్శకం కాకూడదు. జరిగినలోపాల బేరీజుతో వాటిని సరిదిద్దుకోవాలి తప్పితే ఇక మనం చేయగలిగేదేమీ లేదని సరిపెట్టుకోవడం మంచిదికాదు. ప్రభుత్వ శాఖలు అగ్నిమాపక సంస్థలు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. నిరంతర పర్యవేక్షణ ఉంటే ఇలాంటి అగ్ని ప్రమాదాల స్థాయి తగ్గించగలుగుతారు. ప్రాణనష్టాలు జరుగుతున్న సందర్భాలన్నీ దిగ్భ్రాంతి కలిగించేవే. పలువురిలో చర్చ నీయాంశంగా కూడా ఉంటాయి. ప్రభుత్వ వైఫల్యాలపై నిఘా లేకుంటే మళ్లీ మళ్లీ ఇటువంటి ఘోర ప్రమాదాలు జరగవని గ్యారంటీ ఇవ్వలేం. సంఘటనలు జరిగాక సమీక్షించుకుని కఠిన చర్యలు తీసుకుంటే అటువంటి ప్రమాదాలు మరోసారి జరగవు. కోచింగ్ సెంటర్లకు వచ్చిన విద్యార్థులు ప్రమాదాల బారిన పడి మృతిచెందడం ఇదే మొదటిసారి కాదు. ఢిల్లీలో ఇలాంటి సంఘటనే జరిగింది. లక్నో ఘటన పూర్తి నిర్లక్ష్యానికి సమూల సాక్ష్యం. కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులతో నిండిపోయి ఉంటాయి. వాటికి అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారంలు, స్ప్రింక్లర్ వ్యవస్థలు, భద్రతా శిక్షణ వంటి అంశాలపై ఏ ప్రభుత్వ సంస్థా వాటి అమలుకు ప్రయత్నించదు. భద్రతా చర్యలు ఏవైనా ఉన్నా అవి కాగితాలపైనే ఉంటాయి. వాళ్లు తీసుకోగలిగిన జాగ్రత్తల విషయమై నిర్దిష్టంగా వారే అమలు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వమే జరిగిన ప్రమాదాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం మంచిది. వాణిజ్య సంస్థలు భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటామో విశదీకరించాలి. ఆయా సంస్థల అడుగులకు మడుగులొత్తుతూ జరిగిననేరాల నుంచి వారిని తప్పించేందుకు సహకరించకూడదు. ఇలాంటి సందర్భాల్లో ప్రాణనష్టానికి బాధ్యత ఎవరు వహించాలో స్పష్టంగా నిర్ణయించగలిగితే తప్పుడు విధానాలు అవలం బించే సమయంలో అడ్డుకోవచ్చు. మానవ నిర్లక్ష్యంలో జరిగిన విపత్తులలో ఘోరవిపత్తులకు కారకులైన వారిని ఎట్టి పరిస్థితులలోనూ వదలరాదు. అనుమతిలేని అక్రమ నిర్మాణాలకు అవకాశమీయరాదు. అప్పుడే అగ్నిప్రమాదాలను నివారించగలం. విద్యాసంస్థలు, కోచింగ్ సంస్థల్లోని అంతస్తులో ఫైర్ ఎక్స్టింగిషర్లు ఉండాలి. ఎమర్జెన్సీ ఎగ్జిట్ అందుబాటులో ఉండాలి. ప్రాణభద్రతను కాగితాల మీద కాకుండా కార్యరూపంలో అమలు చేయడం అవసరం.

పదేళ్ల పుస్తక పఠనం కంటే, విజ్ఞుడితో గడియ ముచ్చట్లు మేలు.



టి. ఫుల్లర్

పొగిడే వాడి పట్ల జాగ్రత్తగా ఉండు. లేనిచో ఖాళీ కంచంతో నీ కడుపు నింపగలడు.



ఆస్కార్ వైల్డ్

# ప్రత్యామ్నాయ జల మార్గం అవసరం!

*అనేక విధాలుగా సాఫ్ట్వేర్ రంగంలో భారతీయులు అమెరికాకు చేదోడు వాదోడుగా వుండి వారి ఆర్థికాభివృద్ధికి కొంత కారకులైన మాట నిజం! చైనా పాకిస్థాన్లను దగ్గరకు తీయటానికి అమెరికా ఈ మధ్యకాలంలో ప్రయత్నిస్తుండటం అందరూ చూస్తున్న విషయమే! ఒక విధంగా భారత్ అంతర్జాతీయ విషయాలలో స్పష్టమైన వైఖరితో ఎవరితో జత కలవకుండా, తన ప్రగతి తాను సాధించుకొనే దిశగా పయనిస్తుండటంతో ఇతర దేశాలు గూడా ఇండియా స్వతంత్ర నిర్ణయాలతో సమస్యకు తగ్గట్టుగా వ్యవహరించటాన్ని అభినందిస్తున్నాయి! అయితే ప్రస్తుతం భారత్ తక్షణ సమస్య హార్ముజ్ జలసంధి ద్వారా దిగుమతులు కాకుండా మరో జలమార్గం ద్వారా పొందాల్సిన పరిస్థితి! ఆ మార్గం అన్వేషించుకొని ఆ దిశగా మనం పయనించక తప్పదు! స్వతంత్ర ప్రతిపత్తితో మన ఆర్థిక పురోభివృద్ధిని ఎవరిమీదా ఆధారపడకుండా సాధించుకోవాల్సిందే!*



రావులపాటి సీతారాంరావు

పూర్తి స్వదేశీ సాంకేతికతతోరూపుదిద్దుకున్న మూడు భారీయుద్ధ నౌకలను నౌకాదళంలకి చేర్చిన ఘట్టాన్ని మన దేశ ప్రధాని నరేంద్రమోడీ, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో (కలకత్తాలో) ఆవిష్కరించటంతో దేశీయ రక్షణ సామర్థ్యానికి ముందడుగు వేసినట్లయింది! ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక కార్యకలాపాల్లో నౌకరంగంతో పాటు సముద్ర జలాల విషయంలో స్వంతంగా కొన్ని ప్రణాళికలు రచించి, ఆచరించాల్సిన అవసరం నిన్నా, మొన్న జరిగిన యుద్ధంతో సముద్రం మీద ఆధిపత్యం ఎంత అవసరమో మనకూ, ప్రపంచ దేశాలకూ చెప్పకనే చెప్పినట్లయింది! వాణిజ్యం, ఆర్థికంగా బలోపేతం కావటం లాంటివి రాజకీయ ఆధిపత్యాన్ని కలిగిస్తాయని ఇంతకు మునుపు నమ్మేవారు. కానీ మొన్నటి హార్ముజ్ జలసంధి ఎవరి ఆధీనంలో వుండాల్నో, అటు అమెరికా, ఇటు ఇరాన్ పోటీపడటమే కాకుండా పెక్కు దేశాలకు ఆయిల్ దిగుమతి, అదీ ఆయిల్, క్రూడ్ ఉత్పత్తులతో సహా నౌకలు సముద్రయానంతో జలాలమీద అవసరమున్న దేశాలకు తరలించినప్పుడే ఆర్థికంగా ప్రజలను, దేశాలను సంతోష భరితులను చేయొచ్చు అని భావిస్తున్నారు. చమురు తరలింపుతో బిలియన్లకొద్ది డాలర్లు సంపాదించటం జరుగుతున్నది! అయితే నౌకా యానంలో తరలించే ఈ చమురు ఉత్పత్తుల వ్యవహారంలో చాలా 'రిస్క్'లు వున్నాయి! పైరసీతో బాటు, భౌగోళిక రాజకీయ ఇబ్బందులు గూడా క్షణక్షణం సరుకు కోరుకున్న వారికి చేరేసరికి ఎదురవుతునేవుంటాయి! ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ దేశాలు సంఘర్షణ పడినప్పుడు 'నీటి దోవలను' నియంత్రించి, ఆధిపత్యం చెలాయించటం, ఆర్థిక ఆంక్షలు పెట్టటం హార్ముజ్ జలసంధి విషయంలో అందరికీ అవగతం అయింది! చాలా క్లిష్టమైన బలహీనతలు ఈ ఆంక్షల ద్వారా వెలికివస్తాయని ఇరాన్ చెప్పినట్లయింది! యుద్ధాలు సంభవించటానికి ప్రత్యేక కారణంగా నీటిదారులను (వాటర్ వేస్)ను గూడా చేర్చాల్సిన ఆవశ్యకత ఏర్పడింది! అందుకనే ఇరాన్, జలసంధిని మూసివేసామని, అమెరికా, బ్లాక్లేడ్ విధించామని ఆధిపత్యం నిరూపించుకోటానికి తపన పడుతూ యుద్ధ జ్వాలలను సమిసిపోనివ్వటం లేదు! ఎనర్జీ ఇంధనం ఆయిల్ ఎగుమతులు 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్' మూసివేయటం వల్ల, చాలా యిబ్బందులు అనేక దేశాల ప్రజలు, ప్రభుత్వాలూ ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది! ఆర్థిక అస్తవ్యస్త వ్యవహారాల వల్ల యు.యస్ ఇరకాటపు స్థితిని తమ దేశంలో గూడా ఎదుర్కొంటున్నది. ఇజ్రాయిల్ ఒత్తిడితో యుద్ధం మొదట్లో అమెరికా కొన్ని చిన్నపాటి విజయాలు సాధించిన అనుభవంతో, ఇరాన్‌ను అదుపుచేసి పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకోవాలని కలలు కన్నది! కానీ తమ అధినాయకుడిని కోల్పోయిన ఇరాన్ ప్రజలు దేశంలోని కుమ్ములాటలు మరిచిపోయి ఒక్కతాటి మీద నిలిచి, ఇరాన్ ప్రభుత్వానికి కష్టసమయంలో వత్తాసు పలకటంతో యు.యస్.ఏ గుక్కతిప్పుకో లేకపోయింది. ట్రంప్ దాంబిక బెదిరింపులు ఎందుకూ పనికి రాలేదు. దేశంలో అధ్యక్షుని విలువ మసకబార సాగింది. అలాంటి పరిస్థితులలోనే సంధి సంప్రదింపులు మొదలయ్యాయి. ఆటంకాలు తొలిగిపోలేదు. ఇజ్రాయిల్ కొరకరాని కొయ్యగానే వుంది. లెబనాన్ ఈ శాంతి అగ్రిమెంటులో



భాగంగానట్లు ప్రవర్తిస్తూ ఇజ్రాయిల్ ఎదురు దాడులకు దిగుతున్నది! ఈపరిస్థితులలో శాంతి ఒప్పందం నిలుస్తుందో నిలవదో ఎవరూ చెప్పలేకుండా వున్నారు! ఇరాన్ ఈ నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ (స్ట్రెయిట్ అథారిటీ అన్న దానిని ఏర్పరిచి, యుద్ధ సమయంలో ఈ అథారిటీయే హార్ముజ్ జలసంధి వ్యవహారాలను హాండిల్ చేస్తుందని చెప్పటంతో, ఎల్.పి.జి, క్రూడ్ ఆయిల్ దిగుమతుల సమస్యను అధిగమించటానికి 'వాటర్ వేస్' కొత్త రూట్స్ హార్ముజ్ జలసంధి ద్వారా కాకుండా మరో మార్గాల ద్వారా దిగుమతులు చేసుకొనే విషయంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించటానికి, యునైటెడ్ అరబ్ ఎమిరేటస్ 'జీరో డిపెండన్సీ' సూత్రాన్ని ఆచరించటానికి పూనుకోవటంతో, ఇండియా ప్రభుత్వం గూడా అదేరీతిలో కొత్త మార్గాలను అన్వేషించే పనిలో పడిందని కొందరు చెపుతున్నారు! సప్లయి చైన్స్ను మళ్ళించుకోక తప్పదు! మరో నౌకాయాన మార్గాన్ని ఎన్నుకొని పెట్టుబడులు అటు దిశగా మళ్ళించుకోవాలి! 'లాండ్ కారిడార్స్'ను గూడా కనిపెట్టుకోగలగాలి! కీలకంగా వ్యవహరించే దేశాలతో పార్టనర్స్‌గా చేరాలి! చైనా ముందే జాగ్రత్తపడి ఈ విషయంలో సముచిత నౌకాయాన మార్గాలను వృద్ధి చేసుకుంది! చాబహార్ ప్రాజెక్ట్ లాంటి ప్రాజెక్ట్స్ వల్ల అవకాశాలు కలిగే స్థితి ఏర్పడినా భారత్ అలాంటివి పరిగణనలోకి తీసుకోలేదు! హార్ముజ్ జలసంధి మీద ఆధారపడి దిగుమతుల మీద ఆశలు పెంచుకోవటం తగదు. ఆర్థికంగా చిక్కు సమస్యలు ఎదుర్కోకుండా వుండటానికి ఆ జలసంధి సహకారం పోనుపోను రాజకీయ కారణాల వల్ల తక్కువ కావచ్చు! స్వయంగా భారత్ వేరే మార్గాలను ఎన్నుకొని ఆర్థిక కుంగుబాటును తొలిగించుకోక తప్పని పరిస్థితి! అయితే ప్రస్తుతం మూడు భారత జెండాతో భారీ క్రూడ్ ఆయిల్ టాంకర్లు హార్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటటంతో కొంత ఊరట లభించినట్లయింది! 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురుతో ఈ నౌకలు ప్రస్తుతం భారత ఓడ రేవుల వైపు వస్తున్నాయి! ఈనౌకల పేర్లు దేశ వైభవ్, దేశ్ విభోర్, సన్మార్ హెరాల్డ్! నావికుల భద్రతతో పాటు దేశ ఇంధన సరఫరా మార్గాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించటం శుభసూచకం! యుద్ధాలు మొదలుపెట్టేది ఒకరైతే పరిణామాలు అనుభవించేది మరొకరు! నిజానికి 'భారత్ లాంటి దేశాలకు జరుగుతున్న ఈ యుద్ధంతో అణుమాత్రం సంబంధంకూడా లేదు. గాలికి పోయే కంప మాదిరి సంబంధం లేని దేశాలు ఈ వ్యవహారాన్ని చూస్తున్నాయి! ఇజ్రాయిల్ ప్రధాని మోడీని యుద్ధం ప్రారంభం కాకమునుపు జొజ్జరకొట్టే ప్రయత్నం చేసింది! అమెరికా ట్రంప్ రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికయినప్పటి నుంచీ పాకిస్థాన్తో మరింత స్నేహాన్ని పెంచుకొని భారత్లో పైపైన స్నేహాన్ని నటిస్తున్న అనుమానం కొన్ని సంఘటనలను నిదర్శనంగా భావించవచ్చు! సుంకాలను ఇండియాపై అమెరికా పెంచుతుందని ఎవరూ ఊహించను గూడా లేదు! అనేక విధాలుగా సాఫ్ట్వేర్ రంగంలో భారతీయులు అమెరికాకు చేదోడు వాదోడుగా వుండి వారి ఆర్థికాభివృద్ధికి కొంత కారకులైన మాటనిజం! చైనా పాకిస్థాన్లను దగ్గరకు తీయటానికి అమెరికా ఈ మధ్య కాలంలో ప్రయత్నిస్తుండటం అందరూ చూస్తున్న విషయమే! ఒక విధంగా భారత్ అంతర్జాతీయ విషయాలలో స్పష్టమైన వైఖరితో ఎవరితో జత కలవకుండా, తన ప్రగతి తాను సాధించుకొనే దిశగా పయనిస్తుండటంతో ఇతర దేశాలు గూడా ఇండియా స్వతంత్ర నిర్ణయాలతో సమస్యకు తగ్గట్టుగా వ్యవహరించటాన్ని అభినందిస్తున్నాయి! అయితే ప్రస్తుతం భారత్ తక్షణ సమస్య హార్ముజ్ జలసంధి ద్వారా దిగుమతులు కాకుండా మరో జలమార్గం ద్వారా పొందాల్సిన పరిస్థితి! ఆ మార్గం అన్వేషించుకొని ఆ దిశగా మనం పయనించక తప్పదు! స్వతంత్ర ప్రతిపత్తితో మన ఆర్థిక పురోభివృద్ధిని ఎవరిమీదా ఆధారపడకుండా సాధించుకోవాల్సిందే! ●

# విత్తన బంతులు.. పచ్చని అడవులకు చిరునామా!

డాక్టర్ చిట్యాల రవీందర్

ప్రస్తుత వర్షాకాలంలో పర్యావరణ పరిరక్షణ కోసం అత్యంత ఆసక్తికరమైన, ప్రభావవంతమైన పద్ధతుల్లో ఒకటి సీడ్‌బాల్స్ లేదా విత్తన బంతుల తయారీ, వాటిని వెదజల్లే ప్రయోగం. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న ఈ సమయంలో సీడ్‌బాల్స్ ప్రయోగం పర్యావరణానికి ఒక వరం వంటిది. సీడ్‌బాల్స్ అంటే మట్టి, కంపోస్ట్ (ఎరువు) విత్తనాల మిశ్రమంతో తయారు చేసిన చిన్నచిన్నబంతులు. ఇవి ప్రకృతిసిద్ధమైన అడవుల పునరుజ్జీవనానికి, ముఖ్యంగా మానవ ప్రమేయం తక్కువగా ఉండి, మొక్కలు నాటడానికి వీలుపడని కొండ ప్రాంతాలు, బంజరు భూములు అడవి ప్రాంతాల్లో అడవుల పెంపకానికి అద్భుతమైన మార్గం. వర్షాకాలం ప్రారంభమైన వెంటనే ఈ సీడ్ బాల్స్‌ను వెదజల్లడం వల్ల, పడిన వర్షపు నీటికి బంతిలోనిమట్టి కరిగి, అందులోని విత్తనం మొలకెత్తడానికి కావలసినతేమ పోషకాలు అంది, ప్రకృతి సిద్ధంగానే మొక్కలు మొలవడం మొదలవుతుంది. ఈ పద్ధతిలో విత్తనం నేరుగా భూమిపై పడకుండా, మట్టి పొరలో సురక్షితంగా ఉండటం వల్ల పక్షుల నుండి, ఎలుకల నుండి లేదా ఎండ వేడిమి నుండి రక్షణ లభిస్తుంది. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న భూ తాపం, అడవుల నరికివేత వంటి సమస్యలకు సీడ్ బాల్స్ ఒక సరళమైన, తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారం. వీటిని తయారు చేయడం కూడా చాలా సులభం. ఎర్ర మట్టిని, వర్మీ కంపోస్ట్ లేదా పశువుల ఎరువును కలిపి, అందులో ఆ ప్రాంతపు వాతావరణానికి తగిన దేశవాళీ వృక్షాల విత్తనాలను ఉంచి చిన్న బంతులుగా చేసి, నీడలో ఆరబెట్టి, వర్షాలు పడుతున్నప్పుడు ఖాళీప్రదేశాలలో విసి రితే సరిపోతుంది. ముఖ్యంగా ఈ వర్షాకాలంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల విత్తనాలు కుళ్ళిపోకుండా మొలకెత్తే అవకాశం 80-90 శాతం వరకు ఉంటుంది. ఈ ప్రయోగంవల్ల అటవీ ప్రాంతాల్లో జీవవైవిధ్యం పెరుగుతుంది. నేల కోత నివారించబడుతుంది. భూగర్భ జలాలు పెంపొందుతాయి. అయితే, ఇందులో ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఏ ప్రాంతంలో అయితే సీడ్ బాల్స్



వేస్తున్నామో, ఆ ప్రాంతానికి సహజంగా అలవాటైన లేదా స్థానిక వృక్ష జాతుల విత్తనాలను మాత్రమే వాడాలి. పరాయి ప్రాంతాల నుంచి తెచ్చిన లేదా కలుపు మొక్కల విత్తనాలను వాడటంవల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. అలాగే, సరైన సమయంలో అంటే వర్షాలు పడటం ప్రారంభించిన మొదటి లేదా రెండో వారంలోనే వీటిని వేయడం వల్ల, మొక్కలకు వేర్లు ఊరేలోపు తగినంతవర్షం దొరికి అవి దృఢంగా తయారవుతాయి. సీడ్‌బాల్స్ ప్రయోగం అనేది కేవలం మొక్కలు నాటడమే కాదు, ఇది భావి తరాలకు పచ్చని ప్రకృతిని అందించే ఒకసామాజికబాధ్యత. పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక కమ్యూనిటీలు కలిసి ఈ పనిని ఒక ఉద్యమంలా చేపడితే, రాబోయే కొన్ని సంవత్సరాల్లోనే మన చుట్టూ ఉన్న బంజరు నేలలు పచ్చని వనలుగా మారుతాయి. ప్రతి వ్యక్తి తన పుట్టినరోజున లేదా ప్రత్యేక సందర్భాల్లో ఇలాంటి వందల సంఖ్యలో సీడ్‌బాల్స్‌ను తన ప్రయాణాల్లోలేదా ఖాళీ స్థలాల్లో వేయడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతిని కాపాడుకోవడానికి, భూమిని తిరిగి సస్యశ్యామలం చేయడానికి సీడ్ బాల్స్ కంటే తక్కువ ఖర్చుతో, ఎక్కువ ఫలితాలను ఇచ్చే మార్గం మరొకటి లేదు. ప్రతి ఒక్క గింజలో ఒక అడవిని నిర్మించే శక్తి దాగి ఉంటుంది, దానికి కావలసింది కేవలం చిన్న ప్రయత్నం వర్షపు జల్లుల తోడుమాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీ వల విత్తన బంతుల పెంపకానికి, పంపిణీకి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక కమ్యూనిటీలు కలిసి తీసుకుంటున్న చొరవ పర్యావరణ పరిరక్షణలో ఒక గొప్ప మైలు రాయిగా నిలుస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ భౌగోళికంగా ఎంతో వైవిధ్య భరితమైనది. అయితే అడవులు తక్కువగా ఉన్న కొండ ప్రాంతాలు, బంజరు భూముల్లో మొక్కలు నాటడం సవాలుతో కూడుకున్న పని. ఇటువంటి క్లిష్టమైన ప్రదేశాల్లోవిత్తన బంతులు వేయడం ద్వారా మానవ ప్రమేయం లేకుండానే ప్రకృతి సిద్ధంగా మొక్కలు మొలకెత్తడానికి మార్గంసుగమం అవుతోంది. ఈ చొరవలో భాగంగా వేప, కానుగ, మర్రి, రావి వంటిస్థానిక వృక్ష జాతుల విత్తనాలను వినియోగించడం వల్ల మన ప్రాంత వాతావరణానికి తట్టుకోగల చెట్లు పెరుగుతాయి. ఇది పర్యావరణ సమతుల్యతను కాపాడటమే కాకుండా స్థానిక పక్షుల జీవ

# అక్రమ ఆరోపణల 'ఉపా'యంతో అపాయం!



డాక్టర్ నీలం సంపత్

ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్‌లు సంయుక్తంగా ఢిల్లీ వేదిక గా కార్యకలాపాలను కొనసాగిస్తున్న ఓ స్వతంత్ర డిజి టల్ మీడియా సంస్థ న్యూస్ క్లిక్ పై, దాని వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పురకాయస్త పై 'విదేశీ ప్రత్యక్ష పెట్టు బడుల' సేకరణ విషయంలో యఫ్.డి.ఐ నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఐ.పి.సి 420 పి.యమ్.యల్.ఏ సెక్షన్ 4 ప్రకారం మనీ లాండరింగ్ కేసు నమోదుచేయడం వెనుక నేపథ్యం ఏమయివుంటుందనే అంశంలో ఓ చిన్నపాటి విశ్లేషణ అవసరమేమో. అందులో భాగంగా ఆయనపై, ఆయన సిబ్బందిపై అనేక దాడులు, అరెస్టులు, వేధింపులు, లోతైన పరిశోధనలు, విచారణలు జరిపింది. ఈ కేసులకు అదనంగా అక్టోబర్ 2023 లో దేశ సమగ్రతకు, భద్రతకు భంగం కలిగిస్తున్నారంటూ ప్రబీర్ పురకాయస్త పై ఉపా కేసును నమోదు చేయడంతెలిసినదే. 2024లో తనకు న్యాయం చేయమంటూ ప్రబీర్ పురకాయస్త సుప్రీం కోర్టునిఆశ్రయించిన నేపథ్యంలో కేసు పూర్వాపరాలను సమగ్ర విచారణ చేసిన తదనంతరం భారత సర్వోన్నత న్యాయ స్థానం ఆయన అరెస్ట్ అక్రమం, చట్ట విరుద్ధమని తేల్చి చెప్పింది. దాదాపు ఒకటిన్నర సంవత్సరాల న్యాయ విచారణ తర్వాత గతనెల 29న ప్రబీర్ పురకాయస్త, న్యూస్ క్లిక్ పై నమోదైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆరోపణల కేసులో నిబంధనల ఉల్లంఘన జరగలేదని, తమను మోసగించారని ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని, కేవలం ఓ ఇన్ ఫార్మర్ ఇచ్చిన సమాచారం ప్రాతిపదికన ఐ.పి.సి 420కేసు పెట్టడం అన్యాయమని, చట్ట విరుద్ధమని వ్యాఖ్యానిస్తూ నేరం, మోసం జరిగిందనే ప్రాథమిక సాక్ష్యాధారాలేవీ లేవనీ ఓ స్వతంత్ర న్యూస్ ఛానల్‌పై అదో కుట్ర పూరిత కట్టు కథగా అభివర్ణిస్తూ ఢిల్లీ హైకోర్ట్‌లో నీనా బన్సల్ కృష్ణ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఆ కేసును కొట్టివేయడం జరిగింది. ఆది నుండి ఇ.డి, ఐ.టి, సి.బి.ఐ లాంటి అత్యంత ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల పనితీరు పట్ల న్యాయవ్యవస్థ పూర్తిస్థాయి అసం తృప్తిని వెల్లగక్కుతుండడం బహిరంగ రహస్యమే. నిజానికి సదరు విచారణ సంస్థలపై న్యాయవ్యవస్థ అసహనానికి ప్రధాన కారణం న్యాయస్థానాలలో కేంద్రప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న నేరపరిశోధన సంస్థలు వివిధ వ్యక్తులు, వ్యవస్థలపై చేస్తున్న ఆర్థిక నేరారోపణలనూ, మోపుతున్న అభియోగాలను నూటికి తొంభైఐదు శాతం ఋజువు చేయలేక పోతుండడాన్ని బట్టి న్యాయ వ్యవస్థ అసలా ఆర్థిక నేరాలే జరగకపోవచ్చనే ముక్తాయింపుకు రాకతప్పడం లేదు. సరిగ్గా అదే సమయంలో ఓ అమెరికా పత్రిక వివిధ ఇతర దేశాలతోసహా భారత దేశంలోనూ చైనా అనుకూలతను



పెంచి పోషిస్తున్న చైనా అధికారిక మీడియాతో న్యూస్ క్లిక్ కలిసి పనిచేస్తూ దేశా నికీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నాయనే తీవ్ర మైన అభియోగాన్ని మోపుతూ ఓ కథనాన్ని ప్రచురించింది. తదనంతరం న్యూస్ క్లిక్ వ్యవస్థాపక సంపాదకుడైన ప్రబీర్ పురకాయస్తతో పాటు ఆ సంస్థలో పనిచేస్తున్న ఇతర జర్నలిస్టులు, కథనాలు రాసిన లబ్ధ ప్రతిష్టులైన వ్యాసకర్తలపై మనీ లాండరింగ్, ఛీటింగ్ లాంటి ఆర్థికనేరాలకు సంబంధించిన చట్టాలను ప్రయోగించి అరెస్ట్ చేసి జైలులో పెట్టడం గమనార్హం. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించిన ఆ ఘటనను ప్రపంచ పత్రికా రంగం నిరసించడమేకాదు, గర్హించడం జరిగింది. ఐతే అంతర్జాతీయ సమాజపు స్పందన ను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని కేంద్ర ప్రభుత్వం చైనా అనుకూల, భారత వ్యతిరేక వార్తలను రాస్తున్నందుకు మీ పత్రికకూ, మీకు కొమ్ముకాస్తున్నప్రతిపక్ష పార్టీ అధి నేతకు పెద్ద మొత్తంలో సొమ్ములు ముడుతున్నాయంటూ, మీరు శత్రుదేశాలకు పేడ్ మీడియాగా పనిచేస్తున్నారని ఢిల్లీ పోలీసులు ప్రశ్నించినారంటూ అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితులు చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి. అధికార పార్టీ పార్లమెంట్ సభ్యులు సైతం పార్లమెంట్ వేదికగా న్యూస్ క్లిక్‌పై దేశ ద్రోహ ఆరోపణలు చేసిన వైనం తెలిసినదే. వీటన్నింటి పర్యవసానంగా ప్రబీర్ పురకాయస్త 'ఉపా' కేసు మోపబడి జైలు పాలయ్యాడు. 225రోజులు జైలులో ఉన్నప్పటికీ మనీ లాండరింగ్, ఛీటింగ్ కేసులపై తన న్యాయపోరాటాన్ని కొనసాగించాడు. ఏంజరగబోతోంది? 2026వ సంవత్సరానికి ప్యారిస్ ఆధారిత గ్లోబల్ మీడియా వాచ్‌డాగ్, రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ తయారుచేసిన ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో 180లో 157వ స్థానంలో కొనసాగుతున్న ఘన (అప)కీర్తిని మూట గట్టుకున్న మన దేశంలో ఢిల్లీ హైకోర్ట్ తీర్పుని కేంద్రప్రభుత్వం తప్పని సరిగా సుప్రీం కోర్టులో సవాల్ చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఐతే ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన మన దేశం లో రాజ్యాంగ నిబంధనల స్ఫూర్తితో పాత్రికేయ ధర్మాన్ని త్రికరణ శుద్ధిగా నిర్వర్తిస్తూ రైతులూ, కార్మికులూ, విద్యా ర్థులూ, నిరుపేదలూ, సామాన్య ప్రజల గొంతుకగా మారి వారి బ్రతుకు కోసం, భవిష్యత్ కోసం తద్వార దేశ సామాజిక, ఆర్థిక సుస్థిరత కోసం పోరాడుతున్న పత్రికలూ, పాత్రికేయులూ, మీడియా సంస్థలపై పాలకులు కుట్రలతో, కుతంత్రాలతో పత్రికా స్వేచ్ఛను హరిస్తూ మనీలాండరింగ్ లాంటి ఆర్థిక నేరారోపణలూ 'ఉపా' లాంటి దేశ ద్రోహ ఆరోపణలతో జైల్లలో వేసినప్పటికీ నిమ్మకు నీరెత్తుతూ తమతమ పత్రికలలో ఒక్క అక్షరం కూడా ప్రభుత్వాల చర్యలను ఖండించలేకపోవడాన్ని ఏమనుకోవాలి. ఒక వేల అదే నిజమైతే దేశంలో పత్రిక రంగం పాలకుల నిరంకుశ విధానాల బంధనాలను ఛేదించుకుని ఐక్యంగా తమను తాము కాపాడుకుంటూ పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు అవసరమైన శక్తిని సమకూర్చుకోవడానికి వేసిన ఓ అతి పెద్ద ముందడుగుగా భావించక తప్పదు. ●

## ప్రజావాక్కు

### పరిమితులకు లోబడి సాంకేతికత

**పదహారేళ్లలోపు** వయసున్న పిల్లలకు సామాజిక మాధ్యమాలవాడకాన్ని పూర్తిగానిషేధించాల్సిన ఆవశ్యకత ప్రస్తుతంఎంతైనా ఉంది. ఆధునిక కాలంలో సాంకేతికత విస్తరించడం వల్ల చిన్న వయసులోనే పిల్లలు డిజిటల్ ప్రపంచానికి బానిసలుగా మారుతున్నారు. దీనివల్ల వారి మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, శారీరక శ్రమ తగ్గిపోతోంది. సామాజిక మాధ్యమాలలో వచ్చే అపరిమితమైనసమాచారం, హానికరమైన కంటెంట్, సైబర్ వేధింపులు పిల్లల సున్నితమైన మనస్సులపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. వారు తమ అమూల్యమైన బాల్యాన్ని, చదువును విస్మరించి తెరలకే పరిమితమవుతున్నారు. ఈ తీవ్రమైన సమస్యను గుర్తించిన కొన్ని దేశాలుఇప్పటికే దీనిపై కఠినమైన నిర్ణయాలు తీసుకున్నాయి. ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాలు పదహారేళ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాలను ఉపయోగించకుండా చట్టపరమైన నిషేధాన్ని విధించాయి. ఫ్రాన్స్, డెన్మార్క్ వంటి ఇతర దేశాలు కూడా తక్కువ వయసున్న మైనర్ల కోసం ఇలాంటి వయోపరిమితి నిబంధనలను, తెర సమయ నియంత్రణలను అమలు చేస్తున్నాయి.

*- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం*

### ప్రకృతి వైద్యం

కొన్ని వేల ఏళ్లక్రితం మనిషి జీవనంలో ప్రకృతి విస్తృతంగా ఉండేది. దానిమీదే దినం గడిపే వారు. కాయకష్టం వల్ల శరీరాలు ధారుడ్యం, పూర్తి రోగనిరోధక శక్తి ఉండేది. ఆకులు, గింజల వైద్యం వారికి శరణ్యం. అది అప్పటి పరిస్థితి. గానీ ఇప్పుడు వైద్యశాస్త్రం విస్తృతంగా పెరిగి రోగ నిర్ధారణతో వైద్యం ఫలితం ఇస్తుంది. కొందరి దేహ స్థితి కొన్ని పదార్థాలకు వికృతంగా కనిపిస్తుంది. అందుకు శరీర లక్షణాలు చూడకుండా అల్లోపతి వైద్యం చేయరాదు. అలానే పాత ఆకుల రసం అందరికీ పనిచేయదు.

*- బొల్లోజు మేఘ్నాధం, విశాఖపట్నం*

### పంటలు పండితేనే రైతు సుభిక్షం

**అన్నదాతను** కరుణించని వాన మృగశిర ముగిసి ఆరుద్ర ఆరంభమైన ఇంక కరుణించని వాన దేవుడు. ఆందోళనలో అన్నదాతలు సరిగా పడని వర్షం ఇంకెప్పుడు వర్షం పడేది ఇంకెప్పుడు పెద్దగా అయ్యేది అని ఎదురుచూస్తున్న రైతన్నలు వానలు సరిగ్గా కురిసి పంటలు పండితేనే రైతన్న సుభిక్షంగా ఉంటాడు. లేదంటే అంధకారమే.

*-మోటె శివకుమార్, రంగారెడ్డిజిల్లా*

### విశ్వాసం కోల్పోతున్న బ్యాంకులు

**ఆంధ్రప్రదేశ్‌లోని** 'ఏలూరు' జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో గుర్తింపు పొందిన జాతీయ బ్యాంకులో బంగారం తనఖా పెట్టి మోసపోయిన బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. ఈ నెలలో ఖాతాదారులకు చెందిన బంగారు ఆభరణాలు భారీగా మాయమైన విషయం వెలుగులోకి వచ్చింది. బంగారం మాయమైన ఘటనతో ఖాతాదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పేద ప్రజలు ఎంతో కష్ట నష్టాలను ఓర్చుకొని రూపాయి రూపాయి కూడ పెట్టుకుని బంగారం కొనుగోలు చేసి బ్యాంకులో అయితే భద్రంగా ఉంటాయి, వడ్డీ తక్కువ ఉంటుందని బ్యాంకులను ఆశ్రయిస్తే బ్యాంకులే ఈ విధంగా మోసం చేస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? ఈ సంఘటన వెలుగులోకి రావడంతో తాము తాకట్టు పెట్టిన బంగారం భద్రంగా ఉందాలేదా అనే భయాందోళనలతో జాతీయబ్యాంకులపై విశ్వాసం కోల్పోతున్నారు. బ్యాంకు సిబ్బంది సహకారంతోనే ఈ మోసం జరిగిందా?. వెంటనే ఈ విషయంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలి.

*- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు*

### వివాహాలు ఇలా చేయండి !

**ఈ రోజు** పిల్లలకు వివాహాలు చెయ్యాలంటే లక్షలు లక్షలు కట్నం, లక్షలు పెట్టీ కళ్యాణమండపాలు, బ్యాండు మేళాలు, ఒక్కోభోజనంమూడొందలూ, నాలుగొందల ఖర్చున, ముహూర్తాలు, నలుగురైదుగురు పంతుళ్లు, ఈరకంగా ఒక్కో వివాహానికి 30నుంచి 40లక్షల ఖర్చు. వీటికోసం ఆస్తులు అమ్ముకోవటం, ఒకళ్లని చూసి ఒకళ్ళు ఇలా ఆడంబరాల వివాహాలు చేస్తున్నారు. ఇలాంటి ఇబ్బందులే కుండా రిజిస్టర్ కార్యాలయానికి వెళ్ళిస్పెషల్ మ్యారేజ్ యాక్ట్ 1954 కింద అప్లికేషన్ తీసుకొని, వధూవరుల రెండురెండు ఫోటోలు, నేటివిటీ సర్టిఫికెట్లు ఇచ్చి, ఇద్దరు పెద్దమనుషుల సంతకాలతో పూర్తి చేసి ఇచ్చినట్లయితే 30రోజుల తరువాత సర్టిఫికెట్ ఇస్తారు.

*- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా*

### కలిసివుంటే కలదు సుఖం

**ఒకప్పుడు** ఎక్కడ చూసినా ఉమ్మడి కుటుంబాలు కళకళాడుతుండేవి. అన్ని వయస్సులవారిఆప్యాయతలు బాల్యం నుంచి అందుతూ ఎదుగుదల హాయిగా సాగేది. కాలక్రమేణా సమష్టి కుటుంబాలు చాలావరకు తగ్గిపోయాయి. వారాంతం పండుగలు పబ్బాలు జాతర్లలో కలుస్తూ కలిసి వుంటే కలదు సుఖం అంటూ ఉల్లాసంగా గడుపుతుండడం శుభసూచకం.

*-కె.రామారావు, నల్గొండ జిల్లా*

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

## నేడు మంగళగిరి ఏసిఏ స్టేడియం కు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్

మంగళగిరి, జూన్ 23, ప్రభాతవార్త : రాజధాని ప్రాంతం మంగళగిరిలో బుధవారం నుండి ఏపిఎల్ సీజన్ 5 ప్రారంభం కానుంది. తొలి ఏపిఎల్ మ్యాచ్ కు తిలకించేందుకు ముఖ్యఅతిథిగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హాజరుకానున్నారు. ఈనెల 24 నుండి 30 వరకు మంగళగిరిలో ఏపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్ సైతం వేదికగా మంగళగిరి క్రికెట్ స్టేడియం సర్వాంగ సుందరంగా సిద్ధం చేశారు. ఏసీఏ కార్యవర్గం, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ సహకారంతో మంగళగిరి స్టేడియం కు అంతర్జాతీయ హంగులతో పరుగుల వేడుకకు సిద్ధమైంది. స్టేడియంలో 75 గదులు ఆధునిక వసతులతో తీర్చిదిద్దారు. ఫైనల్ మ్యాచ్ ను తిలకించేందుకు ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరుకానుండటం తో అంచనాలు మరింత పెరిగాయి.



# ఆచార్య వీరు మారరా..?

### ఏఎన్‌యు బియిడి పరీక్షల్లో రిపీట్ విధానం!

### - మంగళవారం ప్రశ్నాపత్రంలో ఒకే ప్రశ్న రెండు సార్లు

గుంటూరు, జూన్ 23, ప్రభాతవార్త: వర్సిటీ పరిధిలో బియిడి రెండవ సెమిస్టర్ థియరీ పరీక్షలకు గ్రహణం కొనసాగుతున్నట్లు కనిపిస్తుంది. 90రోజుల తరగతులు జరుగకుండ పరీక్షలు నిర్వహించడం ఒక ఎత్తయితే... రెండో రోజు జరుగుతున్న పరీక్షలో ఒకే ప్రశ్న రెండు సార్లు ముద్రించడం పరిపాటిగా మారింది. మంగళవారం జరిగిన పేపర్-2 లెర్నింగ్ అండ్ టీచింగ్ పరీక్ష పార్ట్-బిలో 11వ ప్రశ్నలో




ఇచ్చిన ఏ,బిలలో బి పేరుతో వచ్చిన ప్రశ్నను 12వ నెంబరు ప్రశ్నలో ఏ పేరుతో రిపీట్ చేయడం జరిగింది. అంటే పరీక్ష పేపర్ ముద్రణలో కాపీ పేస్ట్ విధానం అమలు చేస్తున్నట్లు అర్థం చేసుకోవచ్చు. ఇందులో ఒక్కో ప్రశ్నకు 15 మార్కులు ఉంటాయి. వర్సిటీ చరిత్రలో బియిడి పరీక్షలు సజావుగా నిర్వహించిన రోజులు వ్రేళ్ళపై లెక్కించొచ్చని చెప్పవచ్చు. ఏదో ఒక రూపంలో బియిడి పరీక్షలు వర్సిటీని అబాసుపాలు చేస్తున్న సందర్భాలు లేకపోలేదు. అధికారులు తీసుకుంటున్న సంస్కరణలు పేపర్ మీదనేనా! పలు చర్యలు చేపడుతున్నా మళ్ళీ మళ్ళీ అవే తప్పిదాలు పునరావృతం కావడం బాధాకరం. బియిడి పరీక్షల తీరును అధికారులు మార్చలేరా.. అనేది ప్రశ్నార్థకం.

**ముద్రణా సంస్థను వివరణ కోరతాం: పీజీ కోఆర్డినేటర్**

యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరిగిన బియిడి రెండో సెమిస్టర్ రెండో పేపర్‌లో ఒకే ప్రశ్న రెండు సార్లు ముద్రించడం పట్ల పీజీ అండ్ ప్రొఫెషనల్ పరీక్షల ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మన్నవ సుబ్బారావు అసహనం వ్యక్తం చేశారు. వెంటనే పేపర్ సెట్టర్‌లను వివరణ కోరుతామని పేర్కొన్నారు. అలాగే ఈ విషయంపై సంబందిత అధికారులను సమాచారం అడుగగా వారు ప్రశ్నా పత్రంల కాపీ పేస్ట్ చేయడం వల్ల ఒక ప్రశ్న రిపీట్ అయిందని వివరణ ఇచ్చినట్లు ప్రభాతవార్తకు తెలిపారు. ఇటువంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరో చేసిన తప్పులకు వర్సిటీకి చెడ్డపేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఏఎన్‌యులో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్23, ప్రభాతవార్త: వర్సిటీలో ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేశారు. డిప్యూటీ రిజిస్ట్రార్ హోదా నుంచి అటెండర్ స్థాయి వరకు 51మంది ఉద్యోగులను వివిధ విభాగాలకు, సెక్షన్‌లకు బదిలీ చేశారు. వీసి ఆచార్య గంగాధరరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఉత్తర్వులు జారీచేశారు. కొందరిని పదోన్నతుల ఆధారంగా, మరికొందరిని సీనియారిటీ ప్రకారం బదిలీ చేసినట్లు తెలిసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం విభాగాధిపతులు, కోఆర్డినేటర్‌లు వారి విభాగాల్లో బదిలీలు జరిగిన ఉద్యోగులను తక్షణమే రిలీవ్ చేయాలని ఆదేశించారు. ఈ బదిలీలు వికాస ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జరిగాయని, ఉద్యోగులను బదిలీచేసి ఓట్లు అడిగే అవకాశాలు ఉన్నట్లు చర్చ మొదలైంది.

# స్వదేశంలోనే కన్నుమూయాలన్నదే నా ఆశ: 94 ఏళ్ల వృద్ధురాలి ఆవేదన

### భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న కొండ్రుగుంట మహాలక్ష్మమ్మ

### కలెక్టరేట్‌లో స్వయంగా విచారణ జరిపిన కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

బాపట్ల,జూన్23,ప్రభాతవార్త: "నేను పుట్టిన దేశం, పెరిగిన నా స్వగ్రామంలోనే కన్నుమూయాలని ఉంది. నా అంత్యక్రియలు ఇక్కడే జరగాలి. వృద్ధాప్యంలో ఉన్న నాకు నా మాతృభూమిలో జీవించే హక్కు కల్పించండి" అంటూ 94 ఏళ్ల వృద్ధురాలు కొండ్రుగుంట మహాలక్ష్మమ్మ జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఎదుట భావోద్వేగానికి లోనయ్యారు. అమెరికా పౌరసత్వాన్ని వదులుకుని, తిరిగి భారత పౌరసత్వం పొందడానికి ఆమె చేసుకున్న దరఖాస్తుపై మంగళవారం బాపట్ల కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో కలెక్టర్ స్వయంగా విచారణ చేపట్టారు.




వివరాల్లోకి వెళితే... బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం చింతగుంపల గ్రామానికి చెందిన కొండ్రుగుంట మహాలక్ష్మమ్మ తన భర్త నాగభూషణం మృతి చెందిన తర్వాత అమెరికాలో ఉంటున్న కుమారుడు కె. బుచ్చయ్య వద్దకు వెళ్లారు. అక్కడే నివసిస్తూ 2000 జూలై 27న అమెరికా పౌరసత్వం పొందారు.అయితే మాతృభూమిపై మమకారంతో 2018లోకుటుంబంతో కలిసి తిరిగి స్వగ్రామానికి చేరుకున్నారు. ప్రస్తుతం ఆమె కుమారుడు కొండ్రుగుంట కె. పిచ్చయ్య గుంటూరులోని ఎన్ఆర్ఐ వైద్య కళాశాల డైరెక్టర్ గా సేవలందిస్తున్నారు.అవసాన దశకు చేరుకున్న మహాలక్ష్మమ్మ అప్పటినుంచి చింతగుంపల గ్రామంలోనే నివసిస్తున్నారు.

**రాజ్యాంగానికి లోబడి ఉంటానని ప్రమాణం:**

తిరిగి భారత పౌరసత్వం పొందేందుకు ఆమె ఈ నెల 1వ తేదీన ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర సచివాలయానికి, జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. భారత చట్టాల ప్రకారం ఈ దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ మంగళవారం దీనిపై సమగ్ర విచారణ జరిపారు. ఈ సందర్భంగా తాను భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తానని, ఇక్కడి చట్టాలకు లోబడి ఉంటానని జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ సమక్షంలో మహాలక్ష్మమ్మ ఒప్పంద వాగ్దానం చేశారు.

**త్వరలోనే పౌరసత్వం: కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**

వృద్ధురాలి దరఖాస్తును పరిశీలించి, విచారణ పూర్తి చేసిన కలెక్టర్ స్పందిస్తూ.. ఈ నివేదికను వెంటనే రాష్ట్ర సచివాలయానికి పంపుతామని తెలిపారు. అక్కడి నుంచి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు వెళ్తుందని, కేంద్రం నుంచి త్వరలోనే ఆమెకు భారత పౌరసత్వం లభిస్తుందని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ హామీ ఇచ్చారు.

## చిన్నారులకు పలకల పంపిణీ



నిజాంపట్నం, జూన్ 23, ప్రభాతవార్తః నేటి బాలలే రేపటి పౌరులని తెదేపా నాయకుడు మోర్ల రాంప్రసాద్ అన్నారు. మండలంలోని అడవులదీవి పంచాయితీలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో శివప్రసాద్ సూచనలతో అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చిన్నారులకు పలకలు, చాపలు, బిస్కెట్‌లు, డ్రింక్‌లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోహనరావు, కరీముల్లా, నాగబాబు, సురేష్, ఖాసింబి, బాబి, బాజి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వార్త

## భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన ఎస్పీ

గుంటూరు క్రైమ్,జూన్23,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నివాస భద్రతకు సంబంధించి ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను మంగళవారం తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలోని ముఖ్యమంత్రి నివాసం వద్ద గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం నివాసం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు,ఏపీఎస్పీ గార్డుల విధుల నిర్వహణ,ఐఎస్‌డబ్ల్యూ సిబ్బందికి కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు.అలాగే కృష్ణా నది వైపు



ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు,నదిపై అమలు చేస్తున్న సెక్యూరిటీ ఏర్పాట్లను తనిఖీ చేసి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.సీఎం నివాసానికి వచ్చే సందర్శకుల తనిఖీ విధానాన్ని పరిశీలించి,బాంబ్ డిటెక్షన్ (బీడీ) టీమ్ పనితీరును సమీక్షించారు. అదేవిధంగా డ్రోన్ పార్టీ,రోడ్ ఓపెనింగ్ పార్టీ (ఆర్ఓపీ) సిబ్బంది విధుల నిర్వహణను కూడా పరిశీలించి భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు.అలాగే లోటస్ సెంటర్,అప్పారావు గెస్ట్ హౌస్,ఉండవల్లి కేవ్స్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది పనితీరును సమీక్షించారు.సీఎం నివాస పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరించే కొత్త వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే వారిని తనిఖీ చేసి,తాడేపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌డబ్ల్యూ అధికారులు,అదనపు ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఎ.టి. రవికుమార్,నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ,తుళ్లూరు డీస్పీ మురళి కృష్ణ,స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్,ఆర్మడ్ రిజర్వుడు డిఎస్పి సంకురయ్య ఐ.ఎస్.డబ్ల్యూ ఆర్.ఐ ప్రభాకర్,స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లికార్జునరావు,తాడేపల్లి సీఐ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేడు విభిన్న ప్రతిభావంతులకు మరియు గిరిజన ప్రజలకు సమస్యల పరిష్కారం పై ప్రత్యేక పిజిఆర్ఎస్

బాపట్ల,జూన్23,ప్రభాతవార్త,ప్రతినిధి: జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు మరియు గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హల్ నందు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల కు మరియు గిరిజనుల సమస్యలను పరిష్కరించుటకు ప్రతినెలా చివరి బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హల్ నందు ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిస్కార వేది ద్వారా అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు.ప్రత్యేక పి జి ఆర్ ఎస్ లో విభిన్న ప్రతిభావంతు లు గిరిజనులు తమ సమస్యల అర్జీలను జిల్లా కలెక్టర్ కు అందజేసి సమస్య లు పరిష్కరించుకోవచ్చునని, ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.



## వేణుగోపాల స్వామి వారికి గంధంతో అలంకరణ

గుంటూరు విద్య జూన్ 23 ప్రభాతవార్త : గుంటూరు కొత్తపేటలోని శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానం నందు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవములలో భాగంగా మంగళవారం ఉదయం శ్రీ వేణుగోపాల స్వామి వారికి గంధంతో అలంకారం ఉదయం 10.00 గం.లకు మన్యుసూక్త హోమం నిర్వహించడమైనది . ఈ కార్యక్రమములను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణధికారి టి. సుభద్ర పర్యవేక్షణలో దేవస్థానం చైర్మన్ మల్లెంపూడి శ్రీనివాసరావు మరియు ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్నవనీ అధికారులు వెల్లడించారు.



## పత్తిరైతు ప్రోత్సాహానికి ప్రత్యేక పథకం

గుంటూరు విద్య జూన్ 23 ప్రభాతవార్త: పత్తి రైతులు సకాలంలో కలుపు నివారణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించేందుకు గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ తన సెలెక్టివ్ హెర్బిసైడ్ హిట్‌వీడ్ మ్యాక్స్పై ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం ద్వారా ఉత్పత్తిని కొనుగోలు చేసిన రైతులు హామీతో కూడిన క్యాష్‌బ్యాక్ రివార్డులను పొందే అవకాశం కల్పించబడింది. శాస్త్రీయంగా సిఫార్సు చేయబడిన కలుపు నివారణ పద్ధతులను రైతులు అనుసరించేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా గోద్రెజ్ ఆగ్రోవెట్ క్రాప్ కేర్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎన్.కె. మాట్లాడుతూ, సరైన సమయంలో కలుపు నివారణ చర్యలు చేపట్టడం పత్తి ఉత్పాదకత పెంపునకు అత్యంత కీలకమని అన్నారు. రైతుల ఉత్పాదకత, లాభదాయకత పెంపునకు ఇటువంటి రైతుకేంద్రిత కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ బృందం పర్యటించాలి

గుంటూరు విద్య జూన్ 23 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న లాకప్ డెత్ లు ప్రభుత్వం పోలీస్ ల ప్రమేయం తో జరుగుతున్న రాజకీయ హత్యలు దాడులుదళితులు పైన జరుగుతున్న వరస హత్యాచారాలు మరణాలు ఆక్రమ కేసులు తో ఎన్డీఏ పాలన లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన పైన విచారణ కు జాతీయ మానవ హక్కుల కమిషన్ బృందం పరిశీలించడానికి రాష్ట్రంలో పర్యటించాలని దళిత బహుజన పార్టీ జాతీయ కమిటీ అధ్యక్షులు వడ్లమూరి. కృష్ణ స్వరూప్ విజ్ఞప్తి




చేసారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజాల నాగబాబు, పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ ఎస్. ఆంజనేయులు తో కలిసి ప్రెస్ నోట్ విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ రాజ్యాంగ బద్ధ మైన పాలన జరగటం లేదని, పౌరులు జీవించే మానవ హక్కులు కోల్పోతున్నారని, హోమ్ శాఖ చాలా నిర్లక్ష్యం గా ఉన్నదని, రాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎం, హోమ్ మంత్రి లు పట్టించికోవటం లేదని విమర్శించారు. చట్ట బద్ధ పాలన అందించటం లేదని...మంత్రులు ఎంపీ మ్మెల్యే అధికార పార్టీ నేతలు పోలీస్ యంత్రాంగం కుమ్మక్కు ఐయి నేరపూరిత రాజకీయాలకు పాలపడుతున్నారని విమర్శించారు. ఇందులో భాగమే విజయవాడ కృష్ణ లంక యువకుడు సాయి కృష్ణ మరణం , కర్నూల్ జిల్లా లోని దళిత మహిళ మంగమ్మ లాకప్ డెత్ మరణం అని ఆందోళన వ్యక్తం చేసారు.ర్నాష్ట్రలో శాంతి భద్రత లు పూర్తిగా అదుపు తప్పయన్నారు. ఇలాంటి తరుణం లో జాతీయ మానవహక్కుల కమిషన్ స్పందించాలని పౌరుల రాజ్యాంగ బద్ధమైన జీవించే ప్రాదిమిక హక్కులను కాపాడాలని మీడియా ముఖంగా ఎన్ హెచ్ ఆర్ సి చైర్మన్ ని కోరారు.

## చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్

గుంటూరు క్రైమ్,జూన్23,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన వాహన చోరీ కేసుల దర్యాప్తులో నల్లపాడు సీఐ భాస్కర్ ఆధ్వర్యంలోని ఎస్ఐ మధు పవన్ పోలీస్ బృందం ముమ్మర గాలింపులు చేపట్టి దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగతనానికి గురైన 09 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ కేసు దర్యాప్తులో భాగంగా,ఈ నెల 22తేదీన హౌసింగ్ బోర్డు ఆర్చి సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు.విచారణలో పెరికల సాగర్ (26), తాళ్ళచెరువు గ్రామం, అచ్చంపేట మండలం, పల్నాడు జిల్లా, ప్రస్తుతం గుంటూరులోని కెవిపి కాలనీలో నివాసముంటున్నట్లు తెలిపాడు.విచారణలో



నిందితుడు గుంటూరు నగరం,నల్లపాడు,కొత్తపేట,సత్తెనపల్లి తదితర ప్రాంతాల్లో వివిధ సందర్భాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించాడు.చోరీ చేసిన వాహనాలను అమ్మేందుకు ఉద్దేశించి లాల్పురం గ్రామ శివారులోని పాడుబడిన రేకుల షెడ్లో దాచిపెట్టినట్లు వెల్లడించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు లాల్పురం గ్రామ శివారులో తనిఖీలు నిర్వహించి మొత్తం 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.వీటిలో నల్లపాడు,కొత్తపేట,సత్తెనపల్లి టౌన్,లాలాపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన వాహన చోరీ కేసులకు సంబంధించిన వాహనాలు ఉన్నట్లు గుర్తించారు. నిందితుడిపై గతంలో కూడా గుంటూరు,కొత్తపేట పోలీస్ స్టేషన్లలో పలు వాహన చోరీ కేసులు నమోదై ఉన్నట్లు విచారణలో వెల్లడైంది.ప్రస్తుతం ఆయా కేసులు కోర్టులో విచారణలో ఉన్నట్లు తెలిసింది. పోలీసులు నిందితుడిని చట్టపరమైన నిబంధనల ప్రకారం అరెస్ట్ చేసి,తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.చోరీకి గురైన వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో పాల్గొన్న నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ పి. భాస్కర్,ఎస్ఐ ఎ. మధు పవన్,హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ) 3463 వి. సాయిబాబు,పోలీస్ కానిస్టేబుళ్ళు (పీసీ) 3679 కె. బక్షి నాయక్,ఎస్‌కే. మస్తాన్ వలి,టి.సాంబశివరావు మొదలగు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత : ఐజీ బీ రాజకుమారి

బాపట్ల,జూన్23,ప్రభాతవార్త,ప్రతినిధి: రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, ఆడబిడ్డలపై కన్నెత్తి చూస్తే కఠిన శిక్షలు తప్పవని రాష్ట్ర మహిళా, శిశు భద్రతా విభాగం ఐజీ బీ.రాజకుమారి స్పష్టం చేశారు. మంగళవారం బాపట్ల జిల్లాకు విచ్చేసిన ఆమెకు జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పూలమొక్క అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ఐజీ రాజకుమారి మాట్లాడారు. గౌరవ డీజీపీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 28 జిల్లాల్లో మహిళల రక్షణ కోసం విప్లవాత్మక మార్పులు తెచ్చామన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 1.5 కోట్ల మంది రిజిస్ట్రేషన్లతో 'శక్తి యాప్




విజయవంతంగా నడుస్తోందన్నరు. 164 శక్తి బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని, ఆపదలో ఉన్న మహిళలు యాప్ ద్వారా సమాచారం ఇస్తే కేవలం 8 నిమిషాల్లోనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ కల్పిస్తున్నారన్నారు.ఆపరేషన్ ట్రేస్ ద్వారా రాష్ట్రంలో తప్పిపోయిన 9,007 మంది (6,098 మంది మహిళలు, 2,909 మంది బాలికలు) సురక్షి తంగా కాపాడి వారి కుటుంబాలకు చేర్చామన్నారు. అలాగే ఆపరేషన్ చిన్నారితల్లి కింద పోక్సో బాధితులైన 2,171 మందికి కౌన్సిలింగ్ ఇచ్చి ధైర్యం నింపామన్నారు.



**నేరగాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న దండాయన:**


మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ఆపరేషన్ దండాయన అద్భుతంగా పనిచేస్తోందన్నారు. నేరం జరిగిన 60 రోజుల్లోనే చార్జ్‌షీట్ దాఖలు చేస్తున్నామని, జియో ట్యాగింగ్, ఫేషియల్ రికగ్నైజేషన్ వంటి సాంకేతికతతో నిందితులపై నిఘా పెట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 5,119 మందిపై సెక్సువల్ అఫెండర్ షీట్లు తెరిచామన్నారు.ఈ ఆపరేషన్ ప్రారంభమయ్యాక రికార్డు స్థాయిలో 595 కేసుల్లో శిక్షలు ఖరారయ్యాయని అందులో 155 జీవిత ఖైదులు, నలుగురికి మరణశిక్షలు, ఆరుగురికి చివరి శ్వాస వరకు జైలు శిక్షలు పడ్డాయని వెల్లడించారు.

**బాపట్ల పోలీసులకు ఐజీ ప్రశంసలు**

2024లో బాపట్ల జిల్లా ఈపురుపాలెంలో జరిగిన సంచలన అత్యాచారం, హత్య కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేసి ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు, వారికి ఆశ్రయం ఇచ్చిన వ్యక్తికి 5 ఏళ్ల జైలు శిక్ష పడేలా చేయడాన్ని ఐజీ ప్రత్యేకంగా అభినందించారు. బాధితురాలి కుటుంబానికి ..10 లక్షల ఆర్థిక సాయం అందించామన్నారు. ఎస్పీ ఉమామహేశ్వర్ స్వయంగా కోర్టు ట్రయల్స్‌ను పర్యవేక్షించడం వల్లే బాపట్ల జిల్లా మహిళా భద్రతలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. ఒక్కసారి కేసుల్లో ముద్దాయిలుగా మారితే భవిష్యత్తు శూన్యమవుతుందని ఆమె హెచ్చరించారు.జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళల భద్రతకు పక్కా వ్యూహంతో...ముందుకు వెళ్తున్నామన్నారు.గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, కార్యాలయాల్లో శక్తి బృందాల ద్వారా ఇప్పటివరకు 4,539 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. జిల్లాలో మహిళలపై నేరాలకు పాల్పడిన 311 మందిపై సెక్సువల్ అఫెండర్ షీట్లు తెరిచి నిరంతరం నిఘా ఉంచామని, జూన్ నెలలోనే కొత్తగా 37 షీట్లు ఓపెన్ చేశామన్నారు.జిల్లాలో 1.05 లక్షల శక్తి యాప్‌లను డౌన్లోడ్ చేయించామన్నారు. ఆపరేషన్ దండాయన ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 39 కేసుల్లో శిక్షలు ఖరారయ్యాయన్నారు.వీటిలో 7 జీవిత ఖైదులు, ఐదు కేసుల్లో 20 ఏళ్లకు పైగా జైలు శిక్షలు, 27 మందికి 10 ఏళ్ల వరకు జైలు శిక్షలు పడ్డాయన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తున్నామని, నేరాల అదుపునకు దండాయనకార్యక్రమమే సరైన పరిష్కారమన్నారు.

## ఇంటర్మీడియట్ విద్యా శాఖలో నాన్ టీచింగ్ స్టాఫ్ కు పదోన్నతులపై అసోసియేషన్ నాయకుల హర్షం

గుంటూరు విద్య జూన్ 23 ప్రభాతవార్త : ఇంటర్మీడియట్ విద్యాశాఖ గుంటూరు రీజనల్ జాయింట్ డైరెక్టర్ పద్మ మంగళవారం నాన్‌టీచింగ్ సిబ్బందికి సంబంధించిన ప్రమోషన్ల ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ అసిస్టెంట్ నుండి సీనియర్ అసిస్టెంట్‌గా, రికార్డ్ అసిస్టెంట్ నుండి జూనియర్ అసిస్టెంట్‌గా, అలాగే టైపిస్టు కేటగిరీలలో అర్హులైన ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించడం జరిగింది.ఈ ప్రమోషన్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ భాష ఆర్జేడీలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో ప్రమోషన్ల ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా నాన్‌టీచింగ్ సిబ్బంది తరపున కమిషనర్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. అనంతరం ఇంటర్మీడియట్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర అధ్యక్షులు అవ్వారు శ్రీనివాసులు గౌరవ ఆర్జేడీ పద్మ ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 25వ తేదీలోపు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని పద్మ మేడం హామీ ఇచ్చారు. ఈ ప్రకటన పట్ల ఇంటర్మీడియట్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ గౌరవ ఆర్జేడీ ని కలిసి అభినందనలు తెలిపారు.



# పల్నాడు జిల్లా వార్త



## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వినుకొండ రూరల్ జూన్ 23: (ప్రభాతవార్త) పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. .మంగళవారం పట్టణంలోని నడిబొడ్డిలో గల రుచి టీ స్టాల్ ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నట్టు పోలీసులు తెలిపారు. గత కొంతకాలంగా గుట్టుతప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరం గురించి కొందరు పోలీసులకు సమాచారం అందించడంతో ఈ దాడి జరిగినట్లు ప్రచారం జరుగుతుంది . దాడిలో రూ.28,900 లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు .పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ప్రభాకర్ తీవ్రస్థాయిలో అసాంఘిక శక్తులను తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

## దేవాలయాల అభివృద్ధి కోసం మంత్రిని కలిసిన ప్రభుత్వ చీఫ్ జీవి



వినుకొండ రూరల్ ప్రభాత వార్త జూన్ 23: వినుకొండ ప్రాంత ప్రముఖ దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జి.వి ఆంజనేయులు దేవాదాయ , ధర్మ దాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఏపీ సెక్రటరీలో కలిశారు. మంగళవారం అమరావతి లోని సచివాలయ దేవాదాయ శాఖ మంత్రి ఛాంబర్ లో మంత్రి రామ నారాయణరెడ్డిని జీవి ఆంజనేయులు కలిసి, వినుకొండ ప్రాంత దేవాలయాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ చారిత్రాత్మక చరిత్ర కలిగిన వినుకొండ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం సిజిఎఫ్ మార్జిన్ మనీని 33 శాతం నుండి 10 శాతం తగ్గించాలని కోరారు. రామలింగేశ్వర స్వామి దేవాలయం ఎంతో చరిత్ర కలిగిన దేవాలయం అని ధాని అభివృద్ధి కోసం ప్రభుత్వం కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు .వినుకొండ ప్రాంతంలో ప్రముఖ దేవాలయాలలో రామలింగేశ్వర స్వామి దేవాలయం ఒకటని ఆంజనేయులు మంత్రి కి వివరించారు . అదేవిధంగా వినుకొండ నియోజకవర్గంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు చేపట్టిన శ్రీ వాణి ట్రస్ట్ నిధులతో నిర్మించ తలపెట్టిన నూతన దేవాలయాలను కూడా ఈ ప్రాంతంలో నిర్మించాలని కోరారు. ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ ప్రాంత దేవాలయాల అభివృద్ధి కోసం మంత్రిని కలిసి పలు విషయాలను మంత్రికి తెలియజేయడంతో దేవాలయాల అభివృద్ధి కోసం కావాల్సిన నిధులను మంజూరు చేసే విధంగా చర్యలు చేపడతారని మంత్రి జీవికి హామీ ఇచ్చారు .

## నేడు ధ్వజస్తంభ ప్రతిష్టాపన



సత్తెనపల్లి, జూన్ 23, ప్రభాతవార్త: బుధవారం ఉదయం జరిగే అచ్చంపేట రోడ్డులోని శివాలయంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం ముందు నూతన ద్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవమునకు ప్రభుత్వం తరుపున మరియు ఉత్సవ కమిటీ తరుపున సత్తెనపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మరియు మాజీ మంత్రి వర్యులు కన్నా లక్ష్మీనారాయణ కు ఆత్మీయ ఆహ్వానం అందించారు. అనంతరం చిరు సత్కారమును మంగళవారం ఉదయం గుంటూరు కార్యాలయం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇ. ఓ కోటిరెడ్డి మరియు దేవతి సుబ్బారావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు మరియు శిరిగిరి మణికంఠ తదితరులుపాల్గొన్నారు.

## గాయాలతో కనిపించిన యువకుడిపై పోలీసుల విచారణ

సత్తెనపల్లి, జూన్ 23, ప్రభాతవార్త: ముప్పాళ్ల మండలంలో కాలువ సమీపంలో గాయాలతో కనిపించిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు యువకుడిని ప్రశ్నించగా పొంతనలేని వివరాలు చెప్పినట్లు తెలిసింది. గాయాల కారణంగా అతడిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజుపాలెం మండలం బలిజేపల్లికి చెందిన రవికుమార్ గా గుర్తించిన పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

## ఆర్టీసీ విద్యుత్ బస్సులు కొనుగోలు చేసి నడపాలి

సత్తెనపల్లి, జూన్ 23, ప్రభాతవార్త:ఆర్టీసీలో ప్రవేశపెడుతున్న విద్యుత్ బస్సుల ప్రైవేట్ నిర్వహణ ను నిలువరించి యాజమాన్యమే వాటిని కొనుగోలు చేసి నడపాలని లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ ప్రైవేటీకరణను నిరశిస్తూ సంస్థ ఉద్యోగ సంఘాల నాయకులు (జెఏసీ) ఆధ్వర్యంలో డిపో ఆవరణలో రెండ్రోజుల పాటు జరుగుతున్న నిరసన కార్యక్రమం తొలి రోజు మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. రాయితీలను రాష్ట్ర ప్రభుత్వమే వినియోగించుకొని సొంతగా విద్యుత్ బస్సులను కొనుగోలు చేసి సంస్థ సిబ్బంది చేత నడపాలని ఆయన సూచించారు. అనంతరం ఆర్టీసీలో ప్రవేశపెడుతున్న విద్యుత్ బస్సుల ప్రైవేట్ నిర్వహణ ను నిలువరించాలని నినాదాలు చేసి ఉద్యోగ సంఘ నాయకులు చేస్తున్న నిరసనకు పార్టీ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు ఎంబికే సాహెబ్, యలమంద, శ్రీరాములు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లి రైల్వే స్టేషన్ కు వెళ్లే రోడ్డు గుంతల మయం

సత్తెనపల్లి, జూన్ 23, ప్రభాతవార్త: సత్తెనపల్లి రైల్వే స్టేషన్ కు వెళ్లే రోడ్డు అక్కడక్కడ గుంతల మయం మరియు ప్రధానముగా రాత్రి వేళ వీధి దీపాలు చాలా తక్కువగా క్రాంతి ఉన్నవి అవ్వటం అటువైపు వెళ్లే బాటసారులు మరియు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని



సందర్భాల్లో ప్రమాదాలు కూడ జరుగుతున్నాయి. నేను సోమవారం రాత్రి అటువైపు వెళ్ళటం ఆ సమయంలో దాదాపు స్టేషన్ రోడ్డులో 75శాతం మేరకు వీధి దీపాలు చాలా తక్కువగా ఉన్న క్రాంతి అవ్వటం వలన ఆ వెలుగులో కేవలం ఆ స్తంభం కూడ కనపడలేని క్రాంతి అయ్యింది. దాదాపు ఆ ప్రాంతంలో వెళ్లే వారు రైలు మిస్ అవుతుందో అనే ఆందోళనతో కొంతమంది స్పీడ్ గా వెళ్లటం సహజం ఎక్కువ క్రాంతి ఉన్న దీపాలు లేకపోవటంతో వారికి వెళ్లే రోడ్డు సక్రమంగా కనపడని పరిస్థితి మరియు రోడ్డుమీద ఉన్న గుంతలు సైతం కనపడని పరిస్థితి, అంతేకాకుండా వీటిలేని ఉండటం దొంగతనాలు జరిగే అవకాశం చాలా ఎక్కువ. దీనివల్ల ఆ ప్రాంతంలో మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసే అవకాశం లేదు. పగటివేళల్లో కూడ రోడ్డు గుంతలుగా ఉండటం వలన ట్రైన్ మిస్ అవుతామేమో అనే ఆందోళనతో కొందరు స్పీడ్ గా వెళ్లటం రోడ్డు చాలా ప్రాంతాల్లో గుంతలు ఉండటం ప్రమాదాలకు నిలయంగా మారింది. కాబట్టి సంబంధిత అధికారులు వెను, వెంటనే స్పందించి ఆ ప్రాంతంలో రోడ్డు మరమ్మత్తులు జరిపించి, ఎక్కువ క్రాంతి వంతమైన వీధి దీపాలు వెయ్యాలి అని దివ్వెల శ్రీనివాసరావు, న్యాయవాది ఈ ప్రెస్ నోట్ ద్వారా మంగళవారం సాయంత్రం కోరారు.

## శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవస్థానం 17వ వార్షికోత్సవము



చిలకలూరిపేట, జూన్ 23, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణం, చిన్న పసుమర్రు జాతీయ రహదారి ఓగేరుకు దక్షిణాన ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవస్థానం 17వ వార్షికోత్సవము సందర్భంగా ఆలయ కమిటీ వారు గత శుక్రవారం రోజున ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజల్లో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించిన శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లా రావు, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమును ఆయన ప్రారంభించారు. ముందుగా ప్రత్తిపాటిని ఆలయ కమిటీ ఛైర్మన్ వెల్లంపల్లి రవిశంకర్ గారు ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. తదుపరి పండుమ వేద వి స్కూల్ ఆఫ్ డాన్స్ విజయవాడ నట్టు వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన సంస్కృతిక ప్రదర్శనలు తిలకించి చిన్నారులను అభినందించారు.

## కోతముక్క ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు

చిలకలూరిపేట, జూన్ 23, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామ పొలాల్లో డబ్బులు పందెం గా పెట్టి కోత ముక్క ఆట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను చిలకలూరిపేట రూరల్ ఎస్సై జి. అనిల్ కుమార్ వారి స్టేషన్ సిబ్బంది సహాయంతో వారికి రాబడిన సమాచారం మేరకు వారిని పట్టుకొని వారి వద్ద నుండి 8300/ నగదు, 52 పేక ముక్కలను స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేయడమైనది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చిలకలూరిపేట మండల పరిధిలో ఎవరైనా పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడమైనది.

EOI నోటీసు నెం.02/2026-27 సత్తెనపల్లి పురపాలకసంఘ కార్యాలయము, తేది.23.06.2026.

**ఆసక్తి వ్యక్తీకరణ నోటీసు (EOI)**

15వ ఆర్థిక సంఘం మార్గదర్శకాల ప్రకారము సత్తెనపల్లి పురపాలకసంఘమునకు 15 ఆర్థిక సంఘం 2024-25 2వ విడత మరియు 2025-26 మొదటి విడత టైడ్ గ్రాంట్స్ నిధి సరఫరా కేటగిరీ క్రింద మంజూరు కాబడిన ముఖ్యానికి అంచనాలు, డ్రాయింగ్ మరియు డిజైన్లతో కూడిన (DPR) ప్రతిపాదనలు తయారుచేసి ఇచ్చుటకు ఆసక్తి వ్యక్తీకరణ (EOI) తెలుపవలసినదిగా నిష్ణాతులైన కన్సల్టెన్సీ ఏజెన్సీ వారిని కోరడమైనది. సదరు ప్రతిపాదనలు 29.06.2026 తారీఖున సాయంత్రము గం.4.00 లోపు పురపాలకసంఘ కార్యాలయము నందు సీల్డ్ కవరులు ద్వారా అందజేయవలెను. ఇంకనూ ఏవైనా సాంకేతిక అంశముల కొరకు పురపాలకసంఘ కార్యాలయములోని ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- కమీషనరు, సత్తెనపల్లి పురపాలకసంఘము

## మెగా డీఎస్సీపై రౌండ్ టేబుల్ సమావేశం

నరసరావుపేట టౌన్, జూన్ 23 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామకాలు పూర్తిస్థాయి పారదర్శకతతో జరిగాయని, వాటిపై వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న విమర్శలకు వాస్తవాలతో తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం భారీ స్థాయిలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి మాట నిలబెట్టుకుందని అన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని నవయుగ ఫంక్షన్ హాల్లో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి హనుమంతరావు



ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా డీఎస్సీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఏ.ఎస్. రామకృష్ణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు రాయలసీనివాసరావు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. నియామక ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించామని స్పష్టం చేశారు. డీఎస్సీపై కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న విమర్శలు, తప్పుడు ప్రచారాలు యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఈ నియామకాలు కొత్త భవిష్యత్తుకు నాంది పలికారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఏ.ఎస్. రామకృష్ణ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం అభినందనీయమన్నారు. డీఎస్సీపై అనవసర వివాదాలు సృష్టించడం వల్ల యువతలో అయోమయం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మెగా డీఎస్సీతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత గణనీయంగా తగ్గుతుందని, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. పాల్గొన్న డీఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామకాలు తమలో కొత్త ఆశలు నింపాయని పేర్కొన్నారు. అర్హత, ప్రతిభకు ప్రాధాన్యతనిస్తూ నియామకాలు జరగడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, డీఎస్సీ అభ్యర్థులు, టీడీపీ నాయకులు షేక్ మాబు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణలో తెలుగు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది...

నరసరావుపేట, జూన్ 23 ప్రభాతవార్త : తెలంగాణలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, అది ఖితెలుగు కాంగ్రెస్ఖి ప్రభుత్వమని మాజీ రాష్ట్ర మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో విమర్శించారు. వన్ బై టు టీ షేర్ చేసుకున్నట్టుగా, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పవర్ షేరింగ్ చేసుకుంటున్నాయని ధ్వజమెత్తారు. వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడును మంగళవారం బొల్లా బ్రహ్మనాయుడు ను మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలతో కలిసి పరామర్శించారు. ఈ




సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్ని నాని మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడును తెలంగాణ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం జరిగిందన్నారు. అక్కడి రెవెన్యూ అధికారి చేసిన ఫిర్యాదులోను, పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లోను బ్రహ్మనాయుడు పేరు లేకపోయినప్పటికీ, నరసరావుపేట ఎంపీ మాత్రం బ్రహ్మనాయుడు అరెస్టు కాబోతున్నాడని ముందే చెప్పారన్నారు. కాలజ్ఞానం చెప్పడానికి అతను ఏమైనా బ్రహ్మ జ్ఞానా, చిలక జ్యోతిష్యుడా అని ఎంపీని ఎద్దేవ చేశారు. దీన్ని బట్టి వీళ్ల తప్పుడు కేసులను ఆ రాష్ట్రంలో అయినా ఈ రాష్ట్రంలోనైనా పెట్టగల సమర్థులు తెలుస్తుందన్నారు. బాధితుడిపై జాలిపడాలి గాని, బాదితున్నే నేరస్తుడిగా చూపెట్టి అక్రమకేసులు బనాయించడం చాలా దారుణం అన్నారు. నిజం నిలకడ మీద తెలుస్తుందని, ఇవాళ కాకపోతే రేపైనా బ్రహ్మనాయుడు నిర్దోషిత్వం బయటపడుతుందని పేర్కొన్నారు. బ్రహ్మనాయుడు చాలా నిజాయితీ కలిగిన వ్యక్తి అని, అతను కచ్చితంగా పోరాడి, కడిగిన ముత్యంలా కేసు నుంచి బయట పడతారని స్పష్టం చేశారు. బ్రహ్మ నాయుడు పై కేసు అక్రమ కేసు నమోదు చేయడం ద్వారా వినుకొండలో రానున్న ఎన్నికల్లో అతన్ని పోటీ చేయకుండా ఆపగలరా!, నియోజకవర్గంలో వైసిపి జెండా మోయకుండా పార్టీ శ్రేణులను ఆపే ధైర్యం ఉందా! అని ప్రశ్నించారు. వినుకొండ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వము వల్ల బాధింపబడుతున్న వైసిపి కార్యకర్తలను బ్రహ్మనాయుడు అండగా ఉంటారన్నారు. రానున్న ఎన్నికల్లో బ్రహ్మనాయుడు కచ్చితంగా వైసీపీ తరఫున పోటీ తీసి గెలుపొంది తిరిగి అసెంబ్లీలో అడుగు పెడతారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్ ఓ ప్లాంట్స్ స్కూల్ బెంచీలు అందించిన రోటరీ

రొంపిచర్ల, జూన్ 23 ప్రభాతవార్త : రోటరీ క్లబ్ ఆఫ్ నరసరావుపేట, జూబ్లిహిల్స్ మరియు సికింద్రాబాద్ సన్ రైసర్స్ సంయుక్తంగా బిజిఆర్ మైనింగ్ ఇన్ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సహకారంతో రెండు మోడల్ స్కూల్స్ లో ఆర్.ఓ. ప్లాంట్స్, స్కూల్ బెంచీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి. రామప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ పి. రాఘవయ్య, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ అధ్యక్షులు పి. కళ్యాణ చక్రవర్తి, బిజిఆర్ మైనింగ్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ వి. బాల కోటిరెడ్డి హాజరై, నియోజకవర్గంలోని విప్పర్ల రెడ్డిపాలెం, దేచవరం గ్రామాల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థుల సంక్షేమం కోసం సురక్షిత తాగునీటి కోసం రెండు ఆర్ఓ ప్లాంట్స్, అలాగే విప్పర్ల రెడ్డిపాలెంలో 60 బెంచీలు, దేచవరంలో 40 బెంచీలను విరాళంగా అందజేశారు. స్వచ్ఛమైన తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్, విద్యార్థుల కోసం అందజేసిన 100 బెంచీలు వారి విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడతాయని డాక్టర్ ఎస్.వి. రామప్రసాద్, పి. రాఘవయ్య అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ నరసరావుపేట అధ్యక్షులు షేక్ కరీం మొహిద్దీన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభివృద్ధికి రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపి మోడల్ స్కూల్ విపర్ల రెడ్డిపాలెం ప్రిన్సిపాల్ రవినాయక్, ఏపి మోడల్ స్కూల్ దేచవరం ప్రిన్సిపాల్ వేలాంగిణి మేరీ, ఎంఈఓ డి. బ్రహ్మేశ్వర రావు, డి రేవతి, జీసీడీఓ పల్నాడు జిల్లా తాళ్ళ రాజశేఖర్ రెడ్డి, సింగరావు, వెంకటేశ్వర రావు, యు. ప్రసాద్, అచ్యుతరావు, షేక్. జిలాని మాలిక్, సుమిత్ర, లింగ ఆంజనేయులు, మామిడి సుబ్బారావు, రాధాకృష్ణ, పాశం క్రిష్ణారావు, కే. రాజేంద్రప్రసాద్, వి. సైదయ్య, పున్నారావు, కోటేశ్వర రావు, బంగారు బాబు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల బాలబాలికలకు పరికరాల పంపిణీ

నరసరావుపేట, జూన్ 23 ప్రభాతవార్త : ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు నాణ్యమైన విద్య, వైద్యం, సంరక్షణ అందించడం ద్వారా సహిత విద్యను ప్రోత్సహిస్తూ వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి పల్నాడు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అన్నారు. స్థానిక ఎస్ ఎస్ ఎన్ కళాశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన 407 మంది బాలబాలికలకు రూ. 34.29 లక్షల రూపాయల విలువ చేసే 490 పరికరాలను జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యుడైస్ గణాంకాల ప్రకారం పల్నాడు జిల్లాలో ప్రాథమిక, మాధ్యమిక విద్య నభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు 3,363 మంది ఉన్నారన్నారు. వీరిలో 540 మంది భవిత కేంద్రాలకు హాజరవుతుండగా, మిగిలిన 2,820 మంది పిల్లలు తల్లిదండ్రుల వద్దే ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. పల్నాడు జిల్లాలో ప్రతి నెల నాలుగవ శనివారం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక్ష నిర్వహిస్తూ, వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని వివరించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ప్రత్యేకంగా ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా



ఉందన్నారు. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికల అవసరాలను గుర్తించి, వారికి తగిన విద్యా విధానంతో పాటు ఉచితంగా విద్యా పరికరాలు, శారీరక అవసరమైన పరికరాలను ప్రభుత్వం అందజేయడం వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె. రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్యామ్, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, కోఆర్డినేటర్ సెల్వరాజ్, భవిత కేంద్రాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఓటర్ల సవరణ కార్యక్రమంలో బీఎల్ఓలు తప్పనిసరిగా ప్రతి ఇంటికి వెళ్లాలి

యడ్లపాడు, జూన్ 23, ప్రభాతవార్త : ఓటర్ల సవరణ కార్యక్రమం(సర్) నిర్వహణలో భాగంగా బీఎల్వోలు తప్పనిసరిగా ఓటర్ల ఇంటికి వెళ్లాలని, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రదేశాలను ఇందుకు వేదికగా చేసుకుంటే చర్యలు తప్పవని పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్, చిలకలూరిపేట నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి బి లీలారాణి అన్నారు. యడ్లపాడులోని గ్రామ సచివాలయంలో మంగళవారం సర్ కార్యక్రమం అమలుపై మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్పెషల్ కలెక్టర్ బీఎల్వోలకు దిశానిర్దేశం చేశారు. సర్ ప్రక్రియ జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి తిరిగి ఎన్యూమరేషన్ అందజేయటంతో పాటు ఓటర్లకు ఏదైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేయాలన్నారు. ఫారంలు పూర్తి చేసిన వెంటనే ఓటర్ల యాప్లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రక్రియను పూర్తి పాదర్శకంగా గడువు లోపు పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు



**బీఎల్వోలకు ఓటర్లు సహకరించాలి** : ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్పెషల్ కలెక్టర్ మాట్లాడుడుతూ చిలకలూరిపేట నియోజకవర్గంలో 60 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేశామన్నారు. యడ్లపాడు మండలంలో 44,592 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మండల పరిధిలో 30,120 ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ పత్రాలను ఓటర్ల యాప్లో ఇప్పటివరకు 24 శాతం అప్లోడ్ చేసినట్లు చెప్పారు బీఎల్వోలు ఇళ్లకు వెళ్లినప్పుడు ఓటర్లు ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోవటం, ఓటర్లు ఫోటోలు వెంటనే ఇవ్వకపోటం తదితర కారణాలతో జాప్యం జరుగుతోందన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఇళ్లకు వచ్చిన బీఎల్వోలకు ఓటర్లు సహకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను ప్రధాన రాజకీయ పార్టీలకు సంబంధించిన బీఎల్వోలు అధికారులు దృష్టికి తీసుకువస్తే వాటిని పరిగణనలోని తీసుకుని పరిష్కరిస్తామన్నారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రదేశాల్లో నివశించే ఓటర్లకు వారు కోరుకున్న ఒక్కచోట మాత్రమే ఓటుహక్కు ఉంటుందన్నారు కార్యక్రమాన్ని పూర్తి పాఠదర్శంగా నిర్వహిస్తున్నామని ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపుల విషయంలో ఎలాంటి ఆపోహలకు తావు లేదని స్పష్టం చేశారు కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ, ఆర సుబ్బారావు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్ధాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యడ్లపాడు, జూన్ 23, ప్రభాతవార్త : యువత మత్తు పదార్ధాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు పిలుపునిచ్చారు.



కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో వివిధ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో వేర్వేరు కేసుల్లో ఎన్డీపీఎస్ చట్టం కింద పట్టుబడిన గంజాయి, ఇతర నార్కోటిక్ సంబంధిత పదార్థాలను యడ్లపాడు మండలం కొండవీడు పరిధిలోని జిందాల్ అర్బన్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటులో మంగళవారం దగ్ధం చేశారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 363.54 కేజీల గంజాయి, 20 గ్రాముల ఎండీఎంఏ, 68.60 కేజీల ఇతర ఎన్డీపీఎస్ సంబంధిత పదార్థాలు, కృష్ణా జిల్లాకు సంబంధించి 910.90 కేజీల గంజాయి శాస్త్రీయ పద్ధతిలో దగ్ధం చేశారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ టి శ్రీనివాసరావు, విజయవాడ అసిస్టెంట్ కమీషనర్ సీహెచ్ లావణ్య, గుంటూరు అసిస్టెంట్ కమీషనర్ రవికుమార్, కాలుష్య నియంత్రణ మండల ప్రాంతీయ అధికారి నజీనా బేగం, కృషా, ఎన్టీఆర్ జిల్లాల సీఐలు, జిందాల్ ప్లాంట్ ప్రాజెక్టు ప్రెసిడెంట్ ఎంవీ చారి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీ కేంద్రంలో ఇండక్షన్ స్టవ్లు అందజేత



యడ్లపాడు, జూన్ 23, నప్రభాతవార్త : మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యడ్లపాడు సెక్టార్ పరిధిలోని 20 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్లు మంగళవారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా యడ్లపాడు2 అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు గ్రామపెద్దలు పోపూరి రాఘవయ్య, రత్తయ్య ముఖ్య అతిధులుగా హాజరై అంగన్వాడీ కేంద్రాల హెల్పర్లకు ఇండక్షన్ స్టవ్లు అందజేశారు. ముందుగా ఐసీడీఎస్ సూపర్వైజర్ వెంకటరమణ ఇండక్షన్ స్టవ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. వాటిని సురక్షి తంగా వినియోగించే విధానాలను తెలియజేశారు ఇండక్షన్ స్టవ్ల వినియోగంతో వంట ప్రక్రియ వేగవంతం కావటంతో పాటు ఇంధన వ్యయం గణనీయంగా తగ్గుతుందని, చిన్నారులకు అందించే ఆహార పదార్ధాల తయారీ సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎం కోకిల మారుతి, ఆయాలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## నీటి వనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

యడ్లపాడు, జూన్ 23, ప్రభాతవార్త : నీటి వనరుల సంరక్షణ ప్రతిఒక్కరు సామాజిక బాధ్యతగా భావించాలని జల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జల సంచాయ్, జల భాగిదారి(జేఎస్ బీ) నోడల్ అధికారి బండి శ్రీధర్ అన్నారు. యడ్లపాడు మండలంలోని జాలాది, కారుచోల, తుర్లపాడు, మైదవోలు, సొలస, కొండవీడు, కోట గ్రామాలను నోడల్ అధికారి మంగళవారం పర్యటించారు. జేఎసేబీ కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం క్షేత్రస్థాయిలో చేపట్టిన ఇంకుడు గుంతలు, సేద్యపు కుంటలు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలకు సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణ విధానాలను అవలంభించాలని చెప్పారు కార్యక్రమంలో డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఇ బూసిరెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీవో సుందరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యమే నడపాలి

నరసరావుపేట క్రైమ్, జూన్ 23 ప్రభాతవార్త : ఏపీఎస్ఆర్టీసీలో నూతనంగా ప్రవేశపెట్టబోతున్న ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యమే నడపాలని ప్రైవేట్ సంస్థ అయిన ఫినాకిల్ కంపెనీకి ఇవ్వడానికి వీలులేదని కోరుతూ ఏపీఎస్ఆర్టీసీలోని ఐదు యూనియన్ల జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీగా ఏర్పాటై మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ క్రమక్రమంగా ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయాలనుకుంటున్న యాజమాన్యపు వైఖరిని ఖండించారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. తక్షణమే 12వ పిఆర్సి కమీషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు టీవీ. రెడ్డి, పిఎస్. రావు, కే. చందు, టి. సురేష్, ఎన్.కె. రావు, కె. రామారావు, కె. చంద్రశేఖర్, బి. నాగార్జున, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి : ఎమ్మెల్యే డా. చదలవాడ



నరసరావుపేట,జూన్ 23 ప్రభాతవార్త : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) నిర్వహిస్తున్న ఓటరు జాబితా ధృవీకరణ సర్వేను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు వార్డుకు వెళ్లి స్థానిక నాయకులు, బీఎల్వోలు, బీఎల్ఏలతో మాట్లాడి సర్వే పురోగతిపై ఆరా తీశారు. ఓటర్ల వివరాల సేకరణ, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల మేరకు వ్యవహరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో అనర్హుల వివరాలు తొలగించే విషయంలో కూడా పూర్తి పరిశీలన జరపాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి ఓటరుకు తన ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు అధికారులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్వోలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ స్థలాలు లీజు హక్కులపై సమావేశం

నరసరావుపేట టౌన్, జూన్ 23 ప్రభాతవార్త :: పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, అమరావతి, దాచేపల్లి, అచ్చంపేట మరియు పిడుగురాళ్ళ లో ఖాళీగా ఉన్న స్థలాలు లీజుకు ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి టి అజిత కుమారి తెలిపారు. ఆర్టీసీ స్థలాలలో 15 సం లకు చట్టపరమైన వ్యాపారము చేసుకొనుటకు అద్దె ప్రాతి పదికన ఇవ్వడం జరుగుతుందన్నారు. నెల్లూరు జోనల్ కార్యాలయమువారి ద్వారా 03.07.2026 . " తేదీన టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. ఎ.పి.యస్.ఆర్.టి.సి. జిల్లా ప్రజా రవాణా అధికారి టి. అజిత కుమారి తెలియ పరచినారు.

## కాపుల ఆత్మీయ సభలో అందరూ పెయిడ్ ఆర్టిస్టులే

-నియోజకవర్గ కాపునాయకులు

పొన్నూరు, జూన్ 23,ప్రభాతవార్త: కాపుల ఆత్మీయ సదస్సులో పాల్గొన్న వైకాపా నాయకులు అందరూ పెయిడ్ ఆర్టిస్టులేనని నియోజకవర్గ కాపునాయకులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వైకాపా పార్టీ నాయకులు నిర్వహించిన కాపుల ఆత్మీయ సదస్సులో పాల్గొన్న



ప్రతి ఒక్కరూ కాపు కులాన్ని అడ్డుపెట్టుకొని, జగన్మోహనరెడ్డి పంపించిన పెయిడ్ ఆర్టిస్టులేనన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుంటే చూసి తట్టుకోలేని వైకాపా నాయకులు కులాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు.కాపు కులాన్ని విభజిస్తూ కాపుల మధ్య చిచ్చుపెట్టి, అల్లర్లు సృష్టించాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. గత టిడిపి హయాంలో కాపు కార్పోరేషన్ ఏర్పాటు చేసి కాపులకు అండగా ఉన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. కాపులకు విదేశీ విద్య అందించిన ఘనత టిడిపిదేనన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ కాపులకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఇచ్చారన్నారు.సత్తెనపల్లిలో కాపు నాయకులపై దాడి చేయించిన ఘనత అంబటి రాంబాబుదన్నారు. ఈయనా కాపు నాయకుల గురించి మాట్లాడేది అన్నారు. అంబటి రాంబాబు కాపులు అంటే అసహ్యం అని నీవు మాట్లాడిన మాటలు మరిచిపోయావా? అని ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వం ఒక్కరికైనా కాపు కార్పోరేషన్, విదేశీ విద్యను అందించిందా..?అ ని ప్రశ్నించారు. నాడు మాట్లాడని కాపులు నేడు మాట్లాడుతున్నారంటే కాపుల మధ్య చిచ్చు పెట్టాలని కదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్మోహనరెడ్డి మాయలో పడకుండా కాపులు తెలివితో మెలగాలని వారు కోరారు. సమావేశంలో పట్టణ యువత అధ్యక్షుడు తోట ప్రసాద్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చలమశెట్టి సీతారామయ్య, మాజీ వైస్ ఛైర్మన్ ఆకుల సాంబశివరావు, జనసేన పార్టీ అధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బారావు, నీటి సంఘం అధ్యక్షుడు గణిపిశెట్టి రామకృష్ణ, శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి డైరెక్టర్ కత్తుల రవికిరణ్, మాజీ కౌన్సిలర్ యరసాని శ్రీరామమూర్తి, మాజీ ఎంపిటీసి యాణం వేణు, అనిశెట్టి వీరబాబు, తదితరులున్నారు.

## జనసేనతోనే రాష్ట్రానికి దిశానిర్దేశం

పొన్నూరు, జూన్ 23,ప్రభాతవార్త: జనసేన పార్టీతోనే రాష్ట్రానికి దిశానిర్దేశం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. జనసేన పార్టీ ఒంగోలు పార్లమెంట్‌కు పార్టీ కార్యకలాపాలు చక్కబెట్టేందుకు పార్టీ అధినేత జనసేనాని పరిశీలకుడిగా కిలారి వెంకట రోశయ్యను నియమించారు. రాష్ట్రంలోని 25పార్లమెంట్ నియోజకవర్గాలకు పార్టీ కార్యకలాపాలు చక్కబెట్టేందుకు పవన్ కళ్యాణ్ ఇంచార్జులను



నియమించారు. అందులో భాగంగా ఒంగోలు పార్లమెంట్‌కు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యను పరిశీలకునిగా నియమించారు. ఈ విషయం తెలుసుకున్న పొన్నూరు పార్టీ నాయకులు కిలారి వెంకట రోశయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రోశయ్య నాయకులతో మాట్లాడారు. జనసేన పార్టీ రాబోయే రోజుల్లో బలోపేతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కిలారిని కలిసిన వారిలో మాజీ జడ్పీటీసీ కోటా శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వల్లంశెట్టి శ్రీధర్, మాదాసు అప్పారావు, రియల్ భూమ్ అధినేత శ్రీనివాసనాయుడు తదితరులున్నారు.

## రూ.6.5కోట్లతో వంతెన నిర్మాణం



నిజాంపట్నం, జూన్ 23, ప్రభాతవార్త: మండలంలోని అనేక ప్రాంతాల ప్రజల చిరకాల వాంఛను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తున్నదని మంత్రి సోదరుడు శివప్రసాద్ అన్నారు. మండలంలోని కొమరవోలు- చక్కావారిపాలెం మధ్య డ్రెయిన్‌పై రూ.6.5కోట్లతో నిర్మిస్తున్న వంతెన శ్లాబ్‌కు ఆయన మంగళవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజ్ఞం, కళ్ళిఫలం, గరువుపాలెం తదితర ప్రాంత ప్రజలు 15 నిమిషాల్లో నిజాంపట్నంకు చేరుకోవచ్చన్నారు. గతంలో కూచినపూడి వెళ్ళి అక్కడ నుంచి నిజాంపట్నంకు వెళ్ళే వారని ఆయన గుర్తు చేశారు. ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య, తెదెపా, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

## డిఎస్పీ అజీజ్‌కు చైతన్యవేదిక మెమెంటో బహూకరణ

రేపల్లె, జూన్ 23, ప్రభాతవార్త:రేపల్లె డిఎస్పీ అజీజ్‌కు మంగళవారం రేపల్లె చైతన్యవేదిక అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ప్రశంసనీయమని అన్నారు. రేపల్లె పోలీస్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా డిఎస్పీ అజీజ్ నిఘా ఏర్పాటు చేశారన్నారు.ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడుతున్న పోలీసుల సేవలు మరువలేనివన్నారు.ప్రజలకు పోలీస్ శాఖ భరోసా కల్పిస్తున్నదని వెంకటేశ్వరరావు చెప్పారు.ఈ కార్యక్రమంలో రేపల్లె వైస్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు వాగోలు బాబూరావు,కార్యదర్శి రాచబత్తుని శ్రీనివాసరావు,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నల్లూరి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



## చేనేత బకాయిలను చెల్లించాలి


రేపల్లె, జూన్ 23, ప్రభాతవార్త:చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.203 కోట్ల బకాయిలను చెల్లించాలని ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు గొట్టుముక్కల బాలాజీ డిమాండ్ చేశారు.మంగళవారం భట్టిప్రోలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని చెప్పారు.చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు.ఐక్య కార్యాచరణ కమిటీ బాపట్ల జిల్లా నాయకుడు మురుగుడు సత్యనారాయణ మాట్లాడుతూ నేతన్న భరోసా పథకాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు.అదే విధంగా ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి రూ.25 వేలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చేనేత కార్మిక సంఘం నాయకులు బట్టు నాగమల్లేశ్వరరావు,కొదాలి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టైపు రైటింగ్ నైపుణ్యాభివృద్ధికి కృషి:సి.వి.మోహన్‌రావు



రేపల్లె, జూన్ 23, ప్రభాతవార్త:సాంకేతికత వేగంగా మారుతున్నా టైపు రైటింగ్ నైపుణ్యం తగ్గకుండా మాకే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ టైపు రైటింగ్ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ 2017లో చేపట్టిందని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సి.వి.మోహన్‌రావు తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతి 6 నెలలకు టైపు రైటింగ్,షార్ట్‌హ్యాండ్ పరీక్షల నోటిఫికేషన్లు సమయానికి జారీ అయ్యేలా బోర్డు అధికారులను సమన్వయం చేసుకుంటున్నామని చెప్పారు.వేలది మంది విద్యార్థుల భవిష్యత్తును పరిరక్షిస్తున్నామన్నారు. 2026-2027 సంవత్సరంలో నూతన నిబంధనల ప్రకారం టైపు రైటింగ్ ఇన్‌స్టిట్యూట్లకు గుర్తింపు తెచ్చే విధంగా కృషి చేసినందున వేలాది చిన్న టైపు ఇన్‌స్టిట్యూట్లు ఉనికిని రక్షించామని తెలిపారు.బోర్డు అధికారులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఫైళ్ళ నిర్వహణ,పరీక్షల విషయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా అడ్డంకులను అధిగమిస్తున్నట్లు ఆయన వివరించారు.టైపు రైటింగ్ యుగం ముగిసిందని భావిస్తున్న తరుణంలో ఏపిటీఎస్ఐఎ సంఘం పోరాటంతో కంప్యూటర్ యుగంలోనూ పురోగతి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ల్యాబ్‌టాప్,కంప్యూటర్ రంగప్రవేశంతో టైపురైటర్ వాడకం తగ్గినప్పటికీ టైపు రైటింగ్ నేర్చుకోవడం వలన వచ్చే ప్రయోజనాలు ఏ మాత్రం తగ్గలేదని మోహన్‌రావు గుర్తు చేశారు.టైపు రైటర్ కీలు గట్టిగా ఉంటే కంప్యూటర్ కీ బోర్డు చాలా తేలికగా ఉంటుందని చెప్పారు.టైపింగ్ స్పీడ్ 60-70 డబ్ల్యూపిఎం వరకు పెరుగుతుందని తెలిపారు.టైపు రైటర్‌లో తప్పు టైప్ చేస్తే ఎరైజర్ అవకాశం లేదని,మరలా కొత్త పేజీ తీసుకోవాలని,విద్యార్థులు జాగ్రత్తగా ఆలోచించి టైప్ చేయడం నేర్చుకుంటారని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికీ గ్రూప్-4,జూనియర్ అసిస్టెంట్,కోర్టు స్టెనో పోస్టులకు టైపు రైటింగ్ టెస్ట్ తప్పనిసరి అన్నారు.కంప్యూటర్ టైపింగ్,టైపురైటర్ టైపింగ్ వేర్వేరైనప్పటికీ రెండింటికీ ప్రాక్టీస్ అవసరమన్నారు.ప్రతి సంవత్సరం జూన్ 23వ తేదీ నిర్వహించుకునే జాతీయ టైపురైటర్ దినోత్సవం సందర్భంగా సాంకేతికత ఎంత ముందుకు వెళ్ళినా మూలాలను మరచిపోకూడదని నైపుణ్యాన్ని గౌరవించాలని,కష్టపడే ప్రతి టైపిస్టును,ప్రతి గురువును అభినందించాలని ప్రతిజ్ఞ చేయాలని సి.వి.మోహన్‌రావు పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్ సమీక్షా సమావేశం



రేపల్లె, జూన్ 23, ప్రభాతవార్త:పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమంపై ఎన్నికల అధికారి,ఆర్డీవో బి.శ్రీదేవి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఎన్యుమరేషన్ ఫార్మ్స్ సేకరణ,పంపిణీ,డిజిటలైజేషన్ ప్రక్రియపై చర్చించారు.ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతంగా సమర్థవంతంగా పూర్తిచేయాలని ఆమె సూచించారు.రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ బూత్ లెవల్ ఏజెంట్లు,బిఎల్‌వోలు కలిసి పనిచేయాలని కోరారు.క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో పనిచేసి నిర్దేశిత గడువులో లక్ష్యాలను సాధించాలని శ్రీదేవి ఆదేశించారు.ఈ సమావేశంలో రేపల్లె మండల తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, సహాయక ఎన్నికల అధికారులు,సిబ్బంది,రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.వి.నాగేశ్వరరావు,కరేటి శేషగిరిరావు,ప్రభుత్వ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## పులుగు శ్రీనివాసరెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగింపు

కర్లపాలెం,జూన్23,ప్రభాతవార్త: కర్లపాలెం మండల పరిధిలో నిర్వహించిన పులుగు శ్రీనివాసరెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి మండల పార్టీ అధ్యక్షులు షేక్ బాజీ, టిడిపి క్లస్టర్ ఇంచార్జి కంకిపాటి భోజరాజు, ఎట్రవారిపాలెం సీనియర్ టిడిపి నాయకులు చీరాల శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలు, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం మాట్లాడిన షేక్ బాజీ యువత క్రీడల్లో రాణించడంతో పాటు



క్రమశిక్షణ, ఐకమత్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి స్మారక క్రీడా పోటీలు యువతలో ప్రతిభను వెలికితీయడంతో పాటు గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పుతాయని తెలిపారు.కంకిపాటి భోజరాజు మాట్లాడుతూ, దివంగత పులుగు శ్రీనివాసరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ అభినందనీయమని పేర్కొన్నారు. యువత క్రీడల ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షిస్తూ, నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మాల ఐక్యత సమావేశం

బాపట్ల,జూన్23,ప్రభాతవార్త,ప్రతినిధి: బాపట్ల పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం మాలల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాల ఐక్యత సమావేశం ఘనంగా నిర్వహించారు. మాల ఐక్యత వేదిక కోఆర్డినేటర్ సలగల చంటిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని మాలల



సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధితో పాటు రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.మాలల సంక్షేమ సంఘం నాయకులు కోట్ల గంగాధరం మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు మాలలందరూ సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజ అభ్యున్నతి, యువత భవిష్యత్, విద్యా అవకాశాల విస్తరణ, సామాజిక న్యాయం సాధన కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.మాల మహా సభ వ్యవస్థాపకులు మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ మాల సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మాలల ఐక్యతను మరింత బలోపేతం చేసే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ మాట్లాడుతూ మాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సామాజిక సమానత్వ సాధన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. యువత, మహిళలు, విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ గోద జాన్ పాల్ మాట్లాడుతూ మాలల ఐక్యత ద్వారానే సమాజ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణతో పాటు సామాజిక న్యాయం కోసం ఐక్య ఉద్యమాలు కొనసాగించాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో మాలల సంక్షేమ సంఘం నాయకులు, సామాజిక కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా ప్రతినిధులు, విద్యార్థులు మరియు మాల సమాజానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లాను పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయడానికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

బాపట్ల,జూన్23,ప్రభాతవార్త,ప్రతినిధి: బాపట్ల జిల్లాను పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయడానికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని వీక్షణ సమావేశం నందు జిల్లా పరిశ్రమల ఎగుమతుల కమిటీ సమావేశం జిల్లా సంయుక్త కలెక్టర్అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు జిల్లాలోపరిశ్రమల కోసం42 దరఖాస్తులు చేసుకోగా కమిటీ వాటిని పరిశీలించి 38 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, మిగిలిన 4 దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి అనుమతులకు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట అధికారులకు సూచించారు. జిల్లాలో ఎం ఎస్ఎంఈ మరియుఈడిపి 202429, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ 2020 23,202327 మరియు పిఎంఈజీపి ద్వారా 152 కొత్త పరిశ్రమలకు రూ.5.88 కోట్ల



రాయితీ కల్పించామన్నారు .జిల్లాలో టూరిజం పాలసీ కింద దరఖాస్తు చేసుకున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అనుమతులు,రాయితీలు వచ్చే విధంగా వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా టూరిజం అధికారిని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఒక కుటుంబ ఒక పారిశ్రామిక వేత్త అనే నినాదం పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఎం ఎస్ ఎం ఈ కార్పొరేషన్ ప్రవేశపెట్టిన ర్యాంప్ కార్యక్రమం కింద బాపట్ల జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో 51 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించినట్లు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రామకృష్ణ సంయుక్త కలెక్టర్ కు తెలిపారు.
ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కోసం ఈ నెల 22వ తేదిన ప్రకాశం జిల్లాలో నిర్వహించిన బిజినెస్ ఎలైట్ మీట్ మాదిరిగా బాపట్ల జిల్లాలో కూడా ఏర్పాటు చేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పించాలని కమిటీ మెంబర్ వి. భక్తవత్సలం జిల్లా సంయుక్త కలెక్టర్ ను కోరారు. సంయుక్త కలెక్టర్ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారి రామకృష్ణను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిఎండిఐసి రామకృష్ణ, ఆర్డీవో పరంధామ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి ఆనంద పాల్, ఏపీ ఎస్ ఎఫ్ సి బ్యాంక్ మేనేజర్ రామాంజనేయులు మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి ఎంపీపీ యారం వనజ

కర్లపాలెం,జూన్23,ప్రభాతవార్త: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద గొల్లపాలెంలో నేడు నాషాముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి అనే విషయం మీద వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా




పాఠశాలను సందర్శించిన కర్లపాలెం ఎంపీపీ వనజ , ఎంపీడీవో బాబురావుచ,ఈపిడిఓ విద్యార్థుల చేత మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞను చేయించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల విషయంలో అవగాహన కలిగి దూరంగా ఉండాలని వారి తల్లిదండ్రులను స్నేహితులను ఈ విషయంలో అప్రమత్తలను చేయాలని ఎండిఓ సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణగా ఉండి చక్కగా చదువుకొని ఉన్నతమైన స్థానాలను పొందాలని మంచి సమాజ పౌరులుగా ఎదగాలని మాదకద్రవ్యాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని అలాంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సుభాషిణి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## పద్మబ్రాహ్మణ పురోహితుల మహాసభ బ్రోచర్ ఆవిష్కరణ

రేపల్లె, జూన్ 23, ప్రభాతవార్త:అఖిల భారత పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం 28వ మహాసభను తమిళనాడు రాష్ట్రంలోని శ్రీరంగం మహా పుణ్యక్షేత్రంలో జూలై 21,22 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పద్మ బ్రాహ్మణ పురోహితుడు గోలి ధర్మారావు తెలిపారు.మంగళవారం మహాసభ బ్రోచర్‌ను ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీరంగంలో జరిగే మహాసభకు పద్మబ్రాహ్మణ పురోహితులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో రేపల్లె పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం కార్యదర్శి అవ్వారు శ్యామసుందరరావు,కోశాధికారి రాచాబత్తుని కాళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కుల రాజకీయాలకు చెక్ పెట్టాలి

### -లేదంటే జగన్‌కు శాశ్వత రాజకీయ సమాధి

### -జీడీసి ఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు ఘాటు హెచ్చరిక



పొన్నూరు, జూన్ 23,ప్రభాతవార్త: రాష్ట్రంలో కుల రాజకీయాలను ప్రోత్సహిస్తూ సమాజంలో విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డిపై జీడీసిఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు ఘాటూగా తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కుల రాజకీయాలు మానుకోకపోతే ప్రజలే జగన్‌కు శాశ్వత రాజకీయ సమాధి కట్టేస్తారని హెచ్చరించారు. జగన్మోహనరెడ్డి నిజంగా కాపు సామాజిక వర్గంపై ప్రేమ, చిత్తశుద్ధి కలిగి ఉంటే, కాపు వర్గానికి చెందిన వ్యక్తిని సీఎం అభ్యర్థిగా ప్రకటించగలరా అని సూటిగా ప్రశ్నించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో కాపు కార్పోరేషన్ ద్వారా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలదేన్నారు. టిడిపి హయాంలో ఈడబ్ల్యూఎస్ కోటా కింద కాపులకు 5శాతం రిజర్వేషన్లు కేటాయించగా, జగన్ ప్రభుత్వం వాటిని తొలగించిందన్నారు. రాష్ట్రంలో కాపు పరిరక్షణ పేరిట కులాల మధ్య చిచ్చు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు.రాయలసీమలో బలిజలపై అన్యాయం జరిగిందని, వారి స్థానాల్లో ఇతరులకు ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. రాజంపేటలో బలిజలకి ఉన్న ఎంపీ స్థానాన్ని మార్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గతంలో కాపులపై అక్రమ కేసులు పెట్టించి హింసించారని కూడా విమర్శించారు. పవన్ కళ్యాణ్, ఆయన కుటుంబంపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిని ప్రోత్సహించారిన, కాపులను అవమానించిన వారికి వైసీపీలో కీలక పదవులు ఇచ్చినట్లు తెలిపారు.

## ఆర్టీసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పొన్నూరు, జూన్ 23,ప్రభాతవార్త: ఆర్టీసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ ఆర్టీసి ఉద్యోగులు మంగళవారం డిపో ఆవరణలో ధర్నా చేశారు. ప్రజా రవాణా ప్రభుత్వ ఆధీనంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ విలువైన ఆస్తులను ప్రైవేటు ఆపరేటర్లకు కట్టబెట్టే ఆలోచనను విరమించుకోవాలన్నారు. విద్యుత్ బస్సు ఆపరేటర్ల కోసం డిపోలను ఖాళీ చేయించే విధానాలు మానుకోవాలన్నారు. స్త్రీ శక్తి



పతకం విజయవంతం చేసేందుకు వెంటనే నాలుగు వేల కొత్త బస్సులను ప్రవేశపెట్టాలన్నారు. ఆర్టీసిలో ఖాళీగా ఉన్న 10వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు, యువతకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ఏపిఎస్ఆర్టీసి సొంతంగా నిర్వహించేవిధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రయాణీకుల భద్రత భరోసా ఆర్టీసి బస్సులతోనే సాధ్యమన్నారు. విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేటీకరణ చర్యలు ఆపాలన్నారు. ఈ ఉద్యమం ప్రజా రవాణ సంస్థ ఆర్టీసిని కాపాడుకునేందుకే తప్ప ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదన్నారు. కాలం చెల్లిన బస్సుల బ్రేక్ డౌన్‌కు గ్యారేజి ఉద్యోగులను బాధ్యులను చేస్తూ ఇచ్చే పనిష్మెంట్ల విధానాన్ని రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పిఆర్సీని, డిఏ, ఐఆర్‌లను వెంటనే ప్రకటించాలన్నారు.12వ పిఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎఐబేగ్, ఎంఎస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణమైన ఆరోగ్యం

పొన్నూరు, జూన్ 23,ప్రభాతవార్త: బాల,బాలికలు పౌష్టికాహారం తీసుకున్నట్లయితే సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందగలరనే విశ్వాసంతో లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహాకారాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి బాలస్వామి, లయన్స్‌క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఎనిమిది




పాఠశాలలకు పౌష్టికాహారం కిట్లను అందజేయడం జరిగిందన్నారు. చిన్నారుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చేసేందుకే మా వంతు ప్రయత్నంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సుమారు 250మంది చిన్నారులకు చాకో బిక్కీస్,బోర్నవిటా చాక్లెట్స్, తదితర పౌష్టికాహార పొట్లాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మన్నవ అనసూయాదేవి, గారా కృష్ణకుమారి, పరాశరం రంగవల్లి, తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే


పొన్నూరు, జూన్ 23,ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో పద్మశ్రీ డాక్టర్ యలవర్తి నాయుడమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని ఉద్భవ్యా ఇగ్నైటింగ్ విజ్డమ్, ఇన్‌స్పైరింగ్ చేంజ్ కార్యక్రమ సిరీస్‌లో భాగంగా నాలుగవ లెక్చర్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిపార్టుమెంట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్, డిపార్టుమెంట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ అదర్ ఫారిన్ లాంగ్వేజెస్, అలాగే డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. యువతో నాయకత్వ లక్షణాలు, విలువలు, శాస్త్రీయ ఆలోచనా విధానం



పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన చెన్నై జేపియార్ యూనివర్సిటీ ప్రో-వైస్ చాన్సలర్ వీజేకే కిషోర్ సొంటి మాట్లాడుతూ భవిష్యత్ తరాల పిల్లలను తరగతి గదుల్లో ఎంతో జాగ్రత్తగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బాధ్యతను భారం లాగా కాకుండా అవకాశంగా భావించాలని సూచించారు. దేశానికి సేవ చేయడం ఒక బాధ్యత మాత్రమే కాకుండా జీవితంతో దక్కే గొప్ప అవకాశమని చెప్పారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అండర్‌స్టాండింగ్ సైన్స్ ఏ సైన్స్‌టు అండర్ స్టాండ్ అనే అంశంపై ప్రసంగించారు. జీవితానికి సంబంధించిన ఆధ్యాత్మిక కోణాన్ని వివరిస్తూ, మనిషి జీవితం ఒక ప్రయాణమని, జననం నుంచి మరణం వరకు అది ఒక వృత్తాకార చక్రంలా సాగుతుందన్నారు. మరణాన్ని అంతిమంగా కాకుండా భౌతికంగా కనిపించకుండా పోవడంగా చూడాలని సూచించారు. మరణ వార్షికోత్సవం కంటే వ్యక్తి జీవితాన్ని, ఆయన చేసిన సేవలను స్మరించుకోవడమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. యవ్వనం ఒక బుడగలాంటిదని, అది శాశ్వతం కాదని, కాబట్టి యువత సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీవితంలో ప్రభావం, అనుభవం, నేర్చుకోవడం, నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టడం వంటి అంశాలు వ్యక్తిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని వివరించారు. మరో ముఖ్య అతిథి ఇండియాస్ మోస్ట్ ఫ్యాషనేట్ సైన్స్ మెంటర్ ఈఆర్ శ్రీనివాస్ ఎస్‌జీ మాట్లాడుతూ దేశాభివృద్ధి శాస్త్ర, సాంకేతిక రంగాల పురోగతిపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రపంచ దేశాల అభివృద్ధి చరిత్రను పరిశీలిస్తే విజ్ఞానం, పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా సమాజంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. నేటి విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలని, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ మాజీ ఛైర్మన్, టుబాకో బోర్డు మాజీ ఛైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కె.సుబ్రహ్మణ్యం విజ్ఞాన్స్ వీసి ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, ఆయావిభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే సజావుగా సాగేవిధంగా చూడాలి

పొన్నూరు, జూన్ 23,ప్రభాతవార్త: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఇంటింటి సర్వే సజావుగా సాగడంలేదని, బిఎల్వోలు కొంత మంది వారి ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని, రెండు ఫారాలు ఇవ్వాల్సి ఉండగా ఒకటే ఫారం ఇచ్చి చేతులు దుపలుకొంటున్నారని వైకాపా పట్టణ పార్టీ



అధ్యక్షుడు షేక్ నాజర్, రాష్ట్ర కార్యదర్శి డక్కుమళ్ళ రవి డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరీముల్లా దృష్టికి తీసుకొచ్చారు. బిఎలో వ్లతో బిఎల్యేలు మాత్రమే తిరగాల్సి ఉన్నప్పటికీ నాయకులు కూడా వారి వెంటే తిరుగుతూ ఇంటింటి సర్వే సజావుగా సాగకుండా చేస్తున్నారన్నారు. కొన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో వైకాపా బిఎల్యేలను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు వివరించారు. అందుకు స్పందించిన కరీముల్లా సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానని సమాధానం చెప్పారు.

## యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు



పొన్నూరు, జూన్ 23,ప్రభాతవార్త: వ్యవసాయశాఖ రూపొందించిన యాప్‌లో రైతులు వివరాలు నమోదు చేయించుకొంటేనే ఎరువుల విక్రయాలు జరిపించేందుకు మార్గం సుగమం అవుతుందని చేబ్రోలు మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని కోరారు. చేబ్రోలు మండల పరిధిలోని వేజండ్ల గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి రైతు రైతు సేవా కేంద్రానికి వచ్చి సిబ్బంది చేత ఫార్మర్‌యాప్ చేయించుకోవాలన్నారు. ఆధార్‌కార్డు లింక్ అయిన నెంబరుకు ఓటిపి వస్తుందన్నారు. ఏపిఏఐఎంసి యాప్‌లో యూరియా, డిఏపి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు ఖచ్చితంగా యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. యాప్ ద్వారా మాత్రమే రైతులకు ఎరువులు, విత్తనాలు, ఇతర పరికరాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన సహాయకురాలు కోట్ల లక్ష్మీ, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

రేపల్లె, జూన్ 23, ప్రభాతవార్త:రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏడుగురు చిరు వ్యాపారులకు రూ.లక్ష విలువైన తోపుడు బండ్లను మంగళవారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జిఎస్ శ్రీనివాసరావు,టిఎస్ రామకృష్ణ,డిస్ట్రిక్ట్ ఛైర్మన్ ఎంఎం సక్సేనా, వి.సాయిూశ్వరరావు,బాపారావు,మల్లెలరామచంద్రరావు,ప్రభల సుబ్రహ్మణ్యం, ౩.కృష్ణమూర్తి,తలశిల రామారావు,కిషోర్,ప్రసాద్,వేములపల్లి రాఘవేంద్రరావు,కేసన పూర్ణచంద్రరావు, కొమ్మూరి నాగలీల,కె.హరిత,ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## చార్టెడ్ అకౌంటెన్సీలో ఉత్తీర్ణత సాధించిన హేమ వర్షినిని సత్కరించిన చిల్లపల్లి

మంగళగిరి, జూన్ 23, ప్రభాతవార్త: మంగళగిరి పట్టణంకు చెందిన కొక్కుల హేమ వర్షిని చార్టెడ్ అకౌంటెన్సీ (సీఏ) ఫైనల్ పరీక్ష ఫలితాల్లో తొలి ప్రయత్నంలోనే రెండు గ్రూపులు ఉత్తీర్ణత సాధించి సీఏ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఏపీఎంఎస్ఐడిసి ఛైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు మంగళవారం ఉదయం మంగళగిరి తెనాలి ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందచేశారు. ఈ సందర్భంగా చిల్లపల్లి



శ్రీనివాసరావు మాట్లాడుతూ హేమ వర్షిని సాధించిన విజయాన్ని, ఆమె యొక్క ప్రతిభను, పట్టుదలను కొనియాడుతూ, తొలి ప్రయత్నంలోనే సీఏ పూర్తి చేయడం యువతకు స్ఫూర్తిదాయకం, గర్వకారణం. కృషి, పట్టుదలకు నిదర్శనం అన్నారు. తండ్రి స్వర్ణకారుడిగా కుటుంబాన్ని పోషిస్తుండగా ఇలాంటి విజయం ఎంతో భాగ్యాధాయకం, తల్లిదండ్రుల కష్టాన్ని దగ్గరగా చూస్తూ, గెలుపుకు ఇవేమీ అడ్డంకులు కావు అంటూ నిరూపించిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుంబానికి, మంగళగిరి పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో స్థానిక శాసనసభ్యులు, విద్యా శాఖ మంత్రి లోకేష్ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులతో, యువతకు నైపుణ్యాభివృద్ధికి ఇలాంటి విద్యార్థులు మరింత రాణించేలా తగిన ప్రోత్సాహాన్ని అందిస్తూ కూటమి ప్రభుత్వం భరోసాని కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

## భాజపా కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

మంగళగిరి, జూన్ 23, ప్రభాతవార్త: మంగళగిరి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్రసమర యోధుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకే దేశంలో రెండు జెండాలు రెండు రాజ్యాంగాలు ఉండకూడదని జాతీయ ఏకత్వం కోసం తన ప్రాణాలను అర్పించిన మహోన్నత వ్యక్తి అప్పటి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కి ఘనంగా నివాళులు అర్పించారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని దేశవ్యాప్తంగా బలిదాన దివస్ గా జరుపుకోవడం జరుగుతుందని బిజెపి నాయకులు తెలిపారు.



ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, రాష్ట్ర వివర్స్ సెల్ కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, ఓబీసీ మోర్చా కోస్తాంధ్ర జోనల్ ఇంచార్జ్ టి రామకృష్ణ , జిల్లా కార్యదర్శి పంచుమర్తి ప్రసాద్ , ఓబీసీ మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ కే రాకేష్ జి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జాతీయ హిందీ అభివృద్ధిబోర్డ్ మెంబర్ కాండ్రు భాను కిషోర్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బుల్ల రాజారావు , జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి పడమటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాపులను కూటమికి దూరం చేసే కుట్ర!..
### కాపులు వైసిపి ఉచ్చులో పడొద్దు..

మంగళగిరి, జూన్ 23, ప్రభాతవార్త : కాపు సామాజిక వర్గం వారిని టిడిపి, జనసేన, బిజెపి పార్టీల కూటమికి దూరం చేసే కుట్ర ఏపీలో జరుగుతోందని తెలుగుదేశం పార్టీ మంగళగిరి నియోజకవర్గ సీనియర్ నాయకులు గోవాడ దుర్గారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడారు. కాపు సామాజిక వర్గం నేతలకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం అన్ని విధాల ప్రాధాన్యత కల్పిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు కాపుల అభ్యున్నతికి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో జరిగే ప్రతి సంఘటనకు కులాన్ని అంటగడుతూ రాజకీయ ప్రయోజనాలు పొందే కుట్రలు ఎక్కువయ్యాయని విమర్శించారు. ఆ కుట్రలకు కాపు సామాజిక వర్గం బలి కాకూడదని తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన అరాచకాలను గుర్తుంచుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వ చొరవతోనే కాపుల సంక్షేమం సాధ్యమని స్పష్టం చేశారు.

## అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటుకు స్థలం మంజూరు, భవన నిర్మాణానికి వినతి

పెదకూరపాడుజూన్ 23, ప్రభాతవార్త : ఆనందపేట కృష్ణమాదిగ కాలనీలో డా" బాబు జగజీవన్ రామ్ భవన నిర్మాణానికి,స్థల అనుమతికి, జగజ్జీవన్ రామ్ డా" బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని పి.డి.ఎస్. జె. ఎస్. సి,కమిటీ అధ్యక్షులు కంచర్ల రత్నబాబు మాదిగ ఆధ్వర్యంలో



తహసిల్దార్ శ్రీనివాసరావుకు మంగళవారం వినతి పత్రం అందించారు. కాలనీలో సమావేశాలు, విద్యా కార్యక్రమాలు, ఇతర సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాల్ లేదని బాబు జగజ్జీవన్ రామ్ భవన నిర్మాణం ద్వారా ఆనందపేట అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందని అధ్యక్షులు కంచర్ల రత్నబాబు మాదిగ అన్నారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి మాట్లాడి తప్పకుండా తగు న్యాయం చేస్తానని తహసిల్దార్ శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ కంచర్ల ప్రదీప్ కుమార్ ట్రెజరర్ కంచర్ల అంకమ్మ, వైస్ ప్రెసిడెంట్ తాళ్లూరు సూరిబాబు, జాయింట్ సెక్రెటరీ మేకల నరేష్, కమిటీ గౌరవ సలహాదారులు కంచర్ల జానుబాబు మాదిగ, రావెల మాథ్యూస్ , కంచర్ల అమర్ కుమార్, కంచర్ల , సుబ్బారావు కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, పి రాజు, ఎం ప్రకాశరావు,, పవన్ ఎం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## జూన్ 30న విజయవాడలో జరిగే రైతు ధర్నాను జయప్రదం చేయాలి - సీపీఐ నాయకుడు మునగోటి శ్రీనివాసరావు

అచ్చంపేట, జూన్ 23 (ప్రభాత వార్త): ఈ నెల 30వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రైతు ధర్నాను రైతులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం అచ్చంపేట మండల కేంద్రంలో గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి రైతులను ఆర్థిక ఇబ్బందుల, ఆత్మహత్యల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పూర్తిగా అమలు చేయాలని కోరారు. అలాగే ఎరువులు, పురుగుమందుల ధరలను తగ్గించి రైతులకు అందుబాటులో ఉంచాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి వారికి పంట రుణాలు మంజూరు చేయాలని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రస్తుతం అందిస్తున్న రూ.20 వేల సహాయాన్ని రూ.50 వేల వరకు పెంచి ఒకే విడతలో చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బండారుపల్లి శ్రీనివాసరావు, సంపంగుల ఏడుకొండలు, షేక్ సుభాని, మార్తూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య
### --దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి


కొల్లిపర,జూన్ 23 (ప్రభాతవార్త): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య బోధిస్తున్నట్లు దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వల్లభాపురం అరుంధతీనగర్ ప్రాథమిక పాఠశాల లో ప్రభుత్వం అందజేసిన విద్యా కిట్స్‌ను విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలసి ఆయన



పంపిణీ చేసారు.ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం మౌలిక వసతులు కల్పించిందని చెప్పారు.కార్యక్రమంలో పఠాన్‌సమీరుద్దీన్‌ఖాన్,విద్యాకమిటీ చైర్మన్ జమున,ఉపాధ్యాయులు ఉమాదేవి,కిషోర్,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలు సాగు దెబ్బతీసేలా ఉంది
### -ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి

కొల్లిపర,జూన్ 23 (ప్రభాతవార్త): యాప్ పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలు మన సాగు దెబ్బతీసేలా ఉన్నాయని ఈ వర్ధతిని ఉపసంహరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.మంగళవారం అత్తోటలో మాజీ సర్పంచ్ దేశబోయిన



నాగపుణ్యేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కోటాల పేరుతో ఎరువుల కోత పెట్టి రైతులను శిక్షించే ప్రయత్నం జరుగుతుందన్నారు.గతంలో రైతులు పత్తి అమ్ముకునేందుకు కపాస్ యాప్ తీసుకొచ్చారని తెలిపారు.రెండు ఎకరాలు కేవలం నాలుగు యూరియా రెండు డీఏపిలు తెచ్చుకునేందుకు 20 రోజులు సమయం పడుతుందని..రైతుకు అవసరమైతే ఎరువులను ఎక్కడ నుంచి తెచ్చుకోవాలని ఆయన ప్రశ్నించారు.ప్రభుత్వ నిబంధనలు సరళతరం చేసి అవసరమైన ఎరువులను సకాలంలో అందించాలని ఆయన కోరారు.సమావేశంలో తుళ్ళిమిల్లి భాస్కరరావు,శంకర్రావు,తోటా సీతారామయ్య,వడ్లమూడి వెంకటేశ్వర్లు డి.సత్యన్నారాయణ,కోటేశ్వరరావు,దేశబోయిన శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బార్బర్ షాప్ లకు రాయితీ మినహాయించండి
### నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కురగంటి రఘురామయ్య

తెనాలి జూన్23(ప్రభాతవార్త): రాష్ట్ర నాయి బ్రాహ్మణుల బార్బర్ షాప్ లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రభుత్వం మంజూరు చేసినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ 200 యూనిట్లు దాటిన వారికి 200 యూనిట్లు వరకు తీసేవేసి మిగిలిన వాటికి బిల్లు తీసుకోవాలని ఆ మేరకు ప్రభుత్వం అంగీకరించాలని కోరుతూ రాష్ట్ర నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యవర్గ సమావేశం తీర్మానం చేసిందని నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కురగంటి రఘురామయ్య తెలియజేశారు. విజయవాడ బీసీ సంక్షేమ భవన్లో జరిగిన కార్పొరేషన్ నాలుగవ



కార్యవర్గ సమావేశానికి ఛైర్మన్ రుద్రకోటి సదాశివం అధ్యక్షత వహించారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న నాయి బ్రాహ్మణులకు వృత్తిలో అవసరమైన ఆధునిక వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు స్కిల్ డెవలప్మెంట్ క్రింద ట్రైనింగ్ ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి జిల్లాలో నాయి బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాలలో ఖాళీగా ఉన్న నాదస్వరం డోలు పోస్టులను భర్తీ చేయాలని తీర్మానం చేశారు. 50 సంవత్సరాలు దాటిన నాయి బ్రాహ్మణ కులవృత్తి చేసే వారికి మంగళ వాయిద్య కళాకారులకు పెన్షన్ మంజూరు చేయించాలని కోరారు అదేవిధంగా రాష్ట్రంలోని వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయించాలనీ కోరుతూ తీర్మానం చేశారని డైరెక్టర్ రఘురామయ్య తెలియజేశారు. ఈ సమావేశానికి ఏ పి బి సి ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఉమాదేవి తో పాటు కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు ఆదరణ పథకం ద్వారా నాణ్యమైన పనిముట్లు

తాడేపల్లి, జూన్ 23, ప్రభాతవార్త: చేనేత కార్మికులకు నాణ్యమైన, అవసరమైన పనిముట్లను మాత్రమే ఆదరణ పథకం ద్వారా అందించాని, ఆ విధమైనటువంటి పక్కా ప్రణాళికను ప్రభుత్వానికి అందజేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చేనేత నాయకులు గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. రాష్ట్రంలోని చేతివృత్తులను ఆదరించాలన్న లక్ష్యంతో నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేతి వృత్తిదారులకు త్వరలో అందించనున్న ఆదరణ పథకం ద్వారా పనిముట్లను ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన




తరగతుల ఆర్థిక సహకార సంస్థ ద్వారా అందించనున్నది. ఈ విషయమై తాడిగడప లోని సంస్థ కార్యాలయంలో మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు 2362026 మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సంస్థ జనరల్ మేనేజర్ జి.భీమ శంకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధనుంజయరావు మాట్లాడారు. రాష్ట్రంలోని చేనేత పరిశ్రమకు సంబంధించి వివిధ జిల్లాల నుంచి వచ్చిన చేనేత నిపుణులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహ చేనేత ప్రముఖులు పొట్లాబత్తుని లక్ష్మణరావు, వివిధ జిల్లాల చేనేత ప్రముఖులు అధికారులు పాల్గొన్నారు.

## మహిళ సాధికారత కోసం "హ్యాండ్" కృషి

తెనాలి జూన్23(ప్రభాతవార్త): గ్రామీణ మహిళలు, యువత ఆర్థికంగా, సామాజికంగా, సాంకేతికంగా ఎదగడానికి నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని హ్యాండ్ వ్యవస్థాపకులు దోగిపర్తి శైలజ,కమల్ పేర్కొన్నారు.రూరల్ మండలం గుడివాడ గ్రామంలో హ్యాండ్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ శక్తి,నైపుణ్యాలు,సాంకేతికత వ్యాపార అవకాశాల ద్వారా మహిళలు,యువత సాధికారత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ మహిళలకు డిజిటల్




స్కిల్స్,కమ్యూనికేషన్ స్కిల్స్,టైలరింగ్,బ్యూటీ, వెల్‌నెస్,టీచర్ ట్రైనింగ్, వ్యాపార నైపుణ్యాలు, స్వయం ఉపాధి అవకాశాలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించబడుతుందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలు తమ ప్రతిభను గుర్తించి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించేందుకు హ్యాండ్ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా వందలాది మంది మహిళలు మరియు యువతకు శిక్షణ,మార్గదర్శకత్వం, ఉపాధి అవకాశాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కమల్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కనీసం ఒక నైపుణ్యవంతురాలైన మహిళను తయారు చేయడమే మా లక్ష్యమని,మహిళ సాధికారత ద్వారా కుటుంబం, గ్రామం, సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసి,ఉపాధి, వ్యాపార అవకాశాలతో అనుసంధానం చేయడానికి హ్యాండ్ కట్టుబడి ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు,యువత హ్యాండ్ సంస్థను సంప్రదించాలని నిర్వాహకులని ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వానరానికి అంత్యక్రియలు

తెనాలి జూన్23(ప్రభాతవార్త): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వానరానికి అంత్యక్రియలు నిర్వహించిన శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు.మంగళవారం తెనాలి ఆటోనగర్ వద్ద ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వానరం మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు తెనాలి పట్టణానికి చెందిన శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను తమ సభ్యుల సహకారంతో తమ సొంత వాహనంలో మృతిచెందిన వానరాన్ని బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో మహాప్రస్థానం కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ ప్రసాద్,శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు, మల్లెల వాసు, అబ్రహం,సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



## తెనాలిలో అన్నదాతల ట్రాక్టర్ల ర్యాలీ విజయవంతం

తెనాలి మున్సిపాలిటీ జూన్23(ప్రభాతవార్త): అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకంలో భాగంగా రెండో ఏడాది మొదటి విడత నగదు రైతుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా, తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు తెనాలి పట్టణంలో అన్నదాతలు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు.



తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ పాలడుగు సురేంద్ర6 పిలుపు పర్యవేక్షణలో ర్యాలీ జరిగింది. మంగళవారం, సాయంత్రం మార్కెట్ యార్డు నుండి ప్రారంభమైన ర్యాలీ ఓవర్ బ్రిడ్జి, యడ్ల లింగయ్య పెట్రోల్ బంక్,లక్ష్మీ డీలక్స్ రోడ్, రజక చెరువు, గాంధీ చౌక్, బోసు రోడ్డులోని చిట్టి ఆంజనేయ స్వామి గుడి వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో శాసన మండలి సభ్యులు, తెనాలి టీడీపీ ఇంచార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్,వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు ,రైతు నాయకులు ఈదర పూర్ణచంద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, భీమవరపు కోటిరెడ్డి, మల్లవరపు విజయ్, యనమల అనిత తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు తమ ట్రాక్టర్లపై టీడీపీ జెండాలు, బెలూన్లతో అలంకరించి పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. అన్నదాత సుఖీభవ నిధులు విడుదలైనందుకు కృతజ్ఞతగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు వైస్ ఛైర్మన్ సురేంద్ర తెలిపారు. రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలు, టీడీపీ అభిమానులు భారీగా తరలివచ్చారు.

## విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటుపరం చేయొద్దు: పీటీడీ ఉద్యోగ సంఘాల జెఏసి

తెనాలి మున్సిపాలిటీ జూన్ 23(ప్రభాతవార్త): విద్యుత్ బస్సుల పేరుతో ఏపీఎస్ఆర్టీసీని దశలవారీగా ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఏపీ పీటీడీ ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. 2029 నాటికి ఆర్టీసీని ప్రైవేటు వారికి అప్పగిస్తూ ఇచ్చిన జి.ఓ.నెం.88ని రద్దు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీయే సొంతంగా నిర్వహించాలని స్పష్టం చేసింది. తెనాలి డిపో



వద్ద బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్, ధర్నాలో ఉద్యోగులు "ఆర్టీసీ బస్సులే ముద్దు ప్రైవేటు విద్యుత్ బస్సులు వద్దు", "విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేటీకరణ చర్యలు ఆపాలి" అంటూ నినాదాలు చేశారు.విద్యుత్ బస్సులపై జేఏసీ ప్రధాన డిమాండ్లు,విద్యుత్ బస్సుల నిర్వహణ కోసం డిపోలను ఖాళీ చేయించే విధానాలు మానుకోవాలి.ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు ఆపరేటర్లకు ఇవ్వకుండా ఏపీఎస్ఆర్టీసీ సొంతంగా నడపాలి.విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీ విలువైన ఆస్తులను ప్రైవేటు వారికి కట్టబెట్టే ఆలోచన విరమించుకోవాలి.స్త్రీశక్తి పథకం కోసం 4000 కొత్త బస్సులు ప్రవేశపెట్టాలి, అందులో విద్యుత్ బస్సులు ఆర్టీసీ అధీనంలోనే ఉండాలి. ఇతర డిమాండ్లలో ఆర్టీసీలో 10 వేల ఖాళీ పోస్టుల భర్తీ, 11వ పిఆర్సి , పెండింగ్ డిఏ అరియర్స్ చెల్లింపు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ ద్వారా జీతాలు, ఉద్యోగ భద్రత ఉన్నాయి. ఇది ప్రజారవాణాను కాపాడుకునే ఉద్యమమే తప్ప ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదు. ప్రయాణికుల భద్రత భరోసా ఆర్టీసీ బస్సులతోనే సాధ్యం" అని జేఏసీ నేతలు తెలిపారు.

## రైతులు భూసార పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి..

ప్రత్తిపాడు, జూన్ 23, ప్రభాతవార్త : భూసార పరిరక్షణకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయశాఖ ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పెదకాకాని మండలం రైతు సేవ కేంద్రంలో మంగళవారం కేత్ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మ పిడి హాజరై మాట్లాడుతూ..రైతులు నేల తల్లిని కాపాడాలని, విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వాడొద్దని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకుని ఆ ప్రకారం ఎరువులు వాడాలని రైతులకు తెలియజేశారు. బాసవరం బాస్వరం ఎరువులు దుక్కిలోనే వేయాలని, నానో యూరియా, డిఏపి ఎరువులు వాడాలన్నారు. అలానే గుంటూరు సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎన్.మోహనరావు మాట్లాడుతూ యూరియా, డిఏపి ఎరువులను ఏపీఏ ఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా సరఫరా చేయటం జరుగుతుందని, ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను, రాయితీలను అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయాన్ని చేపట్టాలని తద్వారా మేలైన దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చన్నారు. జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ డి.దీప మాట్లాడుతూ.. రైతులందరూ రసాయనక ఎరువుల్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు వెళ్లాలని తెలుపుతూ రైతులందరూ ఆరోగ్యంగా ఉండాలంటే నూనె వాడకం తగ్గించి కూరగాయలను ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమణ కుమార్, మండల పార్టీ ప్రెసిడెంట్ వలివేటి మురళి, పెదకాకాని శివాలయం చైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ కుక్కల మల్లికార్జునరావు, పెండ్యాల శ్రీకాంత్, శ్రీనివాసరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్,డిజిటలైజేషన్ పై బిఎల్ఓ లతో సమావేశం

తెనాలి మున్సిపాలిటీ జూన్23(ప్రభాతవార్త): ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు మేరకు 91 నియోజకవర్గం తెనాలి అర్బన్ ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ అంశంపై బిఎల్ఓ లకు సమావేశం నిర్వహించారు.



పురపాలకసంఘం పాత కౌన్సిల్ హాలులో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, అసిస్టెంట్ కమీషనర్ జాస్తి రామారావు మరియు మేనేజర్ జయకర్ సమావేశంలో పాల్గొని డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలా చేయాలో వివరించి బిఎల్ఓ లకు తగు సూచనలు సలహాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అందరూ బియల్ఓలు మరియు సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**గ్రీవెన్స్ లో సమస్యకు పరిష్కారం.**

మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు మరియు అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమతి వాణి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఇరుపక్షాల మధ్య దారికి సంబంధించిన ఫిర్యాదు పై ,ఆ సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఇరుపక్షాల సమక్షంలో ఫిర్యాదును పరిశీలించి. ఇరుపక్షాలు సమర్పించిన సంబంధిత పత్రాలను పరిశీలించి, సమస్యపై సమగ్రంగా విచారణ జరిపారు. అనంతరం కమిషనర్ ఇరుపక్షాలతో చర్చించి సమస్యను పరిష్కరించారు.

## మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ ఉల్లంఘించినందుకు,జైలు శిక్ష

తెనాలి మున్సిపాలిటీ జూన్23(ప్రభాతవార్త): తెనాలి రూరల్ మండలం, కొలకలూరు గ్రామానికి చెందిన శుద్ధపల్లి రాజేంద్ర,(30)అనే రౌడీ షీటర్ ను గత సంవత్సరం అక్టోబర్ నెలలోమండల ఎగ్జిక్యూట్ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా అతను ఎలాంటి శాంతి భద్రతలకు విఘాతం కలిగించ కుండా మరియు ఎలాంటి క్రిమినల్ కేసులకు పాల్గొనకుండా సత్ప్రవర్తనతో కలిగి ఉంటానని మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద ఒక లక్ష రూపాయలకు హామీ బాండ్ ఒక సంవత్సర కాలానికి తీసుకుని ఉన్నాడు.




తరువాత కొంతకాలానికి శుద్ధపల్లి రాజేంద్ర, తన భార్య మరియు అత్తగారిపై దాడి చేయగా, తన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి శుద్ధపల్లి రాజేంద్రను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరచగా, మెజిస్ట్రేట్ సుమారు 60 రోజులు రిమాండ్ ఉంచి తదుపరి కండిషన్ బెయిలు ( ప్రతి సోమవారం పోలీస్ స్టేషన్లో కనిపించి సంతకం పెట్టవలెను) పై విడుదల అయినాడు . ప్రస్తుతం సదరు కేసు దర్యాప్తు చేసి కోర్టు నందు చార్జ్ షీట్ ఫైల్ చేసినాము. తదుపరి శుద్ధపల్లి రాజేంద్ర అను అతను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద తీసుకున్న హామీ బాండ్ ఉల్లంఘించి క్రిమినల్ కేసులో పాల్గొనందుకు గాను సదరు రాజేంద్రను గత నెల మండల ఎగ్జిక్యూట్ మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచి హామీ బాండ్ ఉల్లంఘన సంబంధించిన లక్ష రూపాయలు డబ్బులు చెల్లించవలసినదిగా నోటీస్ జారీ చేసి ఉన్నాడు. సదరు నోటీస్ తీసుకున్న తర్వాత కూడా శుద్ధపల్లి రాజేంద్ర, హామీ బాండ్ తాలూకా డబ్బులు చెల్లించ నందున,మంగళవారం రూరల్ పోలీసులు శుద్ధపల్లి రాజేంద్రను మండల ఎగ్జిక్యూట్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా , శుద్ధపల్లి రాజేంద్ర కు 15 రోజులు శిక్ష విధిస్తూ తదుపరి విచారణ జులై 7వ తేదీన తన ముందు హాజరు పలుచవలసిందిగా పోలీసు వారిని ఆదేశాలు జారీ చేసినారు. సదరు రాజేంద్రను 15 రోజులు జైలు శిక్షణ నిమిత్తం గుంటూరు జిల్లా జైలుకి తరలించినామని తెనాలి రూరల్ పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని రౌడీషీటర్లు మరియు శాంతి భద్రతల విషయంలో విఘాతం కలిగించిన వ్యక్తులను, ఇప్పటివరకు మండల ఎగ్జిక్యూట్ వద్ద హాజరు పరిచిన హామీ బాండ్ తీసుకున్న వ్యక్తులందరూ కూడా సమాజంలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎలాంటి క్రిమినల్ నేరాలకు పాల్పడకుండా ఉండాలని తెలియజేస్తున్నామన్నారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తులపై కేసు నమోదు

తెనాలి మున్సిపాలిటీ జూన్23(ప్రభాతవార్త): ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న ముగ్గురు వ్యక్తులపై తినాలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామ వీఆర్వో,కుమార్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుర్రిపాలెం గ్రామానికి చెందిన పరుచూరి నానయ్య, పరుచూరి రవి, అడుసుమల్లి గోపాలరావు, అను ముగ్గురు వ్యక్తులు బుర్రిపాలెం గ్రామం నందు నవరత్నాలు పేదలందరికీ ఇండ్లు అనే పథకం కింద ఉన్న గవర్నమెంట్ భూములను అక్రమంగా ప్రవేశించి తమ పొలాల్లోకి కలుపుకున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని,తెనాలి తాలూకా పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉత్తమ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయం:కొండపల్లి

రేపల్లె, జూన్ 23, ప్రభాతవార్త:ఉత్తమ రెవెన్యూ అధికారిగా జిల్లా స్థాయి ఉన్నతాధికారుల గుర్తింపు పొందిన రేపల్లె తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయమని రేపల్లె చైతన్య వేదిక అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు.మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావును చైతన్యవేదిక ఆధ్వర్యంలో శాలువా,పుష్పగుచ్ఛంతో ఘనంగా



సత్కరించారు.ఈ సందర్భంగా కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరిస్తూ ఉత్తమ సేవలు అందించిన శ్రీనివాసరావు ప్రతిభకు తగిన ఫలితం లభించడం అభినందనీయమన్నారు.భవిష్యత్‌లో రెవెన్యూశాఖ పరంగా ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆయన సూచించారు.రెవెన్యూ శాఖ విధుల నిర్వహణ ద్వారా ప్రజల మన్ననలను పొందుతున్న అధికారి మోర్ల శ్రీనివాసరావు తీరు తెన్నులను గమనించిన ఉన్నతాధికారులు అభినందించి ప్రశంసాపత్రం అందచేయడం మరింత ప్రోత్సాహానికి కారణమవుతుందని కొండపల్లి వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు.తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావును రేపల్లె ప్రెస్ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు వాగోలు బాబూరావు,రాచాబత్తుని శ్రీనివాసరావు,సీనియర్ జర్నలిస్ట్ మొగసాటి సురేంద్ర,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నల్లూరు అజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

24-6Pg5_24-6Pg5.qxd 23/Jun/26 11:16 PM Page 1



# 'కొలీజియం' న్యాయ సమీక్షకు అతీతం



## న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియలో జోక్యంలేదు

## పదోన్నతి కోసం ఎవరిని సిఫార్సు చేయాలో కోర్టులు నిర్దేశించలేవు

## సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పు

**న్యూఢిల్లీ, జూన్ 23:** హైకోర్టు న్యాయమూర్తులను నియమించే కొలీజియం ప్రక్రియను సవాలు చేస్తూ హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఒక న్యాయాధికారి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు నిరాకరించింది. అటువంటి నిర్ణయాలు కొలీజియం 'వ్యక్తిగత సంతృప్తి'పై ఆధారపడి ఉంటాయని, వాటిని న్యాయపరమైన స్థాయిలో కోర్టులు సమీక్షించలేవని పేర్కొంది. ధర్మశాలలోని ఫ్యామిలీ కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరవింద్ మల్హోత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగా రత్న, జయమల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్రంలోని అత్యంత సీనియర్ న్యాయాధికారులలో ఒకరిగా ఉన్నప్పటికీ, హిమా చల్‌ప్రదేశ్ హైకోర్టుకు పదోన్నతి కోసం తన అభ్య ర్థిత్వాన్ని విస్మరించి, తనకంటే జూనియర్ అధి కారులను సిఫార్సు చేశారని మల్హోత్రా వాదిం చారు. పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది బల్బీర్ సింగ్, మల్హోత్రా ఎంపిక ప్రక్రి యలో పాల్గొని అవసరమైన పత్రాలను సమర్పిం చినప్పటికీ, చివరికి సుప్రీంకోర్టు కొలీజియం ఆయన జూనియర్ల పేర్లను ఆమోదించిందని వాదించారు. అయితే, పదోన్నతి కోసం ఎవరిని సిఫార్సు చేయాలో లేదా పరిగణించాలో కొలీజి యంలకు న్యాయస్థానాలు నిర్దేశించలేవని ధర్మా సనం స్పష్టం చేసింది. 'ఇవి అంతిమంగా హైకోర్టు కొలీజియం వ్యక్తిగత సంతృప్తికి సంబంధించిన విషయాలు. న్యాయపరంగా, 'మీరు ఇది చేయండి, అది చేయండి, అతని పేరును పరిగణించండి' అని సుప్రీం కోర్టు కొలీజియంతో చెప్పగలదా? అలా చేయలేము' అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. మల్హోత్రా అభ్యర్థిత్వాన్ని అధికారికంగా తిరస్కరించినట్లు సూచించడానికి ఎటువంటి ఆధారాలు లేవని కూడా కోర్టు పేర్కొంది. పిటిషనర్ పేరు ఇంకా పరిశీలనలో ఉండవచ్చని, కాబట్టి ఆయన వేచి ఉండాలని జస్టిస్ నాగారత్న అన్నారు. కేవలం సీనియారిటీ మాత్రమే పదోన్నతికి హక్కును కల్పిస్తుందన్న వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. సీనియారిటీ ఉన్నంత మాత్రాన ఒక న్యాయాధికారికి సిఫార్సు పొందే అర్హత దానంతట అదే లభించదని పేర్కొంది. కొలీజియం చర్చలు గోప్యమైనవని న్యాయమూర్తులు స్పష్టంచేశారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు కొలీజియం అంతర్గత చర్చలను పరిశీలించడం ద్వారా 'పాండోరా పెట్టెను తెర వడానికి' కోర్టు ఇష్టపడటం లేదని జస్టిస్ నాగరత్న అన్నారు. హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను సుప్రీంకోర్టు కొలీజియం ఇప్పటికే ఆమోదించడం వల్ల, తొలిదశల న్యాయ సమీక్ష కష్టతరంగా మారిందని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. కోర్టు పరిశీలనల తర్వాత, పిటిషనర్ ఆ అభ్యర్థనను ముందుకు తీసుకెళ్లకూడదని నిర్ణయించుకుని, పరిపాలనా పరంగా సమర్థ అధికారి ముందు ఇతర పరిష్కార మార్గాలను అనుసరించడానికి స్వేచ్ఛ కోరారు. సుప్రీంకోర్టు, దావాల యోగ్యతపై ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయకుండానే పిటిషన్‌ను పరిష్కరించింది. న్యాయా ధికారులు చిరాగ్ భాను సింగ్, భూపేష్ శర్మ, యోగేష్ జస్వాల్‌లను హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కోసం సిఫార్సు చేసి, ఆమోదించిన



# అమెరికా పౌరసత్వం ఇక మరింత ఖరీదు!

## దరఖాస్తు ఫీజు 75% పెంపు

**వాషింగ్టన్, జూన్ 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ నిబంధనలను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సి రావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులు కూడా కోల్పోనున్నారు. పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికి వస్తే 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమలులోకి వస్తే.. 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే ఖర్చుల మోత మోగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజులపాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డిహెచ్‌ఎస్ ప్రతిపాదించింది. 400శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్డ్ ఫీజ్ ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# టిఎంసిలో పెరిగిన ఆధిపత్యపోరు



## అసలైన తృణమూల్ కాంగ్రెస్ మాదే: ఇసికి మమత వర్గీయుల లేఖ

## తిరుగుబాటు వర్గం కమిటీ పునర్నియామకం

## చైర్మన్ అరూప్ రాయ్, ఉపాధ్యక్షుడిగా అరూప్ బిస్వాస్

**కోల్‌కతా, జూన్ 23:** తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో ఆధిపత్య పోరు ఉధృతమైంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రీటాబ్రత బెనర్జీ సోమవారం తమదే అసలైన టిఎంసి అంటూ, కొత్త కమిటీని పునర్నియామకం చేయగా, కాదు మాదే అసలైన తృణమూల్ కాంగ్రెస్ అని మమతా బెనర్జీ అనుకూల వర్గం, ఇదే మా పార్టీ అసలైన జాతీయ కార్యవర్గం అని పేర్కొంటూ భారత ఎన్నికల సంఘానికి (ఇసిఐకి) అందిస్తూ లేఖ రాసింది. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీలకు విధేయులైన 'అసలైన కానీ మైనారిటీ' వర్గంగా తమను తాము అభివర్ణించుకున్న ఈ వర్గం, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలోని టిఎంసి శాసన సభ్యుల 'తిరుగుబాటు కానీ మెజారిటీ' వర్గం ప్రకటించిన సమాంతర కమిటీకి ప్రతిగా, తమ జాబితానే 'అసలైన' జాతీయ కార్యవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొంది.

రీటాబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం, మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ ఇద్దరినీ మినహాయించి కొత్త జాతీయ కార్యవర్గాన్ని ఆవిష్కరించిన కొద్దిసే పటికే, సోమవారం రాత్రి ఇసికి ఈ లేఖ పంపి నట్లు వర్గాలు తెలిపాయి. మమతా బెనర్జీ వర్గం సమర్పించిన జాబితాలో, మమతను జాతీయ ఛైర్‌పర్సన్‌గా, సుబ్రతా బక్షి ని జాతీయ ఉపా ధ్యక్షుడిగా, అభిషేక్ బెనర్జీని ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ జాబి తాలో రాజ్యసభ సభ్యులు డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్‌లను సంయుక్త కార్యదర్శులుగా, రాజ్యసభ మాజీ సభ్యుడు సుభాసిష్ చక్రవర్తిని కోశాధికారిగా కూడా చేర్చారు. దీనిపై రీటాబ్రతా బెనర్జీ స్పం దిస్తూ, తనకు ఎలాంటి వ్యాఖ్యలు లేవని, అయితే ఇతర వర్గానికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. సోమవారం సాయంత్రం ప్రకటించిన తిరుగుబాటు వర్గం కమిటీ, మమతా బెనర్జీ స్థానంలో సీనియర్‌శాసనసభ్యుడు, మాజీ మంత్రి అరూప్ రాయ్‌ను ఛైర్‌పర్సన్‌గా నియ మించింది. మాజీ మంత్రి అరూప్ బిస్వాస్‌ను ఉపాధ్యక్షుడిగా, ఎమ్మెల్యేలు ఫిర్హాద్‌హాకీం, రథిన్ ఘోష్‌లను ఉపాధ్యక్షులుగా నియమించారు. రీటాబ్రతా బెనర్జీ, జావేద్ ఖాన్, సందీపన్ సాహా, మరియు సబీనా యాస్మిన్‌లను ప్రధాన కార్యదర్శులుగా నియమించగా, అఖ్రుజ్జమాన్‌ను కోశాధికారిగా నియమించారు. తృణమూల్ కాంగ్రెస్‌లోని 'అసలైనకానీ అల్పసంఖ్యాక' వర్గం, మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలకు తమ విధేయతను కొన సాగిస్తూ, పార్టీ జాతీయకార్యవర్గంవివరాలను తెలియజేస్తూ భారత ఎన్నికల సంఘానికి (ఇసిఐ) ఒక ప్రకటనను పంపింది. తమదే అసలైన తృణ మూల్ కాంగ్రెస్



# ఐడిఎఫ్‌సి స్కామ్‌లో ఐఎఎస్ అధికారి అరెస్టు

**న్యూఢిల్లీ,జూన్ 23:** బ్యాంక్ స్కామ్ రూ. 657 కోట్ల కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఓ ఐఎఎస్ ఆఫీసర్‌ను అరెస్టు చేసింది. 2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ పంకజ్ అగర్వాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అరెస్టు అయిన రెండో ఐఎఎస్ అధికారి ఆయన. ఇదే కేసులో ఇప్పటికే రామ్ కుమార్ సింగ్ అనే ఐఎఎస్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ అధికారులు, ప్రభుత్వ అధికారులతో కలిసి ఓ స్కామ్ చేశారు. హర్యానా ప్రభుత్వానికి చెందిన 8 శాఖల నుంచి, చండీఘడ్ పరిపాలన శాఖకు చెందిన రెండు అకౌంట్ల నుంచి నిధులను మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంక్ నిధులను దుర్వినియోగం చేసిన కేసులో నష్టం 657 కోట్లు ఉంటుందని సీబీఐ పేర్కొన్నది. ఇదే కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా విచారిస్తున్నది. సుమారు 645 కోట్ల కుంభకోణం జరిగినట్లు ఈడీ చెబుతోంది. స్కామ్ జరిగిన సమయంలో అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు పంకజ్ అగర్వాల్ పనిచేశారు. హర్యానా వ్యవసాయ మార్కెటింగ్ బోర్డుకు సంబంధించిన సుమారు 10 కోట్లు చండీఘడ్‌లోని ఐడీఎఫ్ ఫస్ట్ బ్యాంక్ నుంచి మాయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అగ్రికల్చర్ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఫండ్ పేరుతో ఖాతానిర్వహించినట్లు తెలుస్తోంది. ఎస్ఆర్ఆర్ ప్లానింగ్ గురుస్ లిమిటెడ్ సంస్థకు 9.75 కోట్లు, మన్నత్ కాంట్రాక్టర్స్‌కు 25 లక్షలు చెల్లించారు. కానీ షెల్ కంపెనీలకు నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంక్ కుంభకోణంలో మొత్తం 8మంది ఐఎఎస్ ఆఫీసర్లపై నిఘా పెట్టారు. దీంట్లో ఇద్దర్ని అరెస్టు చేశారు. మొహమ్మద్ షాయిన్, మణి రామ్ శర్మ, ప్రదీప్ కుమార్, వినీత్ గార్గ్, సాకేత్ కుమార్, డీకే బెహరా ఉన్నారు. హర్యానా స్కూల్ శిక్షా పరియోజనా పరిషద్‌కు సెక్రటరీగా ఉన్న సమయంలో విద్యాశాఖ అకౌంట్ నుంచి సుమారు 50కోట్లు దారి మళ్లించినట్లు పంకజ్ అగర్వాల్‌పై ఆరోపణ ఉన్నది. ఫైనాన్స్ శాఖ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా అకౌంట్లను ఓపెన్ చేసి నిధులను మళ్లించినట్లు పంకజ్‌పై ఆరోపణలు ఉన్నాయి.

# పుణేలో వ్యాపారి ఆఫీసు వద్ద కాల్పులు

## లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పనే



**ముంబై, జూన్ 23:** మహారాష్ట్ర, పుణేలోని ఒక వ్యాపారి ఆఫీసు వద్ద కాల్పులు కలకలం సృష్టించాయి. సోమవారం రాత్రి పుణేలోని హెచ్ వికాస్ స్టీల్ సంస్థ ఆఫీసు వద్ద ఈ ఘటన జరిగింది. ఈ ఘటనకు పాల్పడింది లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అని తెలుస్తోంది. పుణేలోని అమూల్ చమారియా, సన్నీ చమారియా అనే ఇద్దరు వ్యాపారులు లక్ష్యంగా ఈ దాడి తెలుస్తోంది. రాత్రి పూట ముసుగు ధరించిన దుండగులు.. పిస్టోల్‌తో ఆఫీసు సమీపంలో కాల్పులు జరిపారు. చుట్టుపక్కల, గోడలపై కాల్పులు జరిపి వెళ్లిపోయారు. దీనికి సంబంధించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ తరఫున అర్జూ బిష్ణోయ్ శుభమ్ లోంకర్ పేరుతో ఉన్న ఒక అకౌంట్ నుంచి ప్రకటన వెలువడింది. తామే ఈ కాల్పులకు పాల్పడినట్లు వెల్లడించారు. వ్యాపారులిద్దరూ చాలా మందిని మోసం చేసి, మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు వారు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై తమ గ్యాంగ్ ఫోన్ చేసి హెచ్చరిస్తుంటే, వారు తమను పట్టించుకోలేదని, అందుకే ఈ కాల్పులు చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తమ కాల్స్‌కు స్పందించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈసారి బుల్లెట్లు గోడను తాకాయని, తాము చెప్పినట్లు వినకుంటే భవిష్యతులో వారి ఛాతిలో దిగుతాయని సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. దీనికి సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే, కాల్పులకు సంబంధించిన విడియోను కూడా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ కాల్పుల ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. సోషల్ మీడియా పోస్టుతోపాటు, విడియోపైనా ఆరా తీసుకున్నారు. నిందితులను గుర్తించే పనిలో పోలీసులున్నారు. ఇటీవలి కాలంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పలుసార్లు దాడులకు పాల్పడింది. సెలబ్రిటీలతోపాటు అనేకమంది వ్యాపారుల ఇళ్ల వద్ద కాల్పులు జరుపుతోంది.

# సమాచారహక్కు చట్టం మార్పులపై అన్నా హజారే ధ్వజం



**ముంబయి, జూన్ 23:** మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలతీసుకొచ్చిన సమాచార హక్కు (ఆర్టీఐ)నిబంధనల సవరణలను వెంటనే రద్దు చేయాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే డిమాండ్‌చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాసిన హజారే ఈనెల12న తీసుకొచ్చిన మహారాష్ట్ర ఆర్టీఐ రూల్స్-2026, సమాచార హక్కుచట్టం స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కొత్త నిబంధనలవల్ల ఆర్టీఐ చట్టం లక్ష్యం నీరుగారి, ప్రజలకు సమాచారం అందడం మరింత కష్టమవుతుందని విమర్శించారు. ఆర్టీఐ దరఖాస్తుల ఫీజులను పెంచడాన్నీ హజారే తీవ్రంగా వ్యతిరేకించారు. 20ఏళ్ల తర్వాత ఫీజులు పెంచితే, సమాచారమివ్వకుండా ఆలస్యంచేసే అధికారులపై జరిమానాలను పెంచాలని సూచించారు.

# 'వికసిత్ భారత్'లో ఐఎఎస్‌లు కీలకం



2024 బ్యాచ్ ఐఎఎస్ ట్రైనీలతో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 23:** వికసిత భారత్2047 లక్ష్య సాధనలో యువ సివిల్ సర్వెంట్లు కీలక పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. దేశ నిర్మాణానికి అంకితభావంతో పనిచేయాలని, పదవుల కంటే ప్రజలకు అందించిన ఫలితాల ద్వారానే సంతృప్తి పొందాలని ఆయన సూచించారు. మంగళవారం సేవా తీర్థ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2024 బ్యాచ్‌కు చెందిన 183 మంది ఐఎఎస్ అధికారి శిక్షణార్థులతో ప్రధాని మోడీ సంభాషించారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో అసిస్టెంట్ సెక్రటరీలుగా పనిచేస్తున్న ఈ యువ అధికారులు తమ శక్తి, ప్రతిభ, అంకితభావంతో భారత అభివృద్ధి ప్రయాణాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఫీల్డ్ ట్రైనింగ్, మంత్రిత్వ శాఖల్లో అనుబంధ సేవల సమయంలో పొందిన అనుభవాలను అధికారులు ప్రధానమంత్రితో పంచుకున్నారు. రెండేళ్ల పరిపాలనా శిక్షణ, క్షేత్రస్థాయి అనుభవం అనంతరం వారు అత్యంత కీలక దశలో ఉన్నారని, ఇకపై వారి నిర్ణయాలు కేవలం వారి కెరీర్‌ను మాత్రమే కాకుండా కోట్లాది ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని పేర్కొన్నారు. ప్రజాసేవలో నిజమైన పరీక్ష వాస్తవ జీవిత పరిస్థితులను నిజాయితీ, సున్నితత్వం, నిబద్ధతతో ఎదుర్కోనడంలోనే ఉందని మోడీ అన్నారు. దేశ నిర్మాణంలో స్పష్టమైన లక్ష్యంతో, వినూత్న ఆలోచనలతో, పౌరుల కేంద్రిత పరిపాలనతో ముందుకు సాగాలని యువ అధికారులకు సూచించారు. ప్రతి పరిపాలనా ఫైల్ వెనుక ప్రజల ఆశలు, ఆందోళనలు, జీవితాలు దాగి ఉంటాయని గుర్తుంచుకోవాలని ఆయన చెప్పారు. నాగరిక్ దేవో భవ మంత్రాన్ని ఆచరిస్తూ ప్రతి నిర్ణయంలో పౌరులను కేంద్రంగా ఉం చాలని, పరిపాలన సానుభూతితో, స్పందనాత్మ కంగా, సమగ్రంగా ఉండేలా చూడాలని పిలుపు నిచ్చారు. అభివృద్ధి సవాళ్లను ఒక్కో శాఖ విడి విడిగా పరిష్కరించలేదని, శాఖల మధ్య సమన్వయం ద్వారానే స్థిరమైన ఫలితాలు సాధ్యమవుతాయని ప్రధాని పేర్కొన్నారు. వికసిత భారత్2047 దిశగా రాబోయే దశాబ్దాల్లో తీసుకునే ప్రతి విధాన నిర్ణయం, పరిపాలనా చర్య దేశ అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా, తయారీ రంగ వృద్ధి, ఇంధన భద్రత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన ప్రస్తుతం దేశ ప్రాధాన్యతలుగా ఉన్నాయని ఆయన వివరించారు. గత దశాబ్దంలో పరిపాలన విధానంలో గణనీయమైన మార్పు వచ్చిందని, ప్రక్రియల ఆధారిత విధానం నుంచి ఫలితాల ఆధారిత పరిపాలన వైపు దేశం అడుగులు వేసిందని మోడీ పేర్కొన్నారు. డిజిటల్ గవర్నెన్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), సాంకేతికత సేవల అందుబాటును, పారదర్శకతను పెంచుతున్నాయని చెప్పారు. డేటాను కేవలం సంఖ్యలుగా కాకుండా కోట్లాది ప్రజల జీవితాలు, సమస్యలు, ఆశయాలకు ప్రతిబింబంగా చూడాలని ఆయన సూచించారు. ప్రభుత్వ విధానాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని అధికారులకు సూచించారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర రోజురోజుకూ పెరుగుతోందని, ప్రస్తుత ఐఎఎస్ బ్యాచ్‌లో 40 శాతానికి పైగా మహిళా అధికారులు ఉండటం విశేషమని ప్రధాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి జితేందర్‌సింగ్, ప్రధానమంత్రికి ప్రధాన కార్యదర్శి పి.కె. మిశ్రా, ప్రధాన కార్యదర్శి2 శక్తికాంత దాస్, కేబినెట్ కార్యదర్శి టి.వి. సోమనాథన్, డీఓపీటీ కార్యదర్శి రచనా షా, లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ అకాడమీ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


# ఇజ్రాయెల్ లెబనాన్‌ల మధ్య మరోసారి శాంతిచర్చలు

## వాషింగ్టన్‌లో భేటీ..!

**వాషింగ్టన్,జూన్ 23:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను అదుపులోకి తెచ్చి శాశ్వత శాంతిని నెలకొల్పేందుకు అగ్రరాజ్యం అమెరికా మరో ముందడుగు వేసింది. ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల మధ్య అత్యంత సున్నితంగా మారిన సరిహద్దు వివాదాలు, కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరింత బలోపేతం చేయడం కోసం వాషింగ్టన్ డీసీలోని స్టేట్ డిపార్ట్‌మెంట్ వేదికగా దౌత్యపరమైన చర్చలు ప్రారంభమయ్యాయి. అమెరికా మధ్యవర్తిత్వంలో జరుగుతున్న ఈ ఐదో విడత నేరుగా జరిగే ద్వైపాక్షిక చర్చలలో ఇరు దేశాల రాయబారులు, ఉన్నతాధికారుల బృందాలు పాల్గొంటున్నాయి. గతంలో జరిగిన నాలుగు విడతల చర్చల ఫలితంగా కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను ఇరుపక్షాలు గౌరవించేలా చేయడం, అలాగే ప్రాంతీయ స్థిరత్వాన్ని సాధించడం ఈ మూడు రోజుల సమావేశాల ముఖ్య ఉద్దేశం. ఈ ప్రతిష్ఠాత్మక చర్చల్లో భాగంగా ముఖ్యంగా దక్షిణ లెబనాన్ సరిహద్దు ప్రాంతాల నుంచి ఇరు దేశాల సైన్యాల ఉపసంహరణ, హిజ్బుల్లా సాయుధ బలగాలను పూర్తిగా నిరాయుధులను చేయడం వంటి అత్యంతకఠినమైన భద్రతా నిబంధనలపై ఇరు పక్షాలు చర్చిస్తున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ సరిహద్దుల్లో తమ పౌరుల భద్రతకు ముప్పుగా మారిన హిజ్బుల్లా సైనికసామర్థ్యాలను పూర్తిగా తుడి చిపెట్టడమే తమ ప్రథమప్రాధాన్యతని స్పష్టం చేశారు.

# పుణే టెక్కీది ప్రమాద మృతి కాదు..హత్యే

## మరింత లోతుగా పోలీసుల దర్యాప్తు



**పుణె,జూన్ 23:** మహారాష్ట్రలోని పుణె సమీపంలోని లోహగడ్ కోట వద్ద జూన్ 19న 26 ఏళ్ల కేతన్ అగర్వాల్ లోయలో పడి మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే తొలుత ఫొటోలు తీస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడ్డాడని పోలీసులు భావించారు. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగా నమోదు చేసిన కేసును పోలీసులు హత్య కోణంలో విచారిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం కేతన్‌తో నిశ్చితార్థం అయిన సియా గోయల్‌కు చేతన్ చౌదరి అనే యువకుడితో పరిచయం ఉన్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల నిర్ణయంతో కేతన్‌తో పెళ్లికి అంగీకరించిన సియా తమ సంబంధానికి అతడు అడ్డుగా ఉన్నాడని భావించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేతన్‌ను తొలగించేందుకు ఇద్దరూ కలిసి పథకం రచించి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈనెల 14న కూడా లోహగడ్ కోట వద్ద కేతన్‌ను హత్య చేసేందుకు ప్రయత్నం జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. పాము కనిపించినట్లు భయపెట్టి లోయలోకి నెట్టేయాలనే ప్రయత్నం విఫలమైనట్లు అనుమానిస్తున్నారు. అనంతరం జూన్ 19న సియా పుట్టినరోజు సందర్భంగా మరోసారి కోటకు వెళ్లేలా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్ పేరుతో కేతన్‌ను కోటకు తీసుకెళ్లిన తర్వాత అక్కడకు చేతన్ కూడా చేరుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. ఆ సమయంలో కేతన్ సుమారు 350 అడుగుల లోతైన లోయలో పడిపోవడంతో మృతిచెందాడు. ఇది ప్రమాదం కాదని, ముందస్తు ప్రణాళికలో భాగంగా జరిగి ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. కేసు దిశను మార్చిన అంశం డిజిటల్ ఆధారాలేనని పోలీసులు చెబుతున్నారు. విచారణ సమయంలో సియా కొన్ని విషయాలను దాచిపెట్టినట్లు అనుమానం రావడంతో ఆమె మొబైల్ ఫోన్ రికార్డులు, సోషల్ మీడియా, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. వాటి ఆధారంగా హత్య కోణంలో దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

# స్టాలిన్‌ను అనుకరించిన విజయ్, సభనుంచి వాకౌట్ చేసిన డిఎంకె



**చెన్నై,జూన్ 23:** తమిళనాడు శాసనసభ మంగళవారం నాటి సమావేశాల్లో తీవ్ర వాదోపవాదాలు, నాటకీయ పరిణామాల మధ్య అటుడికింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష డీఎంకే మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచింది. ముఖ్యమంత్రి ప్రసంగానికి నిరసనగా డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, డీఎంకే పార్టీ పేరుతో అక్రమంగా నిధులు సేకరిస్తోందని ఆరోపించడంతో పాటు, అవినీతికి పాల్పడిన వారిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల గురించి ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనల్లో వాస్తవం లేదని, అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన విమర్శించారు. విజయ్ ప్రసంగానికి డీఎంకే సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. స్పీకర్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ, డీఎంకే సభ్యులు నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇదే సమయంలో విజయ్ తన ప్రసంగంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను అనుకరించడం అందరి దృష్టిని ఆకర్షించింది. గతంలో సీట్ల పంపకాల చర్చల సందర్భంగా అంతా సెటిల్ అయిపోయింది అనేలా స్టాలిన్ ప్రదర్శించిన మ్యానరిజంను విజయ్ అసెంబ్లీలో అనుకరించి చూపించారు. దాంతో అధికార పక్ష సభ్యుల చప్పట్లతో సభ హోరెత్తింది. తమ ప్రభుత్వం సీపీఎం, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలతో పొత్తు పెట్టుకోవడాన్ని ఈ సందర్భంగా విజయ్ సమర్థించుకున్నారు. మహిళల భద్రతతోపాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# సంక్షిప్త వార్తలు

## టెలిగ్రాం యాప్‌పై నిషేధం ఎత్తివేత..



**న్యూఢిల్లీ,జూన్ 23:** నీట్ యూజీ 2026 రీఎగ్జామినేషన్ నేపథ్యంలో భారత్‌లో తాత్కాలికంగా నిలిపివేసిన టెలిగ్రామ్ సేవలను మళ్లీ పునరుద్ధరించారు. వారంపాటు నిషేధం అనంతరం మంగళవారం నుంచి గూగుల్ ప్లేస్టోర్‌లో టెలిగ్రామ్ యాప్ తిరిగి అందుబాటులోకి వచ్చింది. నీట్ యూజీ రీఎగ్జామ్‌ను లక్ష్యంగా చేసుకొని కొందరు చీటింగ్ ముఠాలు టెలిగ్రామ్‌ను ఉపయోగించి అభ్యర్థులను మోసం చేస్తున్నారనే ఆరోపణలతో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) కేంద్రప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కేంద్రం ఈ నెల 16నుంచి 22 వరకు టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా నిషేధించింది. అయితే టెలిగ్రామ్‌లో సందేశాలనుసవరించే (మెసేజ్‌ఎడిట్)ఫీచర్‌పై విధించిన ఆంక్షలు ఈనెల 30వరకు కొనసాగనున్నాయి.

## రాయల్ సర్జన్స్ కళాశాలలో సుశ్రుతుడి కాంస్యవిగ్రహం



**ఎడింబర్గ్,జూన్ 23:** ఆధునిక వైద్యశాస్త్రం ఇంకా అభివృద్ధి చెందని కాలంలోనే భారతీయ వైద్యుడు సుశ్రుతుడు విశేష కృషి చేశాడు. 2,600 ఏళ్ల క్రితమే 1,120వ్యాధులను నమోదు చేశాడు. 700కుపైగా ఔషధ మొక్కలు, 300కు పైగా వైద్య విధానాలు, 120శస్త్రచికిత్స పరికరాల వివరాలను లిఖితపూర్వకంగా భద్రపరిచాడు. ఇప్పుడు ఆయనకు స్కాట్లాండ్‌లో అరుదైన గౌరవం దక్కింది. స్కాట్లాండ్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బర్గ్ సుశ్రుతుడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించింది. శస్త్రచికిత్స రంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని ప్రకటించింది.

## లక్నో ప్రమాద భవనం కూల్చివేయాలని నోటీసులు



**లక్నో,జూన్ 23:** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో భవన నిర్మాణం నిబంధనలు ఉల్లంఘనలు మరియు నియంత్రణ వైఫల్యాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అక్రమ నిర్మాణం కారణంగా ఈ భవనాన్ని కూల్చివేయాలని 2016 మే 10న లక్నో డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాలు జారీచేసింది. అయితే, కేవలం రెండు నెలల వ్యవధిలోనే, అంటే అదే ఏడాది జులై 5న ఆ ఆదేశాలను అధికారులు రద్దుచేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సరైన విచారణ జరపకుండానే నోటీసులు ఇచ్చారని, భవన నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని అప్పటి యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేయడంతో, ఆ కూల్చి వేత ఆదేశాలు రద్దయ్యాయి.



## గ్వాటెమాలాలో బద్దలైన అగ్నిపర్వతం

**గ్వాటెమాలాసిటీ,జూన్ 23:** మధ్య అమెరికా లోని గ్వాటెమాలాలో వోల్కన్ డీ ఫ్యూగో అగ్నిపర్వతం బద్దలైంది. దాంతో అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగజిమ్మాయి. ఏకంగా 33 వేల అడుగుల ఎత్తు పొగలు విరజిమ్మాయి. అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగజిమ్మి, మండుతున్న రాళ్లు బుల్లెట్లలా దూసుకొచ్చాయి. దాంతో ఆ పర్వత పరిసరాల్లో ఉన్న పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఈ హఠాత్పరిణామానికి సైతం పరుగందుకున్నారు. అగ్నిపర్వతం చుట్టూ శిథిలాలు పడుతుండగా పర్వతారోహకులు అగ్నిపర్వత మార్గా ల వెంట పరుగెత్తుతుండటం కనిపించిందని స్థానికులు చెబుతున్నారు.

## పదేళ్ల బాలికపై ఆటోడ్రైవర్ హత్యాచారం..



**న్యూఢిల్లీ,జూన్ 23:** దేశ రాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. పదేళ్ల బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, అనంతరం హత్య చేశాడు ఒక క్యాబ్ డ్రైవర్. ఆ తర్వాత ఆ బాలికను అడవుల్లో పారేశాడు. ఈఘటన దక్షిణ ఢిల్లీ పరిధిలోని సీడీఆర్ చౌక్ ఏరియా సమీపంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఢిల్లీ, సీడీఆర్ చౌక్ సమీపంలో పదేళ్ల బాలిక కుటుంబంతో కలిసి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుండగా సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో బబ్లూ అనే క్యాబ్ డ్రైవర్ ఆ బాలికను ఎత్తుకెళ్లాడు. తన కార్‌లో బలవంతంగా ఎక్కించుకుని గుర్గావ్ (గురుగ్రామ్) ప్రాంతంలోకి ఎక్కించుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేశాడు. అనంతరం ఆ బాలికవల్ల ఎక్కడ నిజం బయటపడుతుందో అని భావించిన బబ్లూ ఆ బాలికను చంపేశాడు.

# స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు 'బంగారు'బాట



కర్నూలు జిల్లా జొన్నగిరి బంగారు గని ప్రాంతం

- దేశంలోనే ఏకైక ప్రైవేట్ రంగ బంగారు గని జొన్నగిరి
- మరిన్ని గోల్డ్ బ్లాక్‌ల వేలానికి సిద్ధం
- బంగారు వనరుల పెట్టుబడులతో ఉపాధికి ఆంధ్రప్రదేశ్ కేంద్రబిందువు

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా ఖనిజ సంపద ఆధారిత ఆర్థికాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాంతంలో ఈ నెల 24న సిఎం చంద్రబాబు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ, 'దేశంలో అత్యంత ఆశాజనకమైన బంగారు ఖనిజ వనరులు ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. శాస్త్రీయ అన్వేషణ, పారదర్శక వేలం విధానం, సుస్థిర మైనింగ్ విధానాల ద్వారా ఈ సంపదను ప్రజల అభివృద్ధికి వినియోగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో బంగారు వనరులు ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికీకరణ, ఉపాధి కల్పనకు కీలక పాత్ర పోషిస్తాయి' అని తెలిపారు. కర్నూలు జిల్లా జొన్నగిరి బంగారు గనిలో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కావడం, రాష్ట్రంలోని పలు బంగారు ఖనిజ బ్లాక్‌ల వేలం, నూతన అన్వేషణలకు సిద్ధం చేయడం ద్వారా దేశ బంగారు గనుల రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక స్థానాన్ని సంపాదిం చుకునే దిశగా ముందుకు సాగుతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని 597.82 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రస్తుతం దేశంలో స్వాతంత్రం తర్వాత ప్రారంభమైన తొలి, ఏకైక ప్రైవేట్ రంగ బంగారు గనిగా నిలిచింది. జియోమైసోర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్టులో రూ.405 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టగా, 2026 మే నెలలో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైంది. ప్రస్తుతం 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి పొందుతుండగా, వారిలో 80శాతానికి పైగా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే ఉన్నారు.

ఈ గని ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరం లో సుమారు 400 కిలోల బంగారం ఉత్పత్తి అవుతుందని అంచనా. రానున్న సంవత్సరాల్లో ఇది ఏడాదికి ఒక టన్ను సామర్థ్యానికి, అనంతరం రెండు టన్నుల వరకు పెరిగే అవకాశం ఉంది. రాయల్టీలు, జిల్లా ఖనిజ ఫౌండేషన్ నిధులు తదితర మార్గాల ద్వారా రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం సమకూరనుంది. జొన్నగిరితో పాటు చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో కూడా విస్తారమైన బంగారు ఖనిజ నిల్వలు గుర్తించబడ్డాయి. చిత్తూరు జిల్లా కుప్పం మండలంలోని చిగురుగుంట- బిసానత్తం గోల్డ్ బ్లాక్‌లలో సుమారు 22 లక్షల టన్నుల ఖనిజ వనరులు, టన్నుకు సగటున 5.64 గ్రాముల బంగారం నిల్వలు ఉన్నట్లు అంచనా. దేశంలో అత్యంత ఆశాజనక బంగారు బ్లాక్‌లలో ఒకటిగా భావిస్తున్న ఈ బ్లాక్‌ను తాజాగా వేలానికి తీసుకువచ్చారు.

అనంతపురం జిల్లాలోని బోక్సంపల్లి ఉత్తర, దక్షిణ బ్లాక్‌లు, రామగిరి ఉత్తర, దక్షి ణ బ్లాక్‌లు, అలాగే జవకుల గోల్డ్ బ్లాక్‌లు రామగిరి, వెలిగల్లు గ్రీన్‌స్టోన్ బెల్ట్‌ల పరిధిలో ఉన్నాయి. ఈ ప్రాంతాలు చారిత్రాత్మక కోలార్, హుట్టి బంగారు గనుల ప్రాంతాలతో సమానమైన భౌగోళిక లక్షణాలను కలిగి ఉండటంతో భవిష్యత్తులో భారీ బంగారు నిల్వలు వెలికితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ బ్లాక్‌లలో వాణిజ్యపరంగా ఉపయోగపడే నిల్వలను గుర్తించేందుకు భారత భూగర్భ సర్వే సంస్థ, నోటిఫైడ్ ప్రైవేట్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీల ద్వారా విస్తృత స్థాయిలో అన్వేషణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

అనంతరం వీటిని పారదర్శక వేలం ప్రక్రియ ద్వారా ప్రైవేట్ పెట్టుబడిదారులకు అందించనున్నారు.

## శ్రీకాళహస్తిలో సిఎం సభకు ముమ్మర ఏర్పాట్లు



అధికారులతో కలసి ముఖ్యమంత్రి బహిరంగ సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జులైన నిర్వహించే గ్రామీణ ప్రాంతాల ఉపాధి, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'విబిజి రామ్ జి పథకం' ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకారం చుట్టడానికి ప్రభుత్వం తిరుపతి జిల్లాను ఎంపిక చేసింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, బిజెపి నాయకులు హాజరుకానున్నారు. ఈ సభను నగరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వారం రోజులుగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వివిధ స్థలాలను తనిఖీ చేసారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట, అలాగే ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లోని పలు ప్రాంతాల్లో పరిశీలించారు. మంగళవారం శాసనసభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డి సారథ్యంలో ఆయన అనుచరులతో కలసి ఏర్పేడు మండలం లోని చింతల పాళెం, అలాగే శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు పరిసరాల్లో సభా వేదిక ఏర్పాటును పరిశీలించారు. నగరి నియోజకవర్గంలోని నారాయణవనంను కూడా జిల్లా అధికారులు పరిశీలించారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డితోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు, సీనియర్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుకు 'భారత్ రైజింగ్ ఇన్ ది మోడీ ఎరా' పుస్తకం బహూకరణ



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** డాక్టర్ దిలీప్ కిలారు తాను రచించిన 'భారత్ రైజింగ్ ఇన్ ది మోడీ ఎరా' పుస్తకాన్ని సిఎం చంద్రబాబు నాయుడుకు బహూ కరించారు. ఈ మేరకు సచివాల యంలోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రిని కలిసి పుస్తక ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకంలోని అంశాలను పరిశీలించిన సిఎం చంద్రబాబు , వినూత్నమైన అంశంపై రూపొందిం చిన ఈ గ్రంథం ఎంతో విలువైందని పేర్కొంటూ రచయిత కృషిని అభినందించారు. పుస్తక రచనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులోనూ ఇలాంటి సృజనాత్మక రచనలు చేయాలని కాంక్షించారు. ఈ పుస్తకాన్ని ఇటీవల కేంద్ర గనుల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎపి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవిష్కరించారు. 110 కేంద్ర పథకాలతో ఉండే ఓ మంచి బుక్‌ను దిలీప్ రచించారని సత్యకుమార్ ప్రశంసించారు. జీవన ప్రమాణాలు పెంపొందిచాలని, కేంద్ర పథకాలపై పేదలకు అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో దీనిని రచించారని కొనియాడారు. గత 12 ఏళ్లలో వచ్చిన క్వాలిటీ, క్వాంటిటేటివ్ అంశాలను ప్రస్తావిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లే మంచి ప్రయత్నం చేశారని వ్యాఖ్యానించారు సత్యకుమార్. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై రచయితను అభినందించారు.


## పర్యాటక రంగ అభివృద్ధి పరుగులు

- ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో పర్యాటక రంగం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, ఓర్వలేక వైసిపి తప్పుడు ప్రచారానికి తెరలేపిందని ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) చైర్మన్, టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు నూకసాని బాలాజీ ఆరోపించారు. మంగళవారం బాలాజీ మీడియా సమావేశం నిర్వహించారు. 'ప్రజావేదిక కూల్చివేతతోనే తన విధ్వంసకర పాలన ఎలా ఉంటుందో జగన్ చెప్పకనే చెప్పారు. రోజుకు రూ.2 లక్షల ఆదాయం తెచ్చే రుషికొండ పర్యాటక కేంద్రాన్ని ధ్వంసం చేసి, తన విలాసాల కోసం రూ.500 కోట్లతో ప్యాలెస్ నిర్మించుకున్నారు. రెండేళ్లయినా ఆ భవనాలను వినియోగించుకోలేని దుస్థితి. రూ.28 వేల కోట్ల పెట్టుబడులు తెస్తానని చెప్పి, ఒక్క ఉద్యోగం కూడా సృష్టించలేదు. టూరిజం కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, ఆస్తులను సొంత అనుచరులకు కట్టబెట్టారు. రాష్ట్రాన్ని గంజాయికి హబ్‌గా మార్చి, యువతను నేరాల వైపు మళ్లించారు' అని బాలాజీ తీవ్ర ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24 నెలల్లోనే పర్యాటక రంగంలో రూ.19,400 కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని తెలిపారు. విశాఖలో జరిగిన సిఐఐ సమ్మిట్ ద్వారా వచ్చిన ఈ పెట్టుబడులతో 91,960 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటికే 18 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,376 కోట్ల పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. పర్యాటకుల ఆకాంక్షలకు అనుగుణంగా గోవా తరహాలో విశాఖ, సూర్యలంకలో బీచ్ షాక్స్ పాలసీ తీసుకొస్తే, దానిపైనా విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు నూతన పర్యాటక విధానం 2024-29 అమలు చేస్తున్నామని, 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామని బాలాజీ వివరించారు. కేంద్రం సహకారంతో రూ.441 కోట్లతో టెంపుల్, బీచ్ టూరిజం అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమరావతిలో 'అవకాయ ఫెస్టివల్' వంటివి నిర్వహిస్తూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తున్నామని తెలిపారు. అరకు కాఫీ స్టాళ్లు, 14 చోట్ల ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు, టెంట్ సిటీస్, కొత్తగా 10 రోప్‌వేల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 20 బీచ్‌లకు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు సాధించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలిచ్చిన తీర్పునకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎపిని దేశంలోనే అగ్రగామి పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని బాలాజీ పేర్కొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై ఉద్యమమే: ఎపిజెఎసి



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు మధ్యంతర భృతి (ఐఆర్), 12వ పిఆర్సీ కమిషనర్ నియామకం, పెండింగ్ డిఎల విడుదల తదితర సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా ఉద్యమానికి సిద్ధం కావాలని జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, ప్రధానంగా ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేనందున ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్‌లో ఉద్యమం చేపట్టాలని, అవసరమైతే ఐక్య ఉద్యమ కార్యాచరణకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారం, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు దశలవారీ ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. జులై 12న శ్రీకాకుళం, 21న అనంతపురంలో ఉద్యమ సన్నద్ధం సభలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించామని, తదుపరి ఏలూరు, గుంటూరులో కూడా సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాని పక్షంలోరాష్ట్ర స్థాయి ఉద్యమ కార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించి "ప్రత్యక్ష ఉద్యమ కార్యచరణను" ప్రకటిస్తామని జెఎసి ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, అసోషియేట్ చైర్మన్, పోరాట కమిటి చైర్మన్ టి.వి.ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావులు ఈ సందర్భంగా ప్రకటించారు.

## తిరుమల సమాచారం



### ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని వడమాలపేట మండలం అప్పలాయగుంటలో కొలువైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందుగా మంగళవారం ఉదయం పవిత్రమైన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. నేటి నుండి జులై 3వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక శోభను మరింత పెంపొందించే ఈ కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, అర్చన అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఆలయ గర్భగుడి, ప్రాకారాలు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షి ంచారు. ఈ పవిత్ర కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సుగంధాలతో పరి మళించి, భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతూ నేటి రాత్రి 7.30 గంటలకు అంకురార్పణం నిర్వహించనున్నారు. 25న ధ్వజారోహణం తో సకల దేవతలను ఆహ్వానిస్తూ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమ వుతాయి. ఉత్సవాల్లో భాగంగా జూన్ 28న ఆర్జిత కల్యాణోత్సవం, జూన్ 29న గరుడసేవ, జులై 2న రథోత్సవం, జులై 3న చక్రస్నానం, ధ్వజావరోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రసన్న వేంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలను పొందాలని టిటిడి కోరింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, ఎఇఒ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ



### ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన కల్లా సత్య రిషబ్ శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.10,01,116లు విరాళంగా అందించారు. తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు.

## అటు నకిలీ లేఖలు ఇటు దళారులు

- టిటిడిని కలవరపెడుతున్న మోసగాళ్లు



**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందువుల ఆరాధ్యదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి సామాన్య భక్తులను ఎరగాచేసుకుని దళారులు, మోసగాళ్ళు పలు రకాలుగా మాయమాటలతో నమ్మించి దండుకుంటున్న ఘటనలు లెక్కలేనంతగా సాగిపోతున్నాయి. ఓ వైపు నకిలీ సిఫార్సు లేఖలు, కలర్ జిరాక్స్ చేసిన దర్శన టిక్కెట్లు పెద్దసంఖ్యలో భక్తులు తీసుకువచ్చేస్తుండగా మరోవైపు దళారులు సులభంగా డబ్బు సంపాదనకు అలవాటుపడి ఏకంగా టిటిడి ఉద్యోగుల అవతారం ఎత్తి వారిపేరుతో నకిలీ సిఫార్సు లేఖలు సృష్టించి యధేచ్ఛగా భక్తులను మోసం చేస్తున్నారు. ప్రతినెలా ఇలాంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయి. పట్టుబడితేనే దొంగలు లేకుంటే యధేచ్ఛగా దొరల అవతారంతో జేబులు నింపుకుంటున్నారు. దీని వెనుక టిటిడిలో కొందరు ఉద్యోగుల, కాంట్రాక్ట్ సిబ్బంది హస్తం కూడా ఉందనేది గుప్పుమంటోంది. తాజాగా గుంటూరు, హైదరాబాద్, కర్ణాటకకు చెందిన కొందరు భక్తులను దళారి నిమ్మల శ్రీనివాస్ సులభంగా నమ్మించి టిటిడి ఉద్యోగుల లేఖలపై శ్రీవారి సుప్రభాతసేవ దర్శన టిక్కెట్లు ఇప్పిస్తామని నమ్మించి 60మంది భక్తుల నుండి ఫోన్ పే ద్వారా రూ.3.60లక్షలు నగదు రాబట్టుకున్నాడు. సోమవారం తిరుమలకు వచ్చిన భక్తులు తమకు కనీసం ఎలాంటి సమాచారం లేదని, ఫోన్ కూడా తీయడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. భక్తులు తీసుకు వచ్చినవి నకిలీ లేఖలుగా తేలడంతో ఈ గుట్టురట్టయ్యింది. ఆ సమయంలో టిటిడి ఉద్యోగులు వారికి సహకరించలేక పోవడంతోనే ఇలా జరిగిందనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికే తిరుమలలో దళారీ వ్యవస్థ వేళ్ళూనుకుని తిరుమల పవిత్రతను దెబ్బతీశారనే కోణంలో టిటిడి కఠినంగా వ్యవహరిస్తోంది. చాలావరకు దళారులు, మధ్యవర్తుల ఆగడాలు తగ్గినా ఇంకా పదుల సంఖ్యలో దళారులు వ్యాపారాలు చేస్తుండటం మాత్రం టిటిడిని కలవర పెడుతోంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో వ్యవస్థలో కీలక ప్రక్షాళన చేపడతారా అనే ప్రశ్నలకు టిటిడి ఉద్యోగుల్లో అవుననే సమాధానం వినిపిస్తోంది. అంతేగాక దేవదేవుని పవిత్రతను దెబ్బతీసిన, పలు రకాలుగా వడ్డీకాసులవాని ఖజానాకు గండివేసిన వారిపైచర్యలకు ఉపక్రమిస్తారా అనే చర్చ మొదలైంది.

**ఎమ్మెల్సీ పేరుతో నకిలీ సిఫార్సు లేఖ:** ఇదే సమయంలో మంగళవారం తిరుమలలో ఎమ్మెల్సీ పేరుతో ఓ నకిలీ సిఫార్సు లేఖ రావడం సంచలనంగా మారింది. టిడిపి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పేరుతో నకిలీ సిఫార్సు లేఖ తిరుమలకు చేరడంతో కలకలం రేపింది. ఎమ్మెల్సీ లెటర్ హెడ్‌తో నకిలీ సిఫార్స్ లేఖ తయారు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై కాకినాడ సర్పవరం స్టేషన్‌లో ఎమ్మెల్సీ రాజశేఖర్ ఫిర్యాదు చేయడం, అప్పన్న అనే వ్యక్తి తన సంతకాన్ని ఫోర్జరీ చేసి టిటిడికి లేఖ ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొనడం విశేషం.

గత రెండేళ్ళుగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు టిటిడి కల్పిస్తున్న దర్శనం, వసతి తదితర సేవలు దళారుల ప్రమేయం లేకుండా మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు టిటిడి పక్కా వ్యూహంతో ముందుకు వెళుతోంది.

తిరుమలకు వచ్చే భక్తులకు ఆఫ్‌లైన్ (కౌంటర్ సేవలు), ఆన్‌లైన్ (వెబ్‌పోర్టల్) రెండింటిల్లో అందిస్తున్న సేవలను పక్కదారిపట్టించి కొందరు దళారులు భక్తులను మోసంచేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలుచేస్తుండటం పరిపాటిగా మారింది. గతంలోనే ఆన్‌లైన్‌లో బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్ నంబర్లు, మెయిల్ ఐడి ప్రూఫ్‌లు రద్దుచేశారు.

ఫేక్ మొబైల్ నంబర్లు, మెయిల్ ఐడిలు, ఐడి ప్రూఫ్‌లు ఉపయోగించి ఇప్పటికే బుక్‌చేసిన సేవలను ఉపయోగించడానికి అనుమతింపబడవని వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేకంగా టిటిడిలో నిఘాభద్రత విభాగం ఉంది. ఐపిఎస్ అధికారి సివిఎస్‌ఒ హోదాలో ముగ్గురు విఎస్‌ఒలు (డిఎస్పీ హోదాలో), ఏవిఎస్‌ఒలు సిఐల హోదాలో, విఐలు ఎస్‌ఐల హోదాలో విధులు నిర్వహిస్తున్నారు.


ఇలాంటి నకిలీ లేఖలపై, దళారులను కనిపెట్టేందుకు విజిలెన్స్‌లో వింగ్ విభాగం మరో ప్రత్యేకం. అయితే టిటిడిలో విజిలెన్స్ విభాగం పనితీరు అసలు విధుల కంటే కొసరు విధులపైనే దృష్టి పెట్టి పనిచేస్తుండటం మాత్రం విమర్శలకు తావిస్తోంది. అయినా దళారులు అడ్డదారుల్లో అమాయక భక్తులను మోసం చేస్తూనే ఉండటం టిటిడి పనితీరును తేటతెల్లం చేసేలా మారింది.

## మొగిలిచెర్ల దత్తాత్రేయ మందిరంలో 29న రుద్ర పాశుపత హోమం



**తిరుపతి, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** వేద శాస్త్రాల ప్రకారం జ్యేష్ఠ మాస పౌర్ణమి పర్వ దినాన రుద్రపాశుపత హోమం నిర్వహించడం వల్ల శత్రు బాధలు, తీవ్రమైన గ్రహ దోషాలు తొలగిపోయి ఆయురారోగ్యాలు సర్వకార్య సిద్ధి లభిస్తాయి. త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయ స్వామి కొలువైన ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం మొగిలిచర్ల మందిరంలో ఈ రుద్ర పాశుపత హోమం ఈనెల 29న సోమవారం జరిపిస్తున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, కన్వీనర్ పవని సాయికౌశిక్ తెలిపారు. ఆరోజు మందిరంలో మహాదేవుని పాశుపత అస్త్ర మంత్రాలతో జరిగే హోమంలో పాల్గొనడం వల్ల భక్తుల కర్మదోషాలు నశించి, భగవంతుని అభయ రక్షణతో పాటు అష్టైశ్వర్యాలు, అత్యున్నత ఆధ్యాత్మిక శాంతి కలుగుతాయని అర్చకులు తెలిపారు. ప్రత్యక్షంగా పాల్గొనదలచిన భక్తులు తమ పేర్లను 72078 75712, 91828 82632, 99089 73699 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని ధర్మకర్త కోరారు.

## జులై 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం



**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జులై 16 గురువారం ఆణివార ఆస్థానం వేడుకగా జరగనుంది. ఈ ఉత్సవం కోసం తమిళనాడులోని శ్రీరంగం రంగనాథస్వామి ఆలయం నుండి ఆలయ పండితులు, అధికారులు ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు తీసుకువచ్చి శ్రీవారికి సమర్పిస్తారు. ఆస్థాన సేవను బంగారు వాకిలిలో గరుడాళ్వార్ సన్నిధిలో ఆస్థానంలో శ్రీవారి ఉత్సవమూర్తి సమక్షంలో అర్చకులు అత్యంత వేడుకగా జరుపుతారు. సర్వభూపాల వాహనంలో ఉత్సవమూర్తులను కొలువుదీరుస్తారు. మరోపీఠంపై స్వామి సర్వసైనాధ్యక్షుడైన విష్వక్సేనులస్వామి దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. పెద్దజీయర్ స్వామి వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా తీసుకొచ్చి మూలవిరాట్టుకు, మలయప్ప స్వామికి, విష్వక్సేనులవారికి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రం తో పరివట్టం (చిన్నపట్టు గుడ్డ) కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వర్యోభవ అని స్వామిని ఆశీర్వదిస్తారు. అర్చకులు పెద్ద, చిన్నజీయర్ స్వాములకు, టిటిడి తరుపున ఇఒకు 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని కుడిచేతికి ఇచ్చి, రూపాయి హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేస్తారు. అనంతరం ఈ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల వద్ద ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగుస్తుంది. జులై 16వ తేదీన ఆణివార ఆస్థానం జరగనున్న నేపథ్యంలో 14వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ రెండు ఉత్సవాల నేపథ్యంలో స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలను టిటిడి రద్దు చేసింది. జులై 13, 15

## వెంకటపాలెం టోల్‌ప్లాజా వద్ద వాహనదారుల ఆందోళన

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమ బైపాస్‌పై వెంకటపాలెం టోల్‌ప్లాజా వద్ద వాహనదారులు ఆందోళన చేశారు. టోల్‌ప్లాజా యాజమాన్యం తీరుపై వాహనదారులు నిరసన వ్యక్తం చేశారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పైకి వెళ్లేందుకు సర్వీసు రోడ్డు ఉన్నా యూటర్న్ మూసివేతపై నిరసన తెలిపారు. సర్వీస్ రోడ్డులోకి ప్రవేశాన్ని మూసివేసి టోల్ దాటేలా ఏర్పాటు చేయడంపై నిరసన తెలిపారు. స్థానికులతో పాటు లాయర్లు, సచివాలయ ఉద్యోగులు నిరసనకు దిగారు. ఆందోళన కారణంగా పశ్చిమ బైపాస్‌పై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచాయి. రాజధానికి 20 కి.మీ. పరిధిలోని అన్ని వాహనాలకు ఉచిత టోల్‌గేట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యూటర్న్ తీసుకుంటే రెండుసార్లు వసూలు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయకపోతే రేపు పెద్దఎత్తున ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

## షణ్ముఖ స్వామికి ప్రత్యేకాభిషేకాలు



**శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని పలు సుబ్రమణ్యం స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. పట్టణంలోని నలుమూలల నుంచి భక్తులు మంగళవారం వేకువ జాము నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. కొందరు భక్తులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదాలను అందించారు. సాయంత్రం స్వామికి కన్నులు మిరుమిట్లు కొల్పునట్లు అలంకారాలు నిర్వహించారు. ఉదయం నిర్వహించిన చందనాలంకారం భక్తులకు ఇట్టే ఆకట్టుకుంది.

24-6Pg7exHMNWJQE_24-6Pg7exHMNWJQE.qxd 23/Jun/26 11:54 PM Page 1





# ప్రకాశం.. పెట్టుబడుల గమ్యస్థానం!

- పారిశ్రామికవేత్తలను జిల్లా వైపు తిప్పిన ప్రకాశం జిల్లా బిజినెస్ ఎలైట్ మీట్ • 12 రంగాల పెట్టుబడి దారులు హాజరు • రూ.320 కోట్ల పెట్టుబడులకు తక్షణ ప్రతిపాదనలు • మరిన్ని రాబట్టేలా యంత్రాంగం పర్యవేక్షణ • ప్రజాప్రతినిధుల సహకారంతో సదస్సు సక్సెస్



**ఒంగోలు, జూన్ 23 ప్రభాతవార్త:** వెనుకబాటు ముద్రను తుడిపేసి ప్రకాశం జిల్లా పారిశ్రామికంగా సమగ్ర అభివృద్ధి సాధించేందుకు నిర్వహించిన ప్రకాశం బిజినెస్ ఎలైట్ మీట్-2026 గ్రాండ్ సక్సెస్ అయ్యింది. స్థానికంగా పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరిస్తూ పారిశ్రామికవేత్తల దృష్టిని ప్రకాశం జిల్లా వైపు తిప్పేలా కలెక్టర్ పి.రాజబాబు ప్రత్యేక చొరువ తీసుకోవడంతో పెట్టుబడి దారులు ముందుకు వచ్చారు. ఈనెల 22వ తేదీ రాత్రి ఒంగోలులోని ఎస్‌జీవీఎస్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఈ సదస్సులో 12 రంగాల పెట్టుబడిదారులు పాల్గొన్నారు. సుమారు రూ.320 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు తక్షణమే ఆసక్తి చూపారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరారు. కాగా, మరింతమంది జిల్లా బాట పట్టేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు సమన్వయంతో నిర్వహించిన ఈ మొట్టమొదటి సదస్సు మరిన్ని పెట్టుబడులకు నాంది పలకనుంది.

పెట్టుబడులు పెట్టేందుకు జిల్లాలో ఉన్న అవకాశాలను స్వయంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ కార్యక్రమంలో వివరించారు. ప్రకాశం జిల్లా.. అవకాశాల జిల్లా అని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో జిల్లా తలసరి ఆదాయం రూ.2,17,511గా ఉందని, జిల్లా స్థూల ఉత్పత్తి రూ.73,331 కోట్లుగా నమోదైందని తెలిపారు. వృద్ధిరేటు 15.3 శాతంగా ఉందన్నారు. రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండోసోల్ కంపెనీలతో పాటు జిందాల్ స్టీల్ కంపెనీ కూడా ఐరన్‌ఓర్ తవ్వకాల ప్రతిపాదనతో వచ్చిందన్నారు. మరో వైపు దొనకొండ మండలంలో 25వేల ఎకరాలతో మెగా ఇండస్ట్రియల్ పార్కు అందుబాటులో ఉందని చెప్పారు. జాతీయ రహదారులు, బెంగుళూరు-కడప- విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే రవాణా వ్యవస్థ రూపురేఖలను మార్చాయన్నారు. విస్తృత అభివృద్ధి అవకాశం ఉన్న 20 కిలోమీటర్ల కోస్తా తీరం కూడా ప్రకాశం జిల్లా సొంతమన్నారు. ప్రపంచంలోని 50 శాతం నగరాలు సముద్ర తీరం వెంబడే అభివృద్ధి చెందాయని కలెక్టర్ వివరించారు. ఈ వాస్తవాలను, స్థానికంగా ఉన్న అవకాశాలను వినియోగించుకొని పెట్టుబడులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సోషల్, ఇండస్ట్రియల్, సర్వీస్ రంగాలలో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని ప్రకాశం జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో కెటలిస్టుగా మారాలని పెట్టుబడిదారులను కోరారు.

**పాల్గొన్న ప్రముఖులు:** నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ సిఇఒ ఎస్.సుబ్బారావు, ఇండోసోల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బాల చందర్ కృష్ణన్, ఏపీ ప్రాజెక్ట్స్ సీజీఎం శ్రీ పీపీ షాన్ వేర్, ఏపీ రెన్యువబుల్ ఎనర్జీ ఆపరేషన్స్ హెడ్ రాజేష్ పటానియా, రవిశంకర్ గ్రూప్స్ చైర్మన్ కంది రవిశంకర్, నోవాటెల్ హోటల్స్ జనరల్ మేనేజర్లు, మనీష్, అఖిల్, దస్పల్లా హోటల్స్ ఎండీ శరత్‌బాబు, క్రేజీ హైడెట్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఎండీ శరత్‌బాబు, క్రేజీ హైడెట్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఎండీ టి.రవికుమార్, ఐకాన్ కనస్ట్రక్షన్స్ ఎండీ కే.విజయ్ కృష్ణ, పీవీపీ కనస్ట్రక్షన్స్ ఎండీ ప్రదీప్ వర్మ, సూర్య ఇంటర్నేషనల్స్ ఎండీ డాక్టర్ పెండ్యాల హరినాథ్ బాబు, ఓకస్ స్కై స్క్రాపర్స్ రియాల్టీ ప్రైవేటు లిమిటెడ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్.శివకృష్ణ పాల్గొన్నారు.

**పెట్టుబడుల ప్రతిపాదనలు:** కొత్తపట్నం బీచ్‌లో రూ.75 కోట్లతో వాటర్ అడ్వెంచర్ స్పోర్ట్స్, హోటల్, విల్లా, పర్యాటక అనుబంధ సదుపాయాలను ఏర్పాటు చేస్తామని ఢిల్లీకి చెందిన ఓకస్ గ్రూప్ ప్రతిపాదనతో వచ్చింది.

- పాకలలో రూ.50కోట్లతో బీచ్ రిసార్ట్ ఏర్పాటు చేస్తామని ఆలాస్ ఫుడ్ వరల్డ్ రెస్టారెంట్ సంస్థ ముందుకు వచ్చింది.
- రూ.75 కోట్లతో 500 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కోరింది. దీని ద్వారా ప్రత్యక్షంగా వెయ్యి మందికి పైగా, పరోక్షంగా 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపింది. రూ.100 కోట్లతో సీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని శ్రీ మంజునాథ హేచరీస్ ప్రతిపాదించింది.
- జిల్లాలో రూ.12 కోట్లతో మొక్కజొన్న డ్రయ్యర్ యూనిట్ ఏర్పాటు చేస్తామని, 150 మందికి ఉపాధి లభిస్తుందని, దీని కోసం స్థలం కేటాయించాలని ఒంగోలుకు చెందిన నాగేశ్వరరావు కోరారు. జిల్లాలో రూ.7కోట్లకు పైగా పెట్టుబడితో సోలార్ పవర్ జనరేషన్ యూనిట్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్/ వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తానని ఒంగోలుకు చెందిన పెనుబోతు అజిత్ ముందుకు వచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, బీఎన్ విజయ్ కుమార్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఏలూరి సాంబశివరావు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, మ్యారీటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, దర్శి టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, సబ్ కలెక్టర్ డి.హిమవంశి, ఇతర ఉన్నతాధికారులు, యువ పారిశ్రామిక వేత్త మాగుంట రాఘవరెడ్డి పాల్గొన్నారు.




## దాడులకు, బెదిరింపులకు భయపడం

- వైసిపి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి

**నెల్లూరు(విద్య), జూన్ 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ అవినీతిని ఎదిరించినందుకు కృష్ణచైతన్య విద్య సంస్థలపై దాడులు చెయడం నీతిమాలిన రాజకీయాలకి ప్రత్యక్ష నిదర్శనమని, ఇటువంటి దాడులకు, బెదిరింపులకు తాము బయపడే ప్రశక్తే లేదని వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైకాపా పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లడుతూ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి విద్యాసంస్థలపై దాడులు చేయడం అంటే ప్రశ్నించే వారిని అణగదొక్కడమేనన్నారు. మెగా డియస్సీలో ప్రభుత్వం చేసిన అక్రమాలను ప్రశ్నించడమే చంద్రశేఖర్ రెడ్డి చేసిన తప్పా అని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న 70 కాలేజీలను వదిలిపెట్టి కేవలం చంద్రశేఖర్ రెడ్డి విద్యా సంస్థలపై దాడులు చేయడం చూస్తుంటే కూటమి ప్రభుత్వ నేతలు రాజకీయాల్లో ఏ స్థాయికి దిగజారిపోయారు అర్థమవుతుందన్నారు. ఈ దాడులు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలేనన్నారు. ఇలాంటి వాటికి చంద్రశేఖర్ గాని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గాని భయపడిపోదని ఇంకా రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సమస్యలపై పని చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఆనం విజయకూమర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ, రాజకీయంగా ఎదుర్కోవాలే కానీ ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యంలో సరికాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## జగన్‌కు దమ్మంటే.. కాపు నేతను సిఎం అభ్యర్థిగా ప్రకటించాలి: కిరణ్ రాయల్

**తిరుపతి, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర రాజకీయాలు కులాల చుట్టూ తిరగడం దురదృష్టకరయని,రాష్ట్రంలో కాపు సామాజిక వర్గం 25నుండి 27 శాతం ఓటు బ్యాంకుగా ఉందని తిరుపతి జనసేన పార్టీ ఇంచార్జ్ కిరణ్ రాయల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా కాపుల ఓట్లు కీలకమని అభిప్రాయం వ్యక్తం చేశారు. వైసిపి నేత జగన్‌కు దమ్ముంటే ఐదుగురు కాపు నేతల్లో ఒకరిని సిఎం అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఐదుగురికి ఒక్కో ఏడాది చొప్పున సిఎం పదవి కేటాయించాలని సవాల్ విసిరారు. సిఎం అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా ముందస్తు శుభాకాంక్షలు అంటూ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. కాపు సామాజిక వర్గాన్ని వైసిసి పావులుగా వాడుకుంటోందని, ప్రతి ఘటనకు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను బాధ్యుడిగా చూపడం సరికాదని విరుచుకుపడ్డారు. పెయిడ్ ఆర్టిస్టులతో నిరసన చేయడం భూమన ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు.

## చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- రూ.11.88 లక్షల విలువైన సొత్తు రికవరీ



**నెల్లూరు(వైద్యం), జూన్ 23 ప్రభాతవార్త:** నెల్లూరు నగర పరిధిలోని వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ గృహ చోరీ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, సుమారు రూ.11.88 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చెడు అలవాట్లకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతోనే చోరీలను వృత్తిగా ఎంచుకున్న వ్యక్తి చివరకు మరోసారి కటకటాల పాలయ్యాడు. నెల్లూరు రూరల్ మండలం, రెవెన్యూ కాలనీలోని ఒక మూడు అంతస్తుల భవనంలోని మొదటి అంతస్తులో నివాసం ఉంటున్న యజమానులు తాళం వేసి బయటకు వెళ్ళిన సమయంలో, గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి గ్రిల్ గేటు, కిటికీలను తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదుతో వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సౌజన్య దిశానిర్దేశం, టౌన్ ఏఎస్పీ దీక్ష పర్యవేక్షణలో వేదాయపాలెం సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో, ఈ నెల 22న బుజబుజనెల్లూరు హైవే రోడ్డుపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉప్పు శివనారాయణ అనే వ్యక్తిని పోలీసులు గుర్తించారు. పోలీసులను చూడగానే పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా, చోరీకి గురైన సొత్తు బయటపడింది. నిందితుడి వద్ద నుండి సుమారు 162.5గ్రాములు (విలువ రూ.11,37,500) సుమారు 340 గ్రాములు (విలువ రూ.51,000) వెరసి మొత్తం రూ.11,88,500 విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన అతి తక్కువ సమయంలోనే నిందితుడిని అరెస్టు చేసి, దొంగిలించిన ఆస్తిని పూర్తిగా రికవరీ చేసిన ఏఎస్పీ దీక్షను, వేదాయపాలెం సీఐ శ్రీనివాస రావు ఇతర పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## కుళ్ళిన మాంసం విక్రయాలపై కేసులు

**తిరుపతి, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** స్మార్ట్‌సిటీ తిరుపతి నగరంలో ఇటీవల వెలుగుచూసిన నిల్వచేసి కుళ్ళిన, దుర్వాసన వస్తున్న మాంసం విక్రయాలపై దాడులు జరిగిన విషయం తెలిసిందే. దీనిపై తిరుపతి నగర ఆరోగ్యఅధికారి డాక్టర్ యువ అన్వేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి పిపిచావడి దగ్గర ఉన్నటువంటి మటన్ మార్కెట్‌లో వ్యాపారం నిర్వహిస్తున్నటువంటి ఐదుగురు వ్యాపారస్తులపై మంగళవారం తిరుపతి వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరోగ్యానికి హానికరంగా ఉన్న మాంసం నిల్వ ఉంచుకొని అమ్ముతున్నారనే ఘటనపై ఫిర్యాదు అందిదని వెస్ట్ సిఐ పి.రామకృష్ణ తెలిపారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ చెప్పారు. పిపిచావడి దగ్గర గల మాంసం మార్కెట్ సుమారు 500 కేజీలు మాంసం హానికరమైనదని గుర్తించారు. కుళ్ళిన మాంసం కలిగివున్న వ్యాపారులు ఎస్ నిషార్ బాష, షేక్ ఎస్ చాంద్ బాష, హబూబాద్ షరీఫ్, ఎస్ రఫీ, ఎస్ మొహిద్దీన్ దుకాణాల్లో భారీగా కుళ్ళిన మాంసం లబించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## మాజీ సర్పంచ్ ఆత్మహత్య

**హుస్నాబాద్ రూరల్, జూన్ 23, ప్రభాతవార్త:** హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ మాజీసర్పంచ్ పిట్టల సంపత్ మంగళవారం వ్యవసాయ బావివద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే సంపత్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నారని ఆయన కుటుంబసభ్యులు, బంధువులు పేర్కొంటున్నారు. ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, సంపత్ ఆత్మహత్యకు గ్రామాభివృద్ధి పనులకు చేసిన ఖర్చుల బిల్లులు రాకపోవడమే ప్రధాన కారణమని పలువురు మాజీ సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. ఆయన సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధి కోసం తనకు సంబంధించిన మామిడి తోటను విక్రయించి వచ్చిన డబ్బుతో అభివృద్ధి పనులు చేపట్టారని, అయితే ఆ పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సంపత్ కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు హుస్నాబాద్- కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొంతసేపు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళన కారులతో చర్చించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలను పోలీసులు విచారణ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# విద్యతోనే సమానత్వం, గౌరవం

- డి.సిఎం పవన్ ఆలోచన, మా ఆలోచన ఒకటే • ఎపి వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

**నెల్లూరు(వైద్యం), జూన్ 23 ప్రభాతవార్త:** నెల్లూరు పరమేశ్వరి నగర్ నందు గల వక్ఫ్ భూమి నందు నిర్మిస్తున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు, వక్ఫ్ సిఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ 20 కోట్లు సిఎస్ఆర్ నిధులతో కార్పొరేట్ స్థాయి స్కూల్‌ను నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాదికి అందుబాటులోకి తేవాలని శరవేగంగా, పనులు జరుగుతున్నాయని తెలిపారు. తనకు అన్ని జిల్లాల నుంచి స్థలాలు కేటాయించాలని ఫోన్లు చేస్తున్నారని స్థలాలు కేటాయిస్తే తాము కూడా స్కూళ్లు నిర్మిస్తామని ముందుకు వస్తున్నారు అని అన్నారు. తాలేం ఏ హునర్‌తో 250 మంది విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నామని, కేవలం చదువుతూనే సమానత్వం గౌరవం దొరుకుతాయని అన్నారు. వక్ఫ్ భూములు నిరుపయోగంగా ఉంటే ఆక్రమణకు గురవుతున్నాయని, ఆస్తులను నిరుపయోగంగా ఉంచకుండా ఉపయోగంలోకి తీసుకుని వచ్చి ఆదాయాన్ని పెంచుతామని తెలిపారు. స్కూల్ నిర్మాణానికి సహకరించిన మంత్రి నారాయణ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరులో ఉన్న కాలేజీలు మాత్రమే రైడ్ చేయలేదని, వెడత వారం భీమవరంలో నారాయణ కాలేజీని కూడా రైడ్ చేశారని అన్నారు. రూల్స్ పాటిస్తే అంత భయం ఎందుకని అన్నారు. మంత్రి నారాయణ స్వభావం కక్ష సాధింపులు చేసే స్వభావం కాదని, కక్ష సాధింపులు చేస్తూ మీరెవరు వ్యాపారాలు చేయలేరని హెచ్చరించారు. ప్రతిపక్షంలో మమ్మల్ని ఎందుకు కష్టాలు పెట్టారని అన్నారు. ప్రతి విషయంలో నేను ఉన్నాను ముందుకు వచ్చినప్పుడు మిస్టర్ క్లీన్‌గా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ పై రాజకీయ బురద వేయొద్దని, మీ పై ఉన్న బురద కడుక్కోవాలని అన్నారు.

ఏఎస్ పేట దర్గా విషయం పై స్పందన: ఎస్ పేట సజ్జాద హాఫీజ్ పాషా బోర్డుకు వ్యతిరేకంగా 32 కేసులు వేశారని అన్నారు. సజ్జాద పనులు సరిగ్గా చేయడం లేదని అతనికి నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. గతంలోనే అతనిని మతవల్లిగా తొలగించామని తెలిపారు. పవన్ కల్యాణ్ ఆలోచనే తమ ఆలోచన కూడా అని వివరించారు. ఎంక్వయిరీ పూర్తికాకుండా చర్యలు బహిర్గతం చేయలేమని, వెరీ పూర్తయ్యాక అతని మీద ఖచ్చితంగా చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యులు అక్రమ్, ఖాజా, ఇస్మాయిల్ బేగ్, బెపారి జాకీర్ అహ్మద్ సీఈవో యాకూబ్ ఖాజీ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర




### ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

### పాఠశాలల రాష్ట్ర బంద్ విజయవంతం

### ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్రచేస్తూ, ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల విచ్చలవిడి ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ మంగళవారం చేపట్టిన పాఠశాలల బంద్ విజయ వంతం అయిందని సంఘం రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తెలిపారు. ఈ సందర్భం గా మాచెర్ల రాంబాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పేద పిల్లలకు విద్యను దూరం చేయడం కోసమే 23000 ప్రభుత్వ పాఠశాలలను మూసి వేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కుట్ర చేస్తున్నాడనీ దుయ్య బట్టారు. ఆదివాసీ గూడెంలలో, గిరిజన తండాల్లో, దళిత వాడల్లోని పిల్లలు చదువుకోవడం ఇష్టంలేదా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో లక్షల కొద్ది ఫీజులు వసూలు చేస్తున్న ఆయా యాజమాన్యాలపై చర్య లు తీసుకోవడం లేదని, ఫీజుల నియంత్రణ చట్టం హామీని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల భూములను కాజేసేందుకే రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ బడులను మూస్తున్నాడా? అనే అనుమానం కలుగుతుందన్నారు. విద్యాసంవత్సరం మొదలై వారం గడుస్తున్నా ఇప్పటి వరకు కనీసం పిల్లలకు యూనిఫామ్స్, పుస్తకాలు అందలేదంటే ప్రభుత్వం ఎంత నిరక్ష ్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుత ందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలికవసతులు కరువయ్యాయని, ఆడపిల్లకు సరిపడా బాత్రూంలు కూడా లేని పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందన్నారు. పేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం ఉచితంగా సీట్లు అందించే విద్యాహక్కు చట్టం అటకెక్కిందన్నారు. ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీచేయక క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లోపించిందన్నారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను ఎందుకు అన్ని పాఠశాలల్లో అమలు చేయడం లేదో విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తాము నిర్వహించిన "బంద్"లో తల్లిదండ్రులు, విద్యార్థులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారని, ప్రైవేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయన్నారు. గవర్నమెంట్ పాఠశాలల్లో విద్యార్థులు బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్న సందర్భంలో కొంతమంది పోలీసులు విచక్షణ మరిచి ప్రవర్తించారని మండిపడ్డారు. అందరి మద్దతుతో రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్


# క్యూర్ ఏరియాలో లక్ష ఫ్లాట్ల నిర్మాణం

### ఎల్ఐజి హౌసింగ్ స్కీం.. పేరు ఖరారుపై పోటీ

### 28 వరకు సోషల్ మీడియాలో నిర్వహణ

### ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి రూ.లక్ష బహుమతి

### హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా అల్పాదాయ వర్గాలకు (ఎల్ఐజి) క్యూర్ ఏరియాలో ప్రతిపాదించిన లక్ష ఫ్లాట్ల నిర్మాణ పథకానికి పేరు ఖరారునకు హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం చేపట్టింది. ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన ఈ పథకానికి మంచి పేరును నేరుగా ప్రజల నుంచే స్వీకరించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ప్రజల నుంచి వచ్చిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన పేరును సూచించిన వారికి ఒక లక్ష రూపాయల బహుమతిని అందచేస్తామని, సోషల్ మీడియా వేదికగా ఈ అంశంలో బహిరంగ పోటీని నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూర్ పరిధిలో అల్పాదాయ వర్గాల ప్రజల కోసం ప్రత్యేకంగా లక్ష ఇండ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంతర్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎటువంటి వివాదాలు లేకుండా, అందుబాటులోని ధరల్లో వివిధ వర్గాల ప్రజల సొంత ఇంటి కలలను నెరవేర్చడంలో హౌసింగ్ బోర్డుకు మంచి పేరు ఉంది. అంతే కాకుండా బోర్డు ఆధ్వర్యంలో చేపట్టి ప్రాజెక్టులకు ప్రజల నుంచి ఆదరణతో పాటు డిమాండ్ కూడా ఉన్నదని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘం కాలం తరువాత చేపడుతున్న ప్రాజెక్టులో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేయాలన్న ఆలోచనతో, ప్రజల నుంచి అందే సూచనల తోనే ఈ పథకానికి పేరును కూడా ఖరారు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన పోటీని నిర్వహిస్తున్నా మన్నారు. ప్రజలు సూచించిన పేర్లలో ఉత్తమ మైనదిగా ఎంపికైన దానికి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తామన్నారు. హౌసింగ్ డిపార్ట్ మెంట్‌కు చెందిన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎల్ఐజి ఫ్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నా మని, ఇందుకు అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఇందుకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయిస్తామని, పూర్తి విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు



## పిల్లల సంరక్షణలో 'తల్లి' హోదా ఒక్కటే సరిపోదు

### ఆ తల్లి వద్ద బిడ్డ భవిష్యత్తు సురక్షితం కాదు

### పుణే ఫ్యామిలీ కోర్టు సంచలన తీర్పు

### చిన్నారి కస్టడీని తండ్రికి అప్పగిస్తూ ఆదేశాలు

**పుణె, జూన్ 23:** ఒక మహిళ తన వివాహ ప్రమాణాలను పాటించాలని, భర్తను శారీరకంగా, మానసికంగా చూసుకోవాలని, ఆయన క్షేమం కోసం ప్రార్థించాలని ఆశిస్తారు. ఒకవేళ ఆమె భర్త పట్ల ఈ 'పవిత్రమైన' బాధ్యతలను నిర్వర్తించకపోతే, అటువంటి తల్లి వద్ద వారి బిడ్డ భవిష్యత్తు 'సురక్షి తం కాదు' అని పుణె కుటుంబ న్యాయస్థానం సంచలన తీర్పు నిచ్చింది. మైనర్ బాలుడి సంరక్షణ హక్కును (కస్టడీకి) తండ్రికి అప్పగిస్తూ ఇన్‌ఛార్జ్ ఫ్యామిలీ కోర్ట్ జడ్జి గణేష్ ఘులే ఉత్తర్వులు జారీ చేశారు. భర్త విషయంలో బాధ్యతలు విస్మరించిన భార్య తన పిల్లల సంరక్షణకు అనర్హురాలంటూ కోర్టు అభిప్రాయపడింది. ఈ సందర్భంగా తల్లి వద్ద ఉంటే పిల్లాడి భవిష్యత్తు సురక్షి తం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు తల్లికి షాక్ ఇస్తూ చిన్నారి కస్టడీని తండ్రికి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా పిల్లల సంరక్షణ విషయంలో కేవలం 'తల్లి' అనే హోదా ఒక్కటే సరిపోదని న్యాయ స్థానం వ్యాఖ్యానించింది. భర్త, అత్తమామల పట్ల క్రూరంగా ప్రవర్తించే వివాహితకు పిల్లలను కస్టడీ ఇవ్వలేమని పేర్కొంది. వైవాహిక బాధ్యతలను, కుటుంబ విధులను పూర్తిగా విస్మరించిన మహిళ.. బాధ్యతారహిత ప్రవర్తన బాలుడి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని కోర్టు అభిప్రాయ పడింది. చట్టం ప్రకారం పిల్లల సర్వతోముఖాభివృద్ధే అత్యంత ముఖ్యమైన విషయమని చెప్పుకొచ్చింది. నిరంతరం గొడవలు పెట్టుకునే వాతావరణంలో చిన్నారులు సురక్షి తంగా పెరగలేరని తెలిపింది. ఈ మేరకు అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాత బాలుడి సంరక్షణ బాధ్యతను తండ్రికి అప్పగించింది. తల్లికి కస్టడీ నిరాకరిస్తూ కేవలం నిర్ణీత సమయాల్లో మాత్రమే కుమారుడిని చూసుకునేందుకు అనుమతినిచ్చింది. ఈ సందర్భంగా పిల్లలను భాగస్వామిపై పగ తీర్చుకోవడానికి ఆయుధాలుగా

## రేవంత్ అడిగారు.. నేను ఏర్పాటు చేశా

### ఎక్స్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పోస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో, మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్‌రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. 'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో, 23న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# మెస్సీ వెనుకే ఎంబాపె

## నాకౌట్‌కు ఫ్రాన్స్, నార్వే అర్హత * జోర్డాన్‌కు షాకిచ్చిన అల్జీరియా



రెండు గోల్స్‌తో ఫ్రాన్స్‌కు విజయాన్నందించిన ఎంబాపె



అల్జీరియాకు గోల్ చేస్తున్న నాథిర్ బెన్‌బొలి



గెలుపు సంబరాల్లో నార్వే ఆటగాళ్లు

**ఫెన్సిల్వేనియా(అమెరికా), జూన్ 23**

సాకర్ ప్రపంచకప్‌లో ఫ్రాన్స్ దూసుకుపోతోంది. వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. గ్రూప్-ఐలో భాగంగా ఇరాక్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్ 3-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. వందో మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కైలియన్ ఎంబాపె డబుల్ గోల్స్‌తో మెరవగా, ఒస్మన్ డెంబ్లె మరోగోల్ చేశాడు. ఈవిజయంతో గ్రూప్-ఐ నుంచి నాకౌట్‌కు ఫ్రాన్స్ అర్హత సాధించింది. వర్షంఅడ్డంకితో రెండు గంటల ఆలస్యంగా మొదలైన ఈమ్యాచ్‌లో ఎంబాపె అద్భుత ఆటతీరుతో గోల్స్ వర్షం కురిపించాడు. ఆట 14వ నిమిషంలో కార్నర్ నుంచి బంతిని గోల్ పోస్టులోకి తరలించిన ఎంబాపె సాకర్ వరల్డ్ కప్‌లో 15 వ గోల్ సాధించాడు.

ఈ గోల్ ఆధిక్యంతోనే ఫ్రాన్స్ తొలి అర్ధబాగం ముగించింది. రెండో అర్ధభాగంలోనూ ఫ్రాన్స్ దూకుడుకు ఎదురులేకపోయింది. పలుసార్లు ఇరాక్ డిఫెండర్లను చమ్కాఇస్తూ గోల్స్ చేసినంత పనిచేసింది. ఇక 54వ నిమిషంలో మరోసారి మెరిసిన ఎంబాపె రెండో గోల్ సాధించడంతో పాటు ఫ్రాన్స్‌ను 2-0తో ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. మరో పది నిమిషాలకు బాలన్ డీ ఓర్ అవార్డు విజేత ఒస్మన్ డెంబ్లె గోల్ చేయడంతో ఫ్రాన్స్ ఖాతాలో మూడో గోల్ చేరింది. మరోవైపు 1986 తర్వాత రెండో ఫిఫా ప్రపంచకప్ ఆడుతున్న ఇరాక్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

### సెంచరీ క్లబ్‌లో ఎంబాపె

ఎంబాపెకు ఇది వందో అంతర్జాతీయ మ్యాచ్. సెంచరీ క్లబ్‌లో చేరిన ఎంబాపె... రెండు గోల్స్‌తో ఫిఫా కప్‌లో గోల్స్ సంఖ్యను 16కు పెంచుకున్నాడు. ఫిఫా చరిత్రలో అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో ఎంబాపె.. జర్మనీ దిగ్గజం మిరాస్లావ్ క్లోస్ (16 గోల్స్) సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు. అంతక ముందు 15వ గోల్ కొట్టి బ్రెజిల్ దిగ్గజం రొనాల్డో రికార్డును సమం చేశాడు. ఇక ఫిఫా ప్రపంచకప్‌లో ఈసారి మెస్సీ, ఎంబాపె మధ్య నంబర్ గేమ్ నడుస్తోంది. వస్తా నీ వెనుక అన్నట్లుగా మెస్సీకి పోటీగా ఎంబాపె వరుస గోల్స్‌తో రెచ్చిపోతున్నాడు. రాబోయే మ్యాచ్‌లో మిరాస్లావ్ క్లోస్ రికార్డును బద్దలు కొట్టనున్న ఎంబాపె ఆ తర్వాత మెస్సీని దాటినా ఆశ్చర్యం లేదు.

### సెనెగల్‌పై నార్వే విజయం


ఫిఫా ప్రపంచకప్‌లో నార్వే నాకౌట్‌కు అర్హత సాధించింది. గ్రూప్-ఐలో భాగంగా సెనెగల్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో నార్వే 3-2తో విజయాన్ని అందుకుంది. నార్వే తరఫున స్టార్ ఆటగాడు ఎర్లింగ్ హాలండ్ రెండు గోల్స్ సాధించి కీలకపాత్ర పోషించాడు. మరో గోల్ మార్కస్ పెడెర్సన్ సాధించి పెట్టాడు. తొలి అర్ధ భాగం 43వనిమిషంలో మార్కస్ పెడెర్సన్...నార్వేకు తొలి గోల్ అందించాడు. ఇక రెండో అర్ధభాగం ప్రారంభమైన మూడో నిమిషంలోనే ఎర్లింగ్ హాలండ్ అద్భుత గోల్ కొట్టాడు. మరో పది నిమిషాల తర్వాత రెండో గోల్ చేశాడు. అటు సెనెగల్ తరఫున ఇస్మాయిల్ 53వ నిమిషంలో, ఇంజ్యూరీ టైమ్(90+3వ నిమిషం)లో రెండు గోల్స్ కొట్టాడు. ఈ విజయంతో నార్వే నాకౌట్ దశకు చేరుకోగా సెనెగల్ ఆడిన రెండింటిలో ఓడి ఇంటిబాట పట్టింది. ఫిఫా ప్రపంచకప్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలవడం నార్వేకు ఇదే తొలి సారి. ఇక ఎర్లింగ్ హాలండ్ అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో గోల్స్ సంఖ్య 59కు చేరింది. లీగ్ దశలో నార్వే తన చివరి మ్యాచ్‌ను ఫ్రాన్స్‌తో ఆడనుంది.

### జోర్డాన్‌పై అల్జీరియా సంచలనం

గ్రూప్-జెలో సంచలనం నమోదైంది. జోర్డాన్‌పై 2-1 గోల్స్ తేడాతో అల్జీరియా సంచలన విజయం సాధించింది. ఫిఫా ప్రపంచకప్‌లో గెలుపు బోణీ చేయాలన్న జోర్డాన్ ఆశలపై నీళ్లు చల్లింది. తొలి అర్ధభాగంలో జోర్డాన్ ఆధిక్యం చాటగా, రెండో అర్ధభాగంలో అల్జీరియా ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి అర్ధభాగం 36వ నిమిషంలో నిజర్ అల్‌రష్దన్ గోల్‌తో జోర్డాన్ 1-0 ఆధిక్యం కనబరిచింది. రెండో అర్ధభాగం ప్రారంభమైన 25 నిమిషాల వరకు ఆధిక్యాన్ని కాపాడుకుని గెలుపుపై ధీమాతో నిలిచింది. 69వ నిమిషంలో నాధిర్ బెన్‌బొలి గోల్ చేసి అల్జీరియాను 1-1తో సమవుజ్జీగా నిలిపాడు. ఇక మరో పది నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందగా అమినె గుయిరి గోల్ చేసి అల్జీరియాకు విజయం సాధించిపెట్టాడు. జోర్డాన్ ఆడిన రెండింటిలోనూ ఓటములతో ఫిఫా ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది. అర్జెంటీనా రెండు విజయాలతో గ్రూప్-జె నుంచి ఇప్పటికే నాకౌట్ బెర్తును ఖరారు చేసుకోగా, రెండో బెర్తు కోసం ఆస్ట్రియా-అల్జీరియా మధ్య పోటీ నెలకొంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు నాకౌట్‌లో ప్రవేశిస్తుంది.

# ఒకే ఒక్కడు

ఆట



**డాలస్, జూన్ 23 :** సాకర్ అభిమానులను లియోనెల్ మెస్సి మానియా ఊపేస్తోంది. అంచనాలకు అనుగుణంగా ఈ ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా స్టార్ గోల్స్ వర్షం కురిపిస్తున్నాడు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనే ఏకంగా అయిదు గోల్స్ కొట్టిన మెస్సి... ఫుట్‌బాల్ చరిత్రలో అరుదైన ఘనత అందుకున్నాడు. ఆస్ట్రియాతో మ్యాచ్‌లో మరో రెండు గోల్స్ చేసిన మెస్సి.. సాకర్ ప్రపంచ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. మొత్తం 18 గోల్స్‌తో జర్మనీ దిగ్గజం మిరోస్లావ్ క్లోజ్(16 గోల్స్)ను అధిగమించాడు. తొలి మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో అర్జెంటీనాకు అద్భుత విజయం అందించిన మెస్సి... రెండో మ్యాచ్‌లోనూ చెలరేగాడు. 38వ నిమిషంలో ఓ గోల్, అదనపు సమయం (90+5 నిమిషం)లో మరో గోల్ సాధించాడు. ఇప్పటివరకు అర్జెంటీనా అయిదు గోల్స్ చేస్తే అవన్నీ మెస్సి అందించినవే కావడం విశేషం. 18 గోల్స్‌తో మెస్సి అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. నిజానికి మెస్సి ఖాతాలో మరో గోల్ చేరాల్సింది. 9వ నిమిషంలో లభించిన పెనాల్టీని లియోనెల్ మెస్సి వృథా చేశాడు. లేదంటే గోల్స్ సంఖ్య 19కు, ఈ ఫిఫా ప్రపంచ కప్‌లో రెండో హ్యాట్రిక్ నమోదయ్యేది.

2006 జర్మనీలో జరిగిన ఫిఫా ప్రపంచకప్‌లో తొలి సారి ఆడిన లియోనెల్ మెస్సికిది ఇది ఆరో సాకర్ వరల్డ్‌కప్. సెర్బియాపై తొలి గోల్ సాధించిన మెస్సి అప్పటినుంచి గోల్స్ వర్షం కురిపిస్తూనే ఉన్నాడు. 2010 సౌతాఫ్రికాలో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్‌లో గోల్స్ ఖాతా తెరవలేదు. ఇక 2014 ఫిఫా కప్‌లో నాలుగు గోల్స్, 2018లో ఒక గోల్, ఖతర్‌లో జరిగిన 2022 ఫిఫా కప్‌లో ఏకంగా ఏడు గోల్స్ సాధించాడు. ఈ ప్రపంచకప్‌లో ఇప్పటికే అయిదు గోల్స్ నమోదుచేశాడు. వరుసగా రెండో ఫిఫా కప్ అందించే జోరులో కొనసాగుతున్నాడు. ఒక ఫిఫా ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా జస్ట్ ఫొంటైన్(ఫ్రాన్స్, 13 గోల్స్) పేరిట రికార్డు ఉంది.



## పద్మశ్రీ రోహిత్, పద్మభూషణ్ విజయ్ అమృత్‌రాజ్

**న్యూఢిల్లీ, జూన్ 23:** ఇండియన్ టెన్నిస్ లెజెండరీ విజయ్ అమృత్‌రాజ్ పద్మభూషణ్, క్రికెటర్ రోహిత్ శర్మ పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. రాష్ట్రపతి నిలయంలో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలను ప్రదానం చేశారు. టీమిండియా ఉమెన్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ గత నెలలో అవార్డు అందుకోగా, తాజాగా రోహిత్ పద్మశ్రీ స్వీకరించాడు. టీమిండియాకు అందించిన సేవలకు గుర్తింపుగా రోహిత్ శర్మకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారం ప్రకటించింది. రోహిత్ కెప్టెన్సీలో భారత్ 2024 టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకోవడంతో పాటు, 2025 ఛాంపియన్స్ ట్రోఫీని కూడా కైవసం చేసుకుంది. పద్మశ్రీ అందుకున్న భారత క్రికెట్ ప్రముఖుల జాబితాలో ఇప్పుడు రోహిత్ శర్మ కూడా చేరాడు. కాగా భారత టెన్నిస్‌కు గుర్తింపు తెచ్చిన విజయ్ అమృత్‌రాజ్... పలు విజయాలు అందించాడు. 1974, 1987లో డేవిస్ కప్‌లో భారత్‌ను రన్నరప్‌గా నిలపడంతో కీలక పాత్ర పోషించాడు. కెరీర్‌లో 16 సింగిల్స్, 13 డబుల్స్ టైటిల్స్ గెలుపొందాడు.

## పాక్‌ను చిత్తుచేసిన భారత్ హాకీ వీరులు

**లండన్, జూన్ 23:** ఎఫ్‌ఐహెచ్ ప్రో లీగ్ హాకీలో టోర్నీలో భారత్ విజయపరంపర కొనసాగిస్తోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 4-3 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఓ దశలో వెనకబడ్డా పుంజుకున్న హర్మన్‌ప్రీత్ సేన... అద్భుత ప్రదర్శన చేసింది. భారత్‌కు అభిషేక్, నీలకాంత శర్మ, సుఖ్‌జీత్ సింగ్, రాజిందర్ సింగ్ చేసిన గోల్స్ అందించారు. పాకిస్థాన్ తరఫున అహ్మద్ నదీమ్, అబు మహమూద్, మొయిన్ షకీల్ గోల్స్ చేశారు. ఎనిమిదో నిమిషంలో పాకిస్థాన్‌కు లభించిన పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని నదీమ్ సమీపం నుండి గోల్‌గా మలచడంతో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. రెండో క్వార్టర్‌లో సర్కిల్ మధ్య నుండి అభిషేక్ చక్కటి గోల్‌తో స్కోరును సమం చేశాడు. రెండు నిమిషాల తర్వాత, హర్మన్‌ప్రీత్ కొట్టిన డ్రాగ్‌ఫ్లిక్ గోల్ పోస్టుకు తగిలి రీబౌండ్ కాగా నీలకంఠ దాన్ని గోల్‌గా మలిచాడు. 40వ నిమిషంలో సుఖ్‌జీత్ అద్భుతమైన డైవింగ్ షాట్‌తో భారత్ ఆధిక్యాన్ని 3-1కు చేర్చాడు. జూన్ 25న ఇంగ్లాండ్‌తో తదుపరి మ్యాచ్ ఆడనుంది.



# పెట్టుబడుల విత్‌డ్రాతో నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, జూన్ 23:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం తీవ్ర స్థాయి అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, ర్యాలీ తర్వాత లాభాల స్వీకరణ ప్రభావంతో సెన్సెక్స్ దాదాపు 900 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ 23,850స్థాయి దిగువకు జారిపోయింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 893.39పాయింట్లు క్షీణించి76,200.68వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ278.80పాయింట్లు నష్టపోయి 23,824.10 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో కూడా భారీ అమ్మకాలు నమోదయ్యాయి. ముఖ్యంగా దక్షిణ కొరియా కోస్పీ సూచీ 9 శాతానికి పైగా కుప్పకూలడంతో ట్రేడింగ్ తాత్కాలికంగా నిలిపివేసింది. ఐటీ, మెటల్ రంగ షేర్లలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి. మరోవైపు అమెరికా డాలర్ బలపడటం, రూపాయి బలహీనపడటం, ఇన్ఫోసిస్ 3.42శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.75 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.55 శాతం నష్టపోయినిఫ్టీకి ఎక్కువ నష్టం తెచ్చాయి . బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.88 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం క్షీణించాయి.

ఎన్‌ఎస్‌ఈలో 1,020 షేర్లు లాభపడగా, 2,280 షేర్లు నష్టపోయాయి. 99షేర్లు మార్పులేకుండా ముగిశాయి. 10ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి 6.851 శాతం నుంచి 6.826 శాతానికి తగ్గింది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 94.73 వద్ద స్థిరపడింది. ఎంసీఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ ధర 0.96 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,46,722కు చేరితు బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 77.41 డాలర్లకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లు ఒత్తిడిలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరిన్ని వడ్డీ రేటు పెంపులు చేపట్టే అవకాశాలు పెరగడంతో ప్రపంచ మార్కెట్లలో ఆందోళనలు నెలకొన్నాయి. ఈ ఏడాది ముగిసేలోపు కనీసం రెండు సార్లు 25 బేసిస్ పాయింట్ల చొప్పున వడ్డీ రేట్లు పెరగవచ్చని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. వాల్ స్ట్రీట్‌లో సోమవారం ఎస్‌అండ్‌పీ 500 సూచీ 0.37 శాతం, నాస్‌డాక్ 1.32 శాతం పడిపోయాయి. డౌ జోన్స్ సూచీ స్వల్ప లాభంతో ముగిసింది. ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ షేరు 1.55 శాతం పెరిగితే వేదాంత షేరు భారీ బ్లాక్ డీల్స్ కారణంగా 7.73 శాతం కుప్పకూలింది.





ఇన్ఫో ఎడ్జ్ (ఇండియా) 2.79 శాతం, ఎన్‌పీఎస్‌టీ 5.54 శాతం ఎగిసింది. సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ 3.05 శాతం, ఇంటరార్చ్ బిల్డింగ్ సొల్యూషన్స్ రూ.165 కోట్ల ఆర్డర్ పొందడంతో 1.19 శాతం లాభపడింది. బిర్లా కార్పొరేషన్ 1.32 శాతం, డిఫ్యూజన్ ఇంజినీర్స్ 2.55 శాతం పెరిగాయి. టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ ఐపీఓకు 1.19 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. వాటర్‌వేస్ లీజర్ టూరిజం ఐపీఓకు కేవలం 0.18 రెట్లు మాత్రమే స్పందన వచ్చింది. అద్వైత్ జ్యువెల్స్ ఐపీఓకు మాత్రం భారీ స్పందన లభించి 10.49 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.



## ధరల్లో భారీ పతనం.. 3 శాతం తగ్గుదల

# పసిడి, వెండిపై ఫెడ్ రిజర్వు ఎఫెక్ట్

**ముంబై, జూన్ 23 :** అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరిన్ని వడ్డీ రేట్ల పెంపులకు పాల్పడవచ్చన్న అంచనాలు ప్రపంచ పెట్టుబడిదారుల సెంటిమెంట్‌పై ప్రభావం చూపడంతో మంగళవారం బంగారం, వెండి ధరలు బలహీనయ్యాయి. పసిడి వెండి ధరలు 3 శాతం వరకు తగ్గాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఆగస్టు డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 10 గ్రాములకు రూ.1,46,776 వద్ద ప్రారంభమైంది. గత ముగింపు ధర రూ.1,48,188తో పోలిస్తే రూ.1,412తక్కువ. మధ్యాహ్నం 12 గంటల సమయానికి బంగారం ధర రూ.1,46,379 వద్ద ట్రేడవుతూ, గత ముగింపుతో పోలిస్తే రూ.1,739 నష్టాన్ని నమోదు చేసింది. ట్రేడింగ్ సెషన్‌లో గరిష్టంగా రూ.1,47,090, కనిష్టంగా రూ.1,46,070 స్థాయిలను తాకింది. ఇక జూలై డెలివరీ వెండి ఫ్యూచర్స్‌లో బంగారంతో పోలిస్తే మరింత ఒత్తిడి కనిపించింది. వెండి ధర కిలోకు రూ.2,27,676 వద్ద ప్రారంభమై, గత ముగింపు ధర రూ.2,34,310తో పోలిస్తే రూ.6,634తగ్గింది. తదుపరి ట్రేడింగ్‌లో వెండి ధర2,27,119 వద్ద కొనసాగుతూ రూ.7,191 నష్టాన్ని చవిచూసింది. రోజంతా కనిష్టంగా రూ.2,26,556 స్థాయిని తాకి 3.30 శాతం వరకు పడిపోయింది. గరిష్టంగా 2,28,800 వద్ద నమోదైంది. రానున్న కాలంలో రూ.2,30,500 రూ.2,31,600 మధ్య ప్రతిఘటన ఉండగా, రూ.2,28,000మద్దతుస్థాయికి దిగువకు వెళితే ధరలు రూ.2,26,000, ఆపై రూ.2,24,000 వరకు పడిపోయే అవకాశం ఉందని బులియన్ నిపుణులు అంచనా వేశారు. మరోవైపు, వెండి ధర మళ్లీ రూ.2,30,000 మార్కును అధిగమిస్తే కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అమెరికా డాలర్ బలపడటం, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగించవచ్చన్న అంచనాలే విలువైన లోహాల ధరల బలహీనతకు ప్రధాన కారణమని నిపుణులు వివరించారు. అదనంగా, ఈ వారం విడుదల కానున్న అమెరికా ఉపాధి, నిరుద్యోగ గణాంకాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించారని, అవే బంగారం, వెండి ధరల దశదిశలు నిర్ణయించే కీలక అంశాలుగా మారవచ్చని నిపుణుల అంచనా.


# బ్యాంకింగ్ వ్యవస్థలోకి 1.41లక్షల కోట్ల నగదు ప్రవేశపెట్టిన ఆర్బీఐ



**ముంబయి, జూన్ 23:** బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా నగదును విడుదల చేసింది. ఏడు రోజుల వీఆర్ఆర్ అంటే వేరియబుల్ రేట్ రెపో వేలం ద్వారా రూ.1.41లక్షల కోట్ల తాత్కాలిక నిధులను విడుదలచేసింది. జీఎస్టీ చెల్లింపుల కారణంగా వ్యవస్థలో ఏర్పడిన నగదు కొరతను అధిగమించేందుకు ఆర్‌బీఐ ఈచర్యలు చేపట్టింది. ఇటీవలి జీఎస్టీ చెల్లింపుల వలన బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో నగదు బయటకు వెళ్లింది. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత ఒక్కసారిగా పడిపోయింది. ఈనెల 21న రూ.30,685 కోట్ల మిగులుతో ఉన్న వ్యవస్థ, 22నాటికి రూ.19,971 కోట్ల లోటుకు చేరుకుంది. ఈ పరిణామంతో స్వల్పకాలిక మనీ మార్కెట్ వడ్డీ రేట్లపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. సగటు కాల్ మనీ రేటు 5.43 శాతానికి చేరింది. ఇది ఆర్‌బీఐ రెపో రేటు కన్నా 0.18 శాతం ఎక్కువ. ఈ క్రమంలో రంగంలోకి దిగిన ఆర్‌బీఐ, వ్యవస్థలో తగినంత నగదు ఉండేలా చర్యలు తీసుకుంది. 5.26శాతం కటాఫ్ రేటుతో బ్యాంకులకు నిధులను అందించింది. ఇలాంటి సమయాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోతే, నిధుల సమీకరణ వ్యయంపెరిగి, ఆర్థిక వ్యవస్థలో రుణ ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. ఇది ఆర్థిక మందగమనానికి దారితీసే ప్రమాదం ఉంది. ఆర్బీఐ సాధారణంగా పన్ను చెల్లింపులు, ముందస్తు పన్ను చెల్లింపులు లేదా ఇతర కాలానుగుణ రుణ డిమాండ్ వంటి కారణాల వల్ల ఏర్పడే స్వల్పకాలిక నగదు లోటును సరిచేయడానికి వివిధ ద్రవ్య విధాన సాధనాలను ఉపయోగిస్తుంది.

తాత్కాలిక నగదు అవసరాల కోసం వీఆర్ఆర్ వేలం ప్రక్రియను నిర్వహిస్తుంది. బ్యాంకులు తమ వద్ద ఉన్న ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐ వద్ద తాకట్టు పెట్టి నిధులు పొందుతాయి. దీర్ఘకాలిక ద్రవ్య లభ్యత కోసం ఆర్‌బీఐ సెకండరీ మార్కెట్ నుంచి ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయడం లేదా డాలర్‌రూపాయి స్వాప్ వేలాలను నిర్వహించడం వంటి చర్యలు చేపడుతుంది. తాజాచర్యతో బ్యాంకింగ్ వ్యవస్థలో స్వల్పకాలిక నిధుల ఒత్తిడి తగ్గి, ఆర్థిక కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మార్గం సుగమమైంది.


## ఎఐతో 21వేల మందికి కోతపెట్టిన ఒరాకిల్





**న్యూయార్క్:** కృత్రిమ మేధ(ఏఐ) టెక్నాలజీ వేలాది ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తోంది. అమెరికా టెక్నాలజీ దిగ్గజం ఒరాకిల్ 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 21వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు వెల్లడించింది. ఏఐ ఆధారిత కార్యకలాపాల విస్తరణ, వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తన వార్షిక నివేదికలో పేర్కొంది. గత ఏడాది 1.62 లక్షల మంది ఉద్యోగులు ఉండగా 2026 మే 31 నాటికి ఆ సంఖ్య 1.41 లక్షలకు తగ్గింది. సంస్థ ఉద్యోగుల సంఖ్యలో ఇది దాదాపు 13 శాతం తగ్గుదల. ఏఐ టెక్నాలజీల వినియోగం ఇప్పటికే ఉద్యోగ కోతలకు దారితీసిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కోతలు కొనసాగొచ్చని ఒరాకిల్ స్పష్టం చేసింది. ఒరాకిల్ ప్రస్తుతం డేటాబేస్ సాఫ్ట్‌వేర్ సంస్థగానే కాకుండా, ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో కీలక సంస్థగా ఎదగడానికి భారీ పెట్టుబడులు పెడుతోంది. ఓపెన్‌ఏఐ వంటి సంస్థల అవసరాల కోసం భారీ డేటా సెంటర్ల నిర్మాణంలో నిమగ్నమైంది. ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 70 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రణాళికలకు నిధులు సమకూర్చేందుకు మరో 40 బిలియన్ డాలర్లు రుణాలు, ఈక్విటీ రూపంలో సమీకరించాలని సంస్థ భావిస్తోంది. ఈ భారీ ఏఐ పెట్టుబడులు సంస్థపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయి. పునర్వ్యవస్థీకరణ, ఉద్యోగుల తొలగింపుల కోసం 2026 ఆర్థిక సంవత్సరంలో ఒరాకిల్ 1.84 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఈ వ్యయం కేవలం 374 మిలియన్ డాలర్లు మాత్రమే ఉండటం గమనార్హం.

## 109.27 కోట్లకు ఇంటర్నెట్ కనెక్షన్లు: ట్రాయ్





**న్యూఢిల్లీ, జూన్ 23:** భారత టెలికాం రంగం శరవేగంతో వృద్ధిని కొనసాగిస్తోంది. దేశంలో ఇంటర్నెట్, టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య భారీ స్థాయిలో పెరిగినట్లు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తాజా నివేదిక వెల్లడించింది. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 109.27కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా, కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది. ట్రాయ్ నివేదిక ప్రకారం మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ (మొబైల్) ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. వీరిలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లుగా ఉండగా, న్యారోబ్యాండ్ (56 కేబీపీఎస్ కంటే తక్కువ వేగం) సబ్‌స్క్రైబర్లు 2.69 కోట్లుగా ఉన్నారు. త్రైమాసిక ప్రాతిపదికన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల బేస్ 5.81 శాతం పెరగడం విశేషం. ఇంటర్నెట్‌తో పాటు మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా 133.05 కోట్లకు పెరిగింది.

దీంతో దేశవ్యాప్తంగా టెలిడెన్సిటీ (ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్లు) గత త్రైమాసికంలోని 91.74 శాతం నుంచి 93.26 శాతానికి మెరుగుపడింది. వైర్‌లైన్ టెలిడెన్సిటీ సైతం 3.33 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం (ఏఆర్‌పీయూ) కూడా టెలికాం సంస్థలకు సానుకూలంగా ఉంది.

## మూడు రోజుల్లోనే 52లక్షల కోట్లు హాంఫట్

**ముంబై, జూన్23:** పీవోతో మార్కెట్‌లోకి అడుగుపెట్టిన సంచలనం నమోదుచేసిన అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఈ కంపెనీ షేర్లు వరుసగా మూడోరోజూ పతనమయ్యాయి. కేవలం మూడు రోజుల్లోనే కంపెనీమార్కెట్ విలువ 600 బిలియన్ డాలర్లకుపైగా (సుమారు రూ.52 లక్షల కోట్లు) కరిగిపోయింది. స్పేస్‌ఎక్స్ షేరు మరో 16 శాతం క్షీణించి 154.60 డాలర్ల వద్ద ముగిసింది. కంపెనీ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే.

గత మూడు ట్రేడింగ్ సెషన్లలో షేరు మొత్తం 23శాతం పడిపోయింది. దీంతో మార్కెట్ విలువ భారీగా తగ్గినా కంపెనీ మొత్తం విలువ ఇంకా 2 ట్రిలియన్ డాలర్లకు పైగానే ఉంది. ఏఐ రంగంలో విస్తరణకోసం స్పేస్‌ఎక్స్ భారీమొత్తంలో నిధులు సమీకరించేందుకు బాండ్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల కంపెనీపై అప్పుల భారం పెరిగే అవకాశం ఉందని, ఏఐ పెట్టుబడులు ఆశించిన ఫలితాలు ఇస్తాయా అనే సందేహాలు కూడా ఇన్వెస్టర్లలోవ్యక్తమయ్యాయి. దీంతో షేర్లపై అమ్మకాల ఒత్తిడి పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రికార్డు ఐపీవో తర్వాత స్పేస్‌ఎక్స్ షేర్లపై రిటైల్ ఇన్వెస్టర్ల ఆసక్తి భారీగా కనిపించింది. తొలి ఐదు రోజుల్లోనే వ్యక్తిగత పెట్టుబడిదారులు 405మిలియన్ డాలర్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. స్పేస్‌ఎక్స్ భవిష్యత్ వృద్ధిపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండటంతో షేర్ ధర చాలా పెరిగిందని, అందుకే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14